

జ్యోతి
జులై
రూ. 3
ఓ కథ
ముగిసింది
నవల
వివిన మూర్తి



భారత్ ఫిలిమ్స్

ఇది కథ కాదు

మాటలు గణేష్ పాత్రో పాటలు ఆచార్య ఆత్రేయ

లక్ష్మీఫిలింస్ నిర్మాత డి. విశ్వేశ్వరరావు సంగీతం ఎం.ఎస్. విశ్వనాథన్ ఫొటోగ్రఫీ

JYOTHI


నవతా ఆర్ట్స్
ఇంటింటి రామాయణం
ఎన్.కృష్ణంరాజు
పి.సాంబశివరావు
కలర్
అన్నపూర్ణ

తొలిమాట

గత సంచిక విడుదలయిన తరువాత, తిరిగి ఈ సంచిక తయారయేలోపు రెండు మహాశక్తులు ఆంధ్రదేశానికి అమిత వేదనను కలిగించాయి. ఒక శక్తి వెళ్ళి పోయీ, ఒక శక్తి ప్రవేశించీ ఈ నష్టాన్ని కలుగజేశాయి.

వెళ్ళిపోయిన శక్తి గుడిపాటి వెంకటచలం. తెలుగు సాహిత్యంలో సంచలన కారుడు. సంప్రదాయపు ఆలోచనలపై ధ్వజమెత్తి తుపానులా దండయాత్ర చేసి పోరాటం సలిపిన వీరుడు. తను నమ్మిన సత్యాలను నలుగురికీ పంచేందుకు నిర్విరామంగా కృషి సలిపినవాడు. చాలా కాలంగా అస్వస్థులయి ఉన్నా, ఉన్న దారి వేరు. ఇప్పుడు చలం మన మధ్య లేడంటే వేదన కాదా మరి! తన మహాప్రస్థానానికి దీటైన ముందుమాట చెప్పిన చలం మరణవార్త విని 'ఇదీ జయప్రకాష్ మరణవార్తలాటిదే అనుకున్నాను. నిజంగా అలా జరిగితే ఎంత బాగుండును' అన్నారు మహాకవి శ్రీశ్రీ. నిజమే అలా జరిగితే ఎంత బాగుండేది!

ఆంధ్రదేశాన్ని దెబ్బతీసిన మరో శక్తి మేలో 'వచ్చిన' తుపాను. బంగాళా ఖాతంలో ఏ మూలో ప్రారంభమై, మనిషి సాధించిన విజ్ఞాన ప్రగతితో దోబూచులాడుతూ, ముందు మద్రాసు నగరాన్ని బెదిరించి, భయపెట్టి, చటుక్కున కొంచెం ప్రక్కకు జరిగి ఆంధ్రదేశంపై విరుచుకుపడింది. రెండు సంవత్సరాలనాడు వచ్చిన తుపాను దివిసీమను సర్వనాశనం చేసి వదిలింది. ఇప్పుడు నెల్లూరు, ప్రకాశం జిల్లాలు విపరీతంగా నష్టపడ్డాయి. ప్రకృతి మనిషిని అప్పుడప్పుడూ యిలా సవాలు చేస్తూనే ఉంటుంది. దాన్ని తట్టుకొని నిలబడగలిగే శక్తి మనిషిది. అలా నిలబడతాడు కూడా!

ఆపదలో చిక్కుకుని అలమటిస్తున్న తుపాను బాధితులైన సాటి ఆంధ్రులను ఆదుకొని, తుపాను వచ్చిన గుర్తులు కూడా కనబడనీయకుండా వారు కోలుకోగలిగేలా చేయవలసిన బాధ్యత తెలుగువారందరిదీను.

అలాగే.... వెడలిపోయిన మహాశక్తి చలం గుర్తును మాత్రం శాశ్వతం చేసుకోవలసిన బ్యాతధ కూడా ఆంధ్రులపైనే ఉంది.

ఉత్తరాలు

సాహిత్యము వర్సెస్ పత్రికలమీద జరిగే ఆసక్తిదాయకమయిన చర్చని చదువుతున్నాను. పత్రికలు లేకపోతే వుత్తమ సాహిత్యం రాదు అని ఈ బాల్ పెన్‌తో మరింత గట్టిగా నొక్కి రాస్తున్నాను.

పత్రిక కూడా పుస్తకమే. కాకపోతే వివిధ రుచులకు అనుగుణంగా శీర్షిక లుంటాయి. ధర తగ్గించడానికి ప్రకటనలుంటాయి. ప్రకాశకులు ప్రచురించే పుస్తక రూపంలో వస్తేనే అది మంచి సాహిత్యం అవుతుంది, పత్రికలలో వస్తే కాదు అసలు రాదు అనటం సబబు కాదు.

మనకి అతి గొప్ప గ్రంధాలుగా గుర్తింపబడ్డ రామాయణం, మహాభారతం ఈ రోజుల్లో వ్రాయబడివుంటే ఆ రచయితలు ఏలూర్ రోడ్ లోని పబ్లిషర్స్ దగ్గరకి వెళ్ళకుండా పత్రికలకే పంపివుండేవారు. రచయిత తన రచనని వీలయినంతమంది ఎక్కువ పాఠకులు చదవాలన్న కాంక్షతో పత్రికలకి రాస్తాడు. చిన్న వుదాహరణ. యద్దనపూడిగారి సెక్రటరీ నా చిన్నతనంలో ఇదే జ్యోతిలో ఎంతో వుత్సాహంగా చదివాను. కాని పుస్తక రూపంలో వచ్చిన వారి 'గిరిజా కళ్యాణం' చదవలేకపోయాను ఆసక్తి వున్నా. అంత ఖరీదు పెట్టలేను. అదే పత్రికలో వస్తే నువ్వు, నువ్వు, నువ్వు, నేను—అంతా చదివి వుండేవాళ్ళం ఆవిడ మిగతా నవలలలాగా.

పోతే నా అభిమాన ఆంగ్ల రచయిత సోమర్‌సెట్ మామ్ 'కాస్మోపాలిటన్' అనే పత్రికలో 29 కథలు రాసాడు. ఎడ్గర్ వాలెస్ అనేక పత్రికలకి సీరియల్స్ రాసాడు. అదే విధంగా పి. జి. ఓడ్‌హౌస్ కూడా పత్రికలలో రాసాడు. ఈ ముగ్గురు అంతమాత్రాన వుత్తమ సాహిత్యం సృష్టించలేక పోయారనా? అటు అమెరికాలో మార్క్ ట్వయిన్ నుంచి అనేక మంది పత్రికలలో రాసారు.'

రచయితకి పాఠకుడికీ మధ్య వున్న గొప్ప బ్రిడ్జి పత్రికకాని పబ్లిషింగ్ హౌస్ ప్రచురించే పేపర్‌బేక్ కాదు.

సో-జ్యోతి సంపాదకుల వాదనకే నా ఓటు. **Magazine feeds itself, feeds the writer and feeds the reader as well.**

—రేవతి

ఇప్పుడే "వేలాడిన మందారం" పుస్తకం చదవటం పూర్తి చేశాను.

Extremely moving—మొదటి భాగమంతా ఎడ్యుకేటివ్‌గాపోయినా 'నవల'లో లైఫ్ మూవింగ్‌నెస్ లక్ష్మికి ఉరి వార్తతో ప్రారంభమయిపోతుంది. ఒంటరిగా గదిలో 2-30 నుండి 5-30 వరకు చదువుతూ వుంటే చివర్లో ఎన్ని కన్నీళ్ళు రాలిపోయాయో తెలియదు. ఆగకుండా దుఃఖం పొంగిపోతూ వుండింది. బహుశా మా నాన్నగారి మరణం తర్వాత దుఃఖం పొంగి పొరిలింది ఈనాడే. జీవితంలో అట్టడుగు విలువల్ని, హృదయాంతరాళాల్ని కెలికినట్లయింది. ఇంతగా నన్ను కదిలించిన పుస్తకం నేను ఇదివరకు చదవలేదు. ఎక్కడికక్కడ **education** తో **teaching** తో సాగిన ఈ నవల చదువుతుంటే వాళ్ళతోపాటు ఆ సంఘటనల్లో వాళ్ళ జీవితంలో కదిలినట్లు, జీవించినట్లు అనిపించింది. తండ్రి ఘోష, జైలువాళ్ళ బాధ, పెరిగే కొడుకు నిష్క్రమణ,

అంతిమ చర్యల వర్ణన, శిల్పం అద్భుతం. మనకు తెలియకుండానే లోపల్నుండి పెగులక వచ్చే దుఃఖాన్ని తెస్తుంది. ఆ ఘట్టాల్లో, ఎంతో సహజ చిత్రణ, బోధన, వర్ణనలతో అత్యంత సహజంగా సాగిన నవల పాఠకుల్ని కదిలించక తప్పదు. కన్నీళ్ళే కాక గుండె బరువెక్కడమే కాక, ఉద్రేక పదునెక్కిస్తుంది.

సబ్ టైటిల్స్ చాలాఎఫెక్టివ్‌గా వున్నాయి. ముఖ్యంగా లక్ష్మి ప్రసవవేదన, జైలు పని వాళ్ళ మానవత్వంతో కూడిన నిశ్శబ్ద సహకారం, ప్రకాశం డాక్టరుగారి ఓర్పు, నేర్పు, ఆ వాతావరణ చిత్రణ చాలా ఎఫెక్టివ్‌గా, సహజంగా చిత్రించబడ్డాయి. అలాగే ఏసుబాబు చివరగా తల్లి కల్సినప్పుడు చెప్పిన మాటలు ఆ ఘటనలు కుదిపివేస్తాయి. కవి తండ్రి ఘోష, ఆర్తనాదం, శాపం, పొయిటిక్‌గానే గాక, సహజంగా పాత్రోచితంగా కూడా వున్నాయి. చివర ముగింపుకి తీసుకు వెళ్ళిన తీరు చాలా పటిష్టంగా వుంది. కరుణ, దుఃఖం దుఃఖరిత, ఉద్రేకరహిత యోచన స్థితికి పాఠకుల్ని నెట్టే తీరు చివరన అతి ప్రభావితంగా నడిచింది.

—అరుణబాబు, చున్నాబట్టి,
(మహారాష్ట్ర)

శ్రీ 'జ్వాలాముఖి' వ్రాసిన వేలాడిన మందారంలో హత్యానేరంపై ఒక యువకుడికి, ఒక యువతికి ఉరిశిక్ష విధించబడి, అమలు చేయబడ్డం—దాని వెనకనున్న గాధలు చిత్రించారు. ఆ స్త్రీయే వేలాడిన మందారంగా ముఖచిత్రంలో కూడ ఉంది. స్త్రీని పువ్వుతో పోల్చడం అనాదిగా వస్తున్నదే. అయితే ఇందులో స్త్రీ ఉరి తీయబడ్డంచేత మందారపువ్వుని తల్లి చెట్టే నిర్దాక్షిణ్యంగా వేలాడదీసి నేలరాలుస్తోందనడం సమంజసంగా లేదు. ప్రకృతిలో ఏ పువ్వు అయినా వికసించి, ఫలదీకరణ పొందినతర్వాత సహజంగా నేలరాలిపోతుంది. అది తల్లి చెట్టు నిర్దాక్షిణ్య మెలాగవుతుంది? మధ్యలో యెవరైనా పువ్వుని కోస్తే అది తల్లిచెట్టుకు వర్తించదు.

స్త్రీ పాత్ర 'లక్ష్మి' జైలులో అందరికీ ఆత్మీయురాలు, తలలో నాల్కగా ఉండాలని రచయిత అనుకొని ఉండవచ్చు కాని అందుకు తగిన ఆధారాలు కనిపించలేదు. డాక్టరు ప్రకాశం వచ్చిన తరువాత ఆ పాత్ర దిగువ స్థాయిలోనే ఉండిపోయింది. ప్రకాశం చెప్పేది వ్యాసాల్లాగున్నా ప్రజాపోరాటాలను మెచ్చే వాళ్ళకు నచ్చుతాయి. తప్పుదోవ పట్టినవాళ్ళకి కనువిప్పు కల్గిస్తాయి. కాని మధ్యతరగతి పాఠకుడిమీద గాఢంగా ముద్ర వేయవు. గొంగళీ పురుగు గూడుకట్టుకొని కొంతకాలానికి సీతాకోకచిలుక అయినట్టుగా, ఈ దోపిడీ సమాజం కొంతకాలానికి అందమైన సోషలిస్టు సమాజంగా మారడం.... గూడు కట్టుకొని నిద్రపోయినంత సులభంగా జరుగదు. ఆ విషయం ప్రకాశం ప్రజాపోరాట ఉద్యమంలో వుండి జైలుకు రావడమే తెలియజేస్తోంది. దీనిపై తగినంత పాఠకుల దృష్టి పడేలా చేస్తే బాగుండేది. రాఖీ పండుగను ప్రకాశం ఉపయోగించుకున్న విధం బాగున్నది.

'ఆ రాత్రి' వర్ణన—"స్త్రీ జీవితం పయ్యెదలో పాలు....కంటిలో నీరు" అనే హిందీకవి (మైథిలీ శరణ్ గుప్త?) అభిప్రాయం భయానక ఉరి దృశ్యం వేలాడిన ఎర్ర మందారంగా పోలిక....లక్ష్మి పాత్ర పట్ల జాలి కలిగేలా పాఠకుడిమీద ఎక్కువ ప్రభావం కలగజేస్తున్నాయి....కాని ప్రజాపోరాటాలమీద కాదు.

—అంబరీష (విశాఖపట్టణం)

మే '79 'జ్యోతి' ఉత్తరాల శీర్షికలో నంద్యాల పాఠకుల ఉత్తరం చదివేను. ఉత్తరానికి జవాబు చెప్పేముందు,....

'పొద్దుతిరుగుడు పువ్వు' నవల గురించి....

పొద్దుతిరుగుడు పువ్వుకు వర్తింపజేసిన ఒక Phenomenon కూ 'నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి' అని ఆడదాని జీవితానికి వర్తింపజేసిన ఒక ఆదేశానికీ సామ్యం కనిపించి స్త్రీ తన కుటుంబ 'పరిధి'లో తన వ్యక్తిత్వాన్ని సగౌరవంగా నిలుపుకోగలగాలనే ప్రతిపాదనతో పాత్రలూ సంఘటనలూ అల్లుకొని వ్రాసిన

నవల యిది. అంతేకాక ఇది ఒక అసలైన తెలుగు సినిమాకోసం వ్రాసిన నవలే.

పరిమాణం దృష్ట్యా సంపాదకులు ఈ నవలరో కొన్ని భాగాలు తొలగించకుండా ఉండి ఉంటే, సినిమా టైటిల్సు అవగానే యూనివర్సిటీ కాలేజీ ఫంక్షనులో జరిగే అంతర్నాటకం దగ్గర్నుంచి, డ్యూయేటు సీన్లూ, కామెడీ సీన్లతో తెలుగుసినిమా'లాగా'కాకుండా యింకా స్పష్టంగా తెలుగు సినిమాయే కనబడేది మరి!

ఆ తర్వాత ఉత్తరం గురించి....

నవలలోలాగే ఉత్తరంలో కూడా కొన్ని కోతలు పడ్డాయేమో తెలీదుకాని (ఉత్తరంలో కోతలు లేవు— ఎడిటర్.) కొన్ని పేరాల భావంగాని, సందర్భంగాని అర్థం కాలేదు. అర్థమయినవాటికి వివరంగా జవాబు చెప్తున్నాను.

"కథలో రవి, ప్రేమరాజు మన తమలపాకు హీరోలే. సరోజ, గీత చెలియకట్ట దాటలేని సముద్రాలే...."

అవును. పాఠకులు చెప్పినట్లు రవీ, ప్రేమరాజూ మన తమలపాకుల హీరోలే. For a change అద్దమైన ఆకూ కొరకాలని సృష్టించిన పాత్రలు కాదు! సరోజ, గీత కూడా చెలియలి కట్టు దాటని సముద్రాలుగా వుండాలని కోరి వ్రాసినవే. మనం స్త్రీ 'ఎంత ప్రకృతి స్వరూపిణి' అని ఘోషించినా ఆ సముద్రాలు చెలియలు కట్టలు దాటనంతవరకే! అవి దాటితే ఘోషించడానికైనా మనం మిగలొద్దూ!

"చైతన్యం కావాలంటే ప్రాబ్లమ్ చెప్తే సరిపోదు. దీన్ని జీవితంతో అన్వయిస్తూ సమాధానాన్ని సూచించాలి. అది చెప్పటం చేత కాకపోతే జర్నలిజం డిప్లమా....తర్వాత జర్నలిస్టూ. ..అదీ చేతకాకపోతే స్వంత ప్రెస్సూ పేపరూ....అదీ చేతకాకపోతే...."థాంక్‌గాడ్! జంట పాఠకులు జాయింటు గేమ్‌లో కాస్త ఊపిరి తీసుకోవడంకోసం ఆగి పేరా మార్చేసేరు. లేకపోతే... చైతన్యం కావాలంటే. .. స్వంత ప్రెస్ దగ్గరైనా ఆగకుండా....మరో Planet మీదకు ఏ షికారుకైనా వెళ్ళమనే వారేమో! వాళ్ళ సొమ్మేం పోయింది! వెనుకటికి ఓ జాలిగల తల్లి ఓ చిన్నారి పాపముందు "పాపం ఆ పేదవాళ్ళకి తినడానికి బ్రెడ్ కూడా లేదమ్మా" అని వాపోతూంటే ప్రపంచం తెలియని ఆ పసిపాప "బ్రెడ్ లేని పేదవాళ్ళు కేకులు తినొచ్చు కదా!" అందిట సిన్సియర్‌గా. అలా ఉంది సలహా!

ఇంక జ్యోతి పుస్తకంలో సమస్యలు దొరకనట్టే నిజ జీవితంలోని సమస్యలకు, హోమియో రిపర్టరీలో రోగానికి మందులు దొరికినట్లు, నవలల్లో సమాధానాలు దొరకవు. రిపర్టరీలో దొరికిన మందులు కూడా వైద్యులు రోగికి సరిగా అన్వయించలేక రోగాలకంటే వేగంగా మందులతో రోగుల్ని చంపేస్తున్న ఈ రోజుల్లో నవలల్లోంచి సమాధానాలు తీసేసుకుంటే యింకేమన్నా ఉందా! మారణహోమం కోసం అణ్వస్త్రాలమీద చేసే further research ఆపేయవచ్చు!

కళ్ళూ, ముక్కూ, చెవులూ.. .అందరికీ ఉందికూడా ఒకరికి భిన్నంగా మరొకరు కోట్లాది మనుష్యులు ఉన్నట్లుగానే జీవితంలోని సమస్యలు అనంతరం... అవి మనిషి మనిషికీ, చోటు చోటుకీ, క్షణక్షణానికీ....మారుతూనే ఉంటాయి. వీటన్నిటికీ ఒక సమాధానం అంటూ ఉండదు. కాకపోతే సహజీవనానికి అవకాశాన్నిచ్చే మన సత్వాన్ని అలవరచుకోమని అనేక ఉదాహరణలద్వారా (రకరకాల కథల ద్వారా) సూచించగలం. సరోజకీ రవికీ యిద్దరికీ కాఫీ తాగే అలవాటుంది మొర్రో అంటూ నప్పుడు ఒకళ్లకి లేదనుకొని లేని సమస్యని సృష్టించుకోవడం ఎందుకు? అయినా రోజుకు రెండు పూటలా ఠంచనుగా చిక్కని ఫిల్టరు కాఫీ తాగే అలవాటున్న వాళ్ళకు ఎదుటి వాళ్ళ మనోభావాన్ని గ్రహించే సంస్కారం లేకపోతే, తనకు కాఫీ అలవాటులేక,అది మానేస్తే బాగుంటుందనే సలహా యిచ్చిన మగాడు ఎంత రాక్షసుడవుతాడో, అరగంటకోసారి కాఫీ తాగి గుప్పెడు వక్కపొడి బొక్కే అలవాటుండి అవి అందించమంటూండే మగాడు కూడా అంతే రాక్షసుడవుతాడు.

"సరోజ....మనసు చివుక్కుమన్నప్పుడు, అదే "ఆ గుర్తు దొరికిన రోజు" మొగుణ్ణి కొట్టొచ్చు కదా!...."

తల నొప్పిగా ఉంటే వెళ్ళి ఓ అనాసిన్ బిళ్ల కొనుక్కొని వేసుకోచ్చు కదా! అన్నంత సులువుగా చెప్పేసేరు మొగుణ్ణి కొట్టమని! మరి యిది పాఠకులు ఏమంత "బాధ్యత"తో యిచ్చిన సలహాయో తెలీదు. అసలు అనా దేమిటి? కథ సరిగా గుర్తుంటే సరోజ తన మొగుడు చెంప పగలకొట్టినప్పుడు కూడా కొట్టలేదు. ఉట్టుట్టిగా బెదిరించింది అంతే! ఆ తర్వాత లెక్చరర్ యిచ్చేముందే అలా బెదిరించడంకూడా ఉట్టుట్టిదని చెప్పేసి క్షమాపణ చెప్పేసుకుంది. ఎందుకంటే ఆలుమగల మధ్య వుండే పరస్పరానురాగం militant approach వలన యింకా తొందరగా ఆవిరయి పోతుందన్న commonsense ఉన్న కొద్ది మందిలో సరోజ ఒకర్తె కనుక!

ఒక్క కొటేషన్‌కే సంతోషించేసి మిగిలిన నవలలు చదవనైనా చదవకుండా ఫస్టు ప్రైజ్ ఈ నవలకు ఇచ్చెయ్యవచ్చని పాఠకులు చేసిన రికమెండేషనుకు థాంక్స్!

"మేడం: సరోజా! ప్రపంచంలో అన్నింటి కంటే త్వరగా అంతర్ధానం అయిపోయేది ... దాంపత్యం తల్లీ! అంటూ వచ్చి నిజాన్ని చెప్పేసి అది అంతర్ధానం కాకుండా చూసుకోవటం కళ అంటూ వచ్చి అబద్ధం చెప్పి సుంది. అది కళ కాదు. కామన్‌సెన్స్. అది లోపించే 90 శాతం జంటలు యాంత్రికంగా..."

నాన్సెన్స్! నూటికి తొంభై మందికి లోపించినదాన్ని common sense అనడం వచ్చి అబద్ధం అవుతుందో, అదో కళ అనడం వచ్చి అబద్ధం అవుతుందో జంట పాఠకులు కాస్సేపు వేరువేరుగా ఆలోచించి తరువాత అన్యోన్యంగా ఓ నిర్ణయానికొస్తే బాగుంటుంది! లేకపోతే యివి నలుగురూ చదువుతున్నారు?

"ఈ నవలలో లాటరీ తగిలినట్లు, స్వతహాగా సంస్కారం కలిగిన రవి, ఒక లెక్చర్‌తో బాగుపడిపోతాడు. ఇది జరిగేదా?...."

స్వతహాగా సంస్కారం కలిగినవాడు బాబోయ్ అని మొత్తుకుంటున్నా ఇది జరిగేదా అని నిలబెట్టి అడిగేస్తే ఖచ్చితంగా జరుగుతుంది అని మొండికెయ్యవలసి వస్తుంది! అంత తాడు తెగే దాకా లాగకూడదు.

"స్వీట్ హోమ్ 003 వచ్చింది మీ కలం నుంచేనని మర్చిపోకుండా ఈ సమాధానం చేతనయితే చెప్పండి!....irresponsible గా పారడీలు రాయడంఅనుకున్నారా రచనలంటే?"

యస్! పారడీలు రాయడం కూడా రచనలే! అవి irresponsible అని అంటే సరిపోదు, ఋజువు చెయ్యాల్సివుంటుంది. దానికి జ్యోతి ఉత్తరాల శీర్షిక సరియైన వేదిక కాదు! నాకు directగా వ్రాసినా జవాబు చెప్తాను.

చివరకు.

ఆలుమగలు ఒకరినొకరు సానుభూతితో అర్థం చేసుకొని అన్యోన్యత పెంపొందించుకోవాలని చెప్పే "పొద్దు తిరుగుడు పువ్వు" నవల మంచిరచన కాదు అంటే పరవాలేదు కాని బాధ్యత లేని రచన అంటే అది 'బాధ్యత' లేని విమర్శ అవుతుంది.

అదీకాక ఒక తెలుగుసినిమా కథలాంటికథ తమకు నచ్చలేదనో, అసహజంగా వుందనో, పేలవంగా ఉందనో చెప్పడానికి బదులు, లండన్ సంఘటనలు, రంగనాయకమ్మగార్లు, జర్నలిజం దిప్లమాలు, స్వంతప్రెస్‌లు, కూనలమ్మ పదాలు, రెలెటివిటీలు, టాటా బిర్లాలు, షెర్లాక్స్ హోమ్స్‌లు, బాపు, రవి వర్మ, లినార్డో, డావిన్సీలు, గిరీశం లెక్చర్లూ, చివరికి అనాసిన్లూ అస్తవ్యస్తంగా అల్లి self contradicting ideas వల్లించి అడ్డమైన ప్రశ్నలూ వెయ్యడం నక్క పెట్టుకున్న పులివాతల్లా కనబడుతున్నాయి.

—యామిని

మహిళాజ్యోతి

వినకు కుమారీ!

"ఎవరండీ! ఓహో! వేంకట నరసింహ కవీంద్రులా? రావయ్యా పే....ద్దమనిషీ! రా...,రా! వచ్చి ఈ ఆసనం స్వీకరించండి."

"అదేమిటి కుమారీ! హాశ్చర్యంబొదవెన్! 'నువ్వం'టూ అగౌరవం, 'మీరం'టూ మర్యాద!"

"తమరు సెలవిచ్చిన నాలుగు మంచి ముక్కలకీ గౌరవం. ఇక....నువ్వు నుడివిన పనికిమాలిన పాత చింతకాయపచ్చడి నీతి వాక్యాలకీ అగౌరవం."

"ఆఁ!....ఆఁ!!"

"ఆ! మరే! మొగుడి కాళ్ళమీద చేయివేయకుండా అలిసిపోయిన ఆడకూతురు నిద్రపోతే ఆ పనీ పాటాలేని యముడు, ఆవిడ చేతులు కట్టేసి గద తీసికొని శిక్షిస్తాడా? నీకు రాసిచ్చాడా? పోనీ ఏ కాళ్ళ నొప్పులో ఏడ్పి, "ఛస్తున్నానే పెళ్ళవా పట్టవే" అంటే పట్టినా అందవేఁ,అదో డ్యూటీలా....అరి....నీ రూల్సు మండిపోనూ! "పతి పరకాంతలతో సంగతి జేసిన నాదు పుణ్యగతి యిట్లనుచున్ మతి దలపవలయు"నా! ఏం? ముఖంమీద పేడనీళ్ళు చల్లొద్దూ అటువంటి పెడబుద్ధి పుట్టినవాడికి. "పతి పాపపు పని చెప్పిన బ్రతిమాలి మరల్ప వలయు" అంతవరకు బాగానే వుంది. ఆ శుంఠ వినకపోతే "హితమనుచు నాచరింపుము" ఏం మనిషివయ్యా! ఆ ఆడపిల్లకీ యుక్తాయుక్త విచక్షణా జ్ఞానం, మనసు, ఇష్టం, అయిష్టం ఏవీ లేవుటయ్యా? ఓ మగపురుగు మొగుడయినందుకు అది ఏ చండాలప్పని చెప్పినా కాదనక....అబ్బెబ్బే "హితమనుచు" మరీను చేసితీరాలా?

మొగుడి ఎంగిలి మెతుకులు కతకని ఆడది...."అది ఒక సతియా? కడు బాప జాతి" అంటావుటయ్యా! ఎందుకీ కడుపు మంట! చూస్తూ వుంటే పెళ్ళాంచేత కండు బెల్లు తిన్నట్టున్నావు.

దాని కర్మకాలి, ఇంట్లో ఏ నిముషమో కాస్త విసుగ్గా అనిపిస్తే, అలా పక్కింటికెళ్ళి రావడానికి ఇన్ని ఆంక్షలుటయ్యా! పెద్దలెవరూ ఇంటలేకపోతే, ఆఖరికి ఆ బొడ్డూడని పసి వెధవ మరదిగాడి పెర్మిషనయినా పుచ్చుకోవాలా? లేకుంటే కాలు బైటపెట్టకూడదా? మగాడయినందుకేనా ఆ గుంటడికి అంత అధికారం? తనకంటె పెద్దది, మాతృసమానురాలైన వదినగారికి అనుజ్ఞ యిచ్చేంత అధికారం!?

బావ పిల్లల్ని, మరది పిల్లల్ని తన పిల్లలకంటె ఎక్కువ మక్కువ కలిగి వుండాలా? ఎందుకొచ్చిన బడాయి కబుర్లు! పోదూ! పైగా కీర్తి వస్తుందట.

"తానమ్ముడు వడియైనం దీనుండగు భర్త యార్తి దీర్చుట సతికిన్ మానము" మరి దీనురాలైన భార్య యార్తి దీర్చడానికి భర్త ఏం చేయాలి? ఎడంకాలితో తన్ని, 'మరొకస్త్రీ' అంటూ పరుగుతియ్యాలి. అంతేకదా?

పతివ్రత మృతిబొందితే "పురుషాగమనంబు"న కెదురుచూస్తూ స్వర్గంలో గేటుదగ్గర కావలా కాయాలా? అన్నట్టు....గేటు దగ్గర నిలబడకూడదుకదూ! అక్కడకూడా ఓ మూల గదిలో ఘోషా పాటిస్తూ మొగుడుకోసం ఎదురుచూడాలి.

ఏ నలకూబరుడో రమ్మని పిలిస్తేనో....అదే

రాసిలేని 'రాస్‌హవుస్'

కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలో "రాస్ హవుస్" అనే పెద్ద బంగళావుంది. స్వతంత్రం వచ్చాక యీ బంగళాలో అప్పటి చీఫ్ సెక్రెటరీ శ్రీ పరమేశ్వరన్ నివసించేవారు. కొద్ది కాలంలో ఆయన శ్రీమతికి పక్షవాతంవచ్చింది. వెంటనే ఆయన ఆ బంగళా ఖాళీచేసి, వేరే చిన్న బంగళాలోకి వెళ్ళిపోయారు.

తర్వాత తిరువాన్కూర్ - కొచ్చిన్ ముఖ్య మంత్రి అయిన శ్రీ టి. కె. నారాయణ పిళ్ళె "రాస్ హవుస్"లో ప్రవేశించారు. ఆయన ప్రవేశించిన కొద్దికాలంలోనే అతని తల్లిగారు మరణించారు. అతని ముఖ్యమంత్రి పదవి కూడా పోయింది.

ఆ తరువాత C. కేశవన్‌గారు చీఫ్‌మినిష్టరు అయి "రాస్ హవుస్"లో నివశించేవారు. నివశించిన కొన్నిరోజులకే అతని కుమారుడు ప్లేన్ ప్రమాదంలో మరణించాడు. కేశవన్‌గారి మినిస్ట్రీకూడా రద్దు అయింది.

కేశవన్‌గారు "రాస్ హవుస్" వదిలాక శ్రీ టి. ఎమ్. వర్గీస్‌గారు అందులో ప్రవేశించారు. ప్రవేశించిన కొన్ని రోజులలోనే అతని కుమార్తె మరణించింది.

1967 లో E. M. S. నంబూద్రిపాద్‌గారు చీఫ్ మినిస్టరు అయ్యాక, అతని మంత్రి మండలిలోని పారిశ్రామిక మంత్రి T. V. థామస్‌గారు "రాస్ హవుస్"లోకి ధైర్యంగా ప్రవేశించారు. అతి త్వరలోనే అతనిపై ఎంక్వయిరీ నడచి మంత్రి పదవి పోగొట్టుకున్నారు.

1969 లో రవీంద్రన్ అనే మంత్రి ఆ బంగళాలో నివసిస్తూండగా, ఆ ప్రభుత్వం డిసాల్వ్ అయింది. తర్వాత శ్రీ అచ్యుత మీనన్ ముఖ్యమంత్రిగా వుండగా, అతని క్యాబినెట్‌లోని పి. కె. రవీంద్రన్ అనే మంత్రి "రాస్ బంగళా"లో వుండేవారు. అతను పెళ్ళి చేసుకుని "హానిమూన్"లో విహరిస్తూండగా, అతని మంత్రిపదవి పోయింది.

పిదప T. V. థామస్‌గారు రెండవసారి మినిస్టరు అయి "రాస్ హవుస్"లో వుండేవారు. అప్పుడు అతనికి చాలా జబ్బు చేసింది. భయపడి వెంటనే "రాస్ హవుస్" ఖాళీ చేశారు. తర్వాత గోవిందనాయర్ అనే మంత్రిగారు "రాస్ హవుస్"లో నివసించేవారు. నివశించిన కొద్దిరోజులలోనే పాపం అతని ఒకే ఒక్క కుమారుడు మరణించాడు.

1977 మార్చి నెలలో పరిశ్రమల మంత్రి శ్రీ వాసుదేవనాయర్‌కి "రాస్ హవుస్"యివ్వబడింది (వుండటానికి). అతనికి మాత్రం "రాస్ హవుస్" అచ్చివచ్చింది. ఆ బంగళాలో ప్రవేశించిన రెండు సంవత్సరాలకి శ్రీ వాసుదేవ నాయర్ కేరళ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు. ("ఇండియా టుడే" ఆధారంగా)

—ఎస్. లక్ష్మి.

మిటి కవీంద్రా....మొహవలా చిటపటలాడిస్తావు?

"మను నాధుడు తరలినచో, వెనువెంటనే పోయి...." నిన్నూ....

పెద్దవాడివని వూరుకుంటున్నాను. ఏం కుళ్ళు బుద్ధయ్యా నీది? ఆ ఆడకూతురిది ప్రాణం కాదూ? జీవితాశ ప్రతి ప్రాణికీ సహజమేకదా?

అసలొక 'జీవి'లా చూసార్టయ్యా ఆడదాన్ని మీరు? నీ నీతులూ, సూక్తులూ, పుణ్యం చూపించి ఆశపెట్టడాలు, పాపం పేరు చెప్పి భయపెట్టడాలు? అసలు మీరు చెప్పే ఈ నీతి వాక్యాల్లోనే .... మీ మగవాళ్ళ, అసూయ, భయం, స్వార్ధం, సంకుచితత్వం, అణచివుంచాలనే ఆరాటం అన్నీ వ్యక్తమవుతున్నాయ్?

నవ్వాలో, ఏడవాలో తెలియకుండా వుంది. అసలు మీ కందరికీ వాడు తాత.

ఎవడూ...."నస్త్రీ స్వాతంత్ర్య మర్హతీ" అన్నాడే....వాడు. నాకు గట్టి అనుమానం. ఏ ఆడదాని చేతిలోనో శృంగభంగం పొంది వుంటాడు.

ఆ.... ఆ....ఏమిటయ్యా మహానుభావా? అలా పరుగుతీస్తావేం? కాసింత మంచి తీర్థం పుచ్చుకుని....అరే... ఏకపరుగే....ఏమిటి తాత ద్దాకా వెళ్ళాననా....ఆ....

—సాహితి



చెలం మహాప్రస్థానం

తనమీద పరాన్న భుక్కులా బతికి
అలసిపోయిన కాలం బరువుని
నరకంలో విసిరివేయడానికి
చెలం ప్రయాణం కట్టాడు!
'రానిస్తారో లేదో అన్నట్టు
భయపడుతో తొంగి చూసె

ఊపస్సె
వొదలలేక వొదలలేక
ఒక్కొక్క తేజాంగుళినే
వెనక్కి తీసుకుని
పడమట అదృశ్యమైనట్లు'
జీవితంలో ప్రతి అడుగునా
తనని నిలవనీకుండా చేసిన
అసంతృప్తికి కారణభూతమైన
'విశ్వ మానవ వ్యథ'ని సృజియించినవాణ్ణి
ఎదుర్కొవడానికి మనకి కనిపించకుండా
అదృశ్యమయ్యాడు చెలం!
మోహోద్రేకంతో, జ్ఞానోద్రేకంతో
రెండుసార్లు తన 'మజిలీ' మార్చిన చెలం
యిప్పుడు మనకు పూర్తిగా అంతుచిక్కని
మూడో మజిలీ వేసాడు!
మనమంతా అర్భకులం!
ఆయన రాసింది సాహిత్యమనో
ఆయన నమ్మింది భక్తి అనో
పేర్లు పెట్టుకున్న మనకు
ఆయన జ్ఞాననేత్రం యిచ్చిపోలేదు!
ఈ లోకంలో వున్న బాధ అంతటితోనూ
చీకటి అంతటితోనూ
నిరంతరం పోరాడి
లోకంలో వున్న ప్రతి ప్రాణికి
బాధని, భయాన్ని దూరం చేయమని
దేవుడిమీద యుద్ధం ప్రకటించడానికి
ఈ 'శోకార్ణవాన్ని' సృష్టించిన
నాథుడ్ని వెతుక్కుంటూ
బయలుదేరాడు చెలం మహర్షి—
'శబ్దాతీతమైన నిశ్శబ్దంలోకి!
సమస్తమూ నిండిన నిరామయంలోకి!'

—'చందూ'

మినీకథ :

స్టీల్ సంతల సయ్యాటలు

'బెగ్ బారో ఆర్ స్టీల్" అనేది పుస్తకాలను గూర్చి చెప్పిన ఒక క్వొటేషను. కాని చివర్ది వుంది చూశారూ! అది ప్రస్తుతం ఆడ వాళ్ళ యిష్టా రాజ్యంగా ఉన్న అంశం. ఆఫీసుకు వెళ్ళిన ఆయనగారి బట్టల్ని స్టీలుగిన్నెల వాడి భోజనానికి స్టీల్ చేసి వాడిచ్చే బొచ్చెలతో సంతలు యేర్పరచుకొని ఆడది స్టీలు కాగడా వేసి గాలించినా నాక్కానబళ్ళేదు. కొంపలో జాగావున్నా, లేకపోయినా, అవసరమున్నా, లేకపోయినా, స్టీలు సామగ్రిని పోగేసుకుని అందరమ్మల ముందు'పోజు' చూపటం అనేది నేటి పడతుల్లో చాలమందికి ఫాషన్. స్టీలు సామగ్రి వాడకం ఆరోగ్యానికి మంచిదికాదు అని డాక్టర్లు మొత్తుకొంటున్నాగానీ, పోదురూ! నేను వాడకానికి కొంటున్నానా! 'షో' కోసం కానీ! అని బాహాటంగా చెప్పుకొనే వారు మన భామల్లో కోకొల్లలు. కనుక బయటకు వెళ్ళే మగాయనల్లారా! తస్మాత్ జాగ్రత్త! మీ బట్టలన్నీ యీ స్టీలు సంతల బారిని పడకుండా రుమాలుతోసహా జాగ్రత్తగా తాళాలు (వీలుంటే స్టీలువి) వేసుకుపొండి. ఆ స్టీలు తాళాల తళుకులైనా మీ తరుణుల్ని వాటిని పగలగొట్టకుండా చేయగలవని ఆశిద్దాం. లేదా వీలుంటే మీ బాస్‌ను మంచిచేసుకొని (ఆయన మగాడయితే సహానుభూతి వుండొచ్చు) మీ గుడ్డలు ఆఫీసులోనే తగలేసుకోండి. లేకపోతే మీరు సాయంత్రం యింటికి వచ్చేసరికి డ్రాయరు, బనీనే మీకు దక్కుతయి. చీకూ, చింతా లేకుండా మీ బెటర్ హాఫ్‌గారు మీ ముందుకు వచ్చి, చూచారా! మీ బట్టలన్నీ వాడి యెదాన పడేసి యీ పెద్ద స్టీలు చెంబా తీసుకున్నాను. అని విజయగర్వంతో చెప్పగలదు. మీకు వళ్ళు మండి, "నన్నుగూడ యిచ్చెయ్యలేకపోయావా! ఒక చిన్నపాటి గ్లాసయినా యిచ్చేవాడు" అన్నారో! దెబ్బతిన్నారే! ఆమె కన్నీరు ప్రవహించి అంతకుముందే కొన్న స్టీలు గిన్నెల్ని నింపుతుంది. అవి అంతకుమించి వుపయోగించవులెండి మరి.

ఇటీవలి కాలాలలో ఈ "స్టీలువతుల పిచ్చి" యెంతగా ముదిరిపోయిందంటే వంటి నున్న బంగారాన్ని వలిచి యిచ్చియైనా ఈ తళతళలాడే తక్కువ వుక్కుముక్కలు ముమ్మందు పొందుతారేమోనని భయమేస్తుంది. వీరి బలహీనతల్ని అడ్డం పెట్టుకొని స్టీలుస్టాళ్ళ వాళ్ళు బాగుపడుతున్నారు. వాయిదాల స్కీములనీ, అవనీ, యివనీ యేవో చెప్పి డబ్బు దండుకొని 'పరారీ' అవుతున్నా ఈ తేలుకుట్టిన దొంగలకు తెలివిరావటంలేదు. రెండోరకం, మూడోరకం పాత్రలు యిచ్చి మర్నాటికే నల్లబడే వాటిని తోమలేక స్త్రీల మొహాలు తెల్లబడుతున్నాయి. విమ్, చింతపండు వంటి తోముడు సామగ్రి ధరలు చుక్కల్ని నిక్కుతున్నా మన భామలు బిక్కమొహాలేసుకు చూస్తున్నారు తప్ప స్టీలు వలలోంచి బయటపడటంలేదు. భర్త విరహమైనా భరిస్తారుగాని స్టీలుసామగ్రి వాటి విరహం వీరు భరించలేరు. (పాపం శమించుగాక! యిక్కడ వాడి అంటే వాడియైన అని నా భావం). స్టీలువాడు స్టయిల్‌గా అందరమ్మల ఘనస్వాగతాన్నందుకుంటూ బట్టలు, యిత్యాది సామగ్రి వాళ్ళ కళ్ళముందే దోచేసి ఒక చెంబానో, ఒక బుడ్డిచెంబో యిచ్చేటప్పటికి సమస్త సామ్రాజ్యాన్ని జయించుకొన్నట్లుగా యింటావిడ కళ్ళు మిలమిలా మెరుస్తాయి. దసరా, సంక్రాంతి పండుగలకు బొమ్మల కొలువునైనా మానుతున్నారుగాని యింటింటా యీ స్టీలు కొలువులు మానటంలేదు మన 'స్టీలవ్వ'లు. పైగా విలువైన యిత్తడి కంచు పాత్రల మారకంతో స్టీలు సామగ్రి చేర్చుకోవటం అవివేకం అని మనం అంటే మిగిలేవి శాపనార్థాలే.

సంసారం అన్న తరవాత గిన్నెలు అవసరమే కాని 'అతి'ని ప్రేమించే యీ స్టీలవ్వలు తగ్గకపోతే సమాజం 'స్టేల్' అవుతోందని నా భయం. ఇంటింట స్టీలు సంతలు వున్నకారణంగానే మనకు రావల్సిన స్టీలు ఫ్యాక్టరీ వెనకబడిపోతోందని ఒక వర్గంవారి బలమైన భావం.

మిగిలిన విషయాల్లో స్వాతంత్ర్యం, సమ భావం వున్నా, లేకపోయినా స్త్రీలు సంతల సేకరణలో మాత్రం అది అంది పుచ్చేసుకొని కొంపలో కాలు పెట్టటానికిగూడా జాగాలేకుండా చేస్తున్నారు కొందరు వనితలు. స్త్రీలు పిచ్చిని కార్టూనిస్టులు హెచ్చరిస్తూ వెలికి తెస్తున్నారు. ఇటీవల ఒక కార్టూన్‌లో అర్ధనగ్నంగా నిలబడ్డ స్త్రీని స్త్రీలువాడు ఆ మిగిలినవికూడా యిస్తే మరో గిన్నె యిస్తాను అని గడుసుగా అనటం నేడు అతిశయోక్తి కావచ్చునేమో కాని నేటి స్త్రీలిజం రేపు నిజం చేస్తుందేమో! మరో కార్టూనులో వున్నట్లు స్త్రీలు గిన్నెల మైకంలో మునిగిన మగువ చీరను స్త్రీలుగిన్నెలవాడు నాణ్యం పేరుతో అపర దుశ్శాసనుళ్ళా పట్టుకు లాగుతున్నా పట్టించుకోని దుస్థితి రాకూడదు.

స్త్రీలవతుల వల్ల వస్త్రహీనులెవ్వే అభాగ్యులంతా తమ మాన సంరక్షణ ధ్యేయమని స్త్రీలు గిన్నెలవాళ్ళను బ్రతిమలాడితేగాని వాళ్ళు చెంచా ఒకటికి 100 రూ॥ అయినా చెప్పి. వీరి మానం, మనళ్ళాంతి కాపాడరేమో? భవిష్యత్తులో పెండ్లి చేసుకోబోయే మొగాళ్ళనైనా స్త్రీలు పిచ్చిదాన్ని కాని దాన్ని చేసుకొని సుఖపడమని కోరటం సమంజసమనిపిస్తుంది. కొంప వెంబడి తిరిగి బట్టలు పుచ్చుకొని పొయ్యేవాళ్ళని బేన్‌చేసి ప్రభుత్వం పదుగురి మానరక్షణం చేయాలి. అంతవరకు స్త్రీలు సంతల సయ్యాటలకు గుడ్‌బై లేదు. స్త్రీలవతుల ఆటకట్టుకాదు. ఏమంటారు?

"సుచంద్ర"

ఓవర్ స్పీడ్

శంకరమఠం దగ్గర బస్‌కోసం ఎదుర్చూసి విసిగి ఆటోని కేకేశేం. వెంకటేశ్వర థియేటర్‌కి వెళ్ళాలని మా ప్రయత్నం. ఆటో వచ్చేక ఎక్కేం నేనూ,మా మిత్రుడు ఆంజనేయులూ.

ఆటో కదిలింది. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌మీంచి తీసుకువెళ్ళమని చెప్పేం. డ్రైవర్ అలాగేనని తలూపి స్టార్ట్ చేసేడు.

ఆటో కదిలి ఓ వంద గజాలు వెళ్ళింది. ఈలోగా వెనకనించి ఓ ఆటో రివ్వున మమ్మల్ని ఓవర్‌టేక్ జేసుకుంటూ వెళ్ళింది. అదిజూసి మా ఆటో డ్రైవర్‌కి వళ్ళు మండినట్లుంది. దానివెనక పడ్డాడు అదే స్పీడ్‌తో. రెండు ఆటోలు ఒకదాని వెనక ఇంకొకటి చాలా స్పీడ్‌గా వెళ్ళసాగేయి.

ఆ స్పీడ్‌కి మా యిద్దరికీ భయంవేసింది. మా ఆంజనేయులు బయటపడి "స్పీడ్ తగ్గించవయ్యా కొంపేం మునగదు!" అన్నాడు డ్రైవర్‌తో. ఆ డ్రైవర్ వెనక్కి తిరిగి చూడలేదు. ఆ స్పీడ్ అలాగే కంటిన్యూ చేసేడు. ఆ ఆటోని ఓవర్‌టేక్ చేయాలని రెండుసార్లు ప్రయత్నం చేసేడు కానీ ముందున్న ఆటో డ్రైవర్ పడనివ్వలేదు.

అప్పటికే రెండు ప్రమాదాలు వెంట్రుకవాసిలో తప్పిపోయాయి. చిక్కడపల్లి రోడ్ ఆ సమయంలో రష్‌గా వుంటుంది. అయినా వాళ్ళిద్దరు స్పీడ్‌లు తగ్గించలేదు. పోలీసులెవరూ ఆటోలని పట్టించుకోరు.

ఆంజనేయులు బెదిరిపోయేడు. ఆంజనేయ దండకం మొదలుపెట్టేడు. ఓ లారీ, యింకో సిటీబస్ మమ్మల్ని క్షణాల వ్యవధిలో చావునుంచి తప్పించేయి.

యీలోగా మేం దిగాల్సిన స్టాప్ వచ్చేసింది.

మా ముందు వెళ్ళిన ఆటో అలాగే వెళ్ళిపోయింది అదే స్పీడుతో. మా డ్రైవర్ ఏదో ఉర్దూలో తిట్టుకుంటూ ఆటో ఆపేడు థియేటర్ ముందు.

ఆంజనేయులు ఆటో ఆగీ ఆగకముందే దిగి అంత స్పీడ్‌గా తీసుకువచ్చినందుకు తిడుతూ తగవుపెట్టుకున్నాడు ఆటో డ్రైవర్‌తో. నేను మీటర్‌కి సరిపడ చిల్లర వెతికే ప్రయత్నంలో పడ్డాను.

ఆటో డ్రైవర్ కాస్సేపు ఆంజనేయుల్ని అరవనిచ్చి, నాదగ్గర చిల్లర తీసుకొని చెప్పేడు తాపీగా: "ముందువెళ్ళన్న డ్రైవర్ నా కొడుకు సార్! అంత ఓవర్‌స్పీడ్‌గా వెళ్ళద్దని లక్షసార్లు చెప్పేను. వాణ్ణి ఆపి తిడదామని ఓవర్‌టేక్ చెయ్యబోయేను. ప్చ్....వీలవలా! రాత్రి రాడా యింటికి" —అరెస్‌డబులూ్య



మీ అందానికే తగిన
మిల మిల మెరిసే చీరెలు!
కంచి, ధర్మవరం, బెంగుళూరు, బెనారస్, ఆరణి. పట్టు చీరెలు!!
వేలకొలది రకములు
గ్యారంటీ వెండి,
జరీతో తయారైనవి
లభించును.
లక్ష్మి
జనరల్ స్టోర్స్
గవర్నరుపేట, విజయవాడ-2
గ్రామ్స్: శిల్పా, ఫోన్: 73467, 77052

సీరియల్

స్వప్న సింహాసనం



యద్దనపూడి సులోచనారాణి

10

సుధీర్ కారుదిగి యింట్లోకి వస్తున్నాడు. తలవంచుకుని, పరధ్యానసగా వస్తున్న అతను గుమ్మంవరకూ వచ్చేవరకూ అక్కడ నిలబడివున్న వ్యక్తిని గమనించనే లేదు! తలెత్తి చూడగానే, నిర్విణ్ణుడవుతూ, అస్పష్టంగా 'స్వప్నా!' అన్నాడు. స్వప్న అతనివైపే భయంగా, మొహమాటంగా చూస్తోంది.

"స్వప్నా! ఏమిటి? వచ్చి ఎంతసేపయింది?" అతని ముఖంలో స్వప్నని చూస్తుండగానే, ఆశ్చర్యం స్థానంలో ఆనందం వెలిగింది.

స్వప్న మాట్లాడలేదు.

అతను లోపలకి వచ్చాడు. స్వప్న గుమ్మంలోనే నిలబడింది.

'లోపలకిరా!' అతను పిలిచాడు.

స్వప్న వెంటనే రాలేదు. సందేహంగా లోపలి గుమ్మంవైపు చూస్తోంది! అతనుకూడా ఆ గుమ్మంవైపు తిరిగి చూసాడు! అక్కడ ఎవ్వరూలేరు. గాలికి గుమ్మానికున్న పరదాలు కదులుతున్నాయి.

'లోపలకిరా! స్వప్నా' అతను మళ్ళీ పిలిచాడు.

'మీ అమ్మగారు-విమల-' సందేహంగా అంది.

"అమ్మ నిన్నేమంటుంది? విమల కూడా ఏమీ అనదు."

విమల గురించి స్వప్నకి ఎలా తెలిసిందా అని అతను లోలోపల ఆశ్చర్య పడుతున్నాడు.

"మీకు తెలియదు. ఆడవాళ్ళు-వేరేగా ఆలోచిస్తారు."

"ఎవరు ఏమైనా ఆలోచించనీ! నువ్వు లోపలకిరా! నేను రమ్మంటున్నానుగా."

క్షణంసేపు స్వప్న అతనివైపు తదేకంగా చూసింది!

"రా!" అతను మళ్ళా అన్నాడు. స్వప్న మెల్లగా, లోపలకి వచ్చింది.

"కూర్చో!" సోఫా చూపిస్తూ అన్నాడు. కానీ స్వప్న అతను చూపిస్తున్న, గుమ్మానికి ఎదురుగావున్న ఆ సోఫామీద కూర్చోలేదు! గదిలోకి వచ్చి క్షణంసేపు చోటు వెతుక్కున్నట్లుగా చూసింది. ఆ తర్వాత మూలగా, కిటికీ దగ్గరగా అతనికెంతో యిష్టమైన పడక్కుర్చీ దగ్గరకివెళ్ళి అందులో కూర్చుంది!

సుధీర్‌కి ఎంతో ఆనందం అనిపించింది!

అందరూ, అధునాతనంగా వున్న ఆ సోఫాని చూసి ముచ్చటపడతారు! దాన్ని మెచ్చుకుంటారు. అక్కడే కూర్చుంటారు. ఆ పాత పడక్కుర్చీ ఎవరి దృష్టికి ఆనదు! పై నుంచి ఆ గదిలో అది ఎబ్బెట్టుగా వుంది తీసెయ్యమని సలహా యిస్తారు! సుధీర్ ఆ సలహా విని చిరునవ్వుతో తల వూపుతాడు. ఆ పడక్కుర్చీ మాత్రం, అక్కడనుంచి కదలదు! సుధీర్‌కి అదంటే ఎందుకిష్టమో అతనికి ఒక్కడికే తెలుసు! విమల ఎప్పుడు వచ్చినా దాన్ని కంపరంగా చూస్తుంది. 'ఎప్పుడో ఒకసారి, నాకు తెలియకుండా, దాన్ని విరిచి, అవతల పారేస్తాను' అని బెదిరిస్తుంది.

సుధీర్ దానికి కూడా నవ్వి వూరుకుంటాడు. ఆ కుర్చీ ముట్టుకునే సాహసం ఎవ్వరికీ లేదని అతనికి తెలుసు.

ఈ రోజు స్వప్న గదిలోకి అడుగు పెట్టగానే అధునాతనంగా, ఆకర్షణీయంగా వున్న సోఫాని వదిలి, సరాసరి వెళ్ళి అక్కడ కూర్చోవటం అతనికి చెప్పలేనంత ఆనందం కలిగించింది.

స్వప్న కూర్చుంది. ఆలోచనగా క్రిందకి చూస్తుండిపోయిందే తప్ప ఏమీ మాట్లాడలేదు.

అతను దగ్గరగా వచ్చాడు.

"చెప్పు స్వప్నా, ఏమిటి?"

స్వప్న తలెత్తి చూసింది.

"డబ్బు ఏమయినా కావాలా?" అతను అడిగాడు.

"ఊహుఁ!" వద్దన్నట్టు తల తిప్పింది.

"ఏదయినా జరిగిందా?"

జరిగిన కథ :

తనని బలవంతం చేసిన పొరుగింటి మోహన్‌ను ఆత్మరక్షణార్థం చేతికందిన వస్తువుతో కొట్టింది స్వప్న. మోహన్ మరణించాడు. స్వప్నపై హత్యానేరం మోపబడింది. ఆ షాక్‌తో స్వప్న తల్లి చనిపోయింది. స్వప్న మేనమామ లక్ష్మీరంజనం స్వప్నను కాపాడమని తన శిష్యుడు సుధీర్‌ను కోరాడు. సుధీర్ తన ప్రతిభతో స్వప్నకు శిక్షపడకుండా చేశాడు. స్వప్నకు సీరియస్‌గా వుందన్న కబురు తెలిసి పార్టీనుంచి ఆందోళనగా వెళ్ళాడు సుధీర్. స్వప్నను హాస్పిటల్‌లో చేర్పించాడు. సుధీర్ సహాయం వద్దనుకొనికూడా పొందవలసే వచ్చింది. స్వప్న మేనమామ వెంట వాళ్ళింటికి వెళ్ళింది. మేనమామ భార్య రుసరుసలాడింది స్వప్నని చూసి. మేనమామ భార్య తనకు బలవంతంగా పెళ్ళి ఏర్పాటు చేస్తే తప్పించుకు పారిపోయింది స్వప్న. ఒక డాక్టరు మిత్రుడు ఫోన్‌చేస్తే వెళ్ళిన సుధీర్ పెళ్ళిదుస్తుల్లో వున్న స్వప్నను అక్కడ చూసి ఆశ్చర్యపోయాడు. స్వప్నను నర్సు మరియమ్మ ఇంట్లో ఉండే ఏర్పాటు చేశాడు డాక్టరు. స్వప్న కారణంగా తనకిచ్చిన మాట పోగొట్టుకున్నందును సుధీర్‌పై కోపగించుకొంది విమల.

"ఉహూ!" తల అడ్డంగా, వేగంగా తిప్పిందే కానీ, ఆ కళ్ళలో గిర్రున నీళ్లు తిరిగాయి.

అతను యింకా అడుగు దగ్గరకి వేసాడు.

"నిజం చెప్పు. ఏదో అయింది. లేకపోతే యిలా రానేరావు. ఏమైంది? ఎవరేమన్నారు?"

"ఎవ్వరూ ఏమీ అనలేదు. ఏమంటారు నన్ను?" కానీ అప్పటికే స్వప్న కంఠం పూడుకుపోయింది. దుఃఖం వెల్లువలా ముంచుకు వచ్చేసింది. చేతుల్లోకి ముఖం దించుకుని ఏడవసాగింది!

"స్వప్నా! ప్లీజ్! అసలేం జరిగిందో చెప్పు" అతను అర్థిస్తున్నట్లుగా అన్నాడు.

స్వప్న మాట్లాడలేదు. అతను నిస్సహాయంగా చూస్తున్నాడు. స్వప్న ఏడుస్తూనే వుంది. ఆ ఏడుపు పెద్ద వెల్లువలా వుంది. పొంగి, పొంగి వస్తూనే వుంది తప్ప తగ్గటం లేదు. అతను దగ్గరగా వచ్చాడు. ఆ క్షణంలో అతని మనసు సర్వసంకోచాలు మరిచిపోయినాయి. స్వప్న భుజంమీద చేయి ఆనించాడు. "స్వప్నా! పిరికివాళ్ళు ఏడుస్తారు. చాతకానివాళ్లు ఏడుస్తారు. నీకు ఏన్నోసార్లు చెప్పాను. నీ జీవితం అందరి ఆడపిల్లల్లాటిది కాదని. నువ్వు ధైర్యంగానే ఎదుర్కొంటున్నావు. ఇంతలో మళ్ళీ ఏమైంది?"


TRIVENI
BETEL NUT POWDER
PRIDE OF INDIA
CHOICE OF MILLIONS
TRADE MARK
REGD NO 169608
BEST PICKED
FRESH PACKED
TRIVENI
PARIMALA
NUT POWDER

స్వప్న తలెత్తి చూసింది. ఆ కళ్లు కుంకిన పువ్వుల్లా వున్నాయి. నీళ్ళతో మెరుస్తున్నాయి. నిస్సహాయంగా చూస్తూ అంది. "మీరు మీరు నన్ను జైలునుంచి విడిపించారు. ఇక నాకు విముక్తి దొరికిందని, స్వేచ్ఛ లభించిందని అనుకున్నాను! లేదు. నాకు స్వేచ్ఛలేదు. నేను జీవితాంతం ఖైదీనే! ఈ లోకమే పెద్ద జైలుగావుంది. నన్ను మెసలనివ్వటం లేదు. ఎక్కడ కెళ్లినా, హంతకురాలు, హంతకురాలు అని ఒకటే చూపులు! ఆ చూపులు నన్ను చీరేస్తున్నాయి. నాకు నిలవ నీడలేకుండా చేస్తున్నాయి. నేనేం చెయ్యాలి? యెలా బ్రతకాలి? హాస్టల్‌నుంచి నన్ను వార్డెన్ వెళ్ళగొట్టింది. ఇప్పుడు ఆశ్రయం కోసం నేను మళ్లీ యెవరిని యాచించను?"

సుధీర్ స్వప్నవైపే చూస్తున్నాడు.

"నేను పిరికిదాన్ని కాదు! నేను తప్పు చేయలేదు! నేను హంతకిని గాను! ఈ నమ్మకంతో మొండిగా యిన్నాళ్ళు బ్రతికాను! ఇక నా వల్ల కాదు. ఇక జీవితాంతం నాకు యీ బాధ తప్పదు! నేనేం చెయ్యాలి!" మళ్ళీ కళ్ళలోకి నీళ్ళు వుబికి వచ్చినాయి.

సుధీర్ హఠాత్తుగా స్వప్నని చేయిపట్టి కుర్చీలోనుంచి పైకి లాగాడు.

"స్వప్నా! ఇక నీకు అలాటి బాధ ఏదీ వుండదు. ఆశ్రయకోసం నువ్వు

ఎక్కడకీ వెళ్ళనవసరంలేదు."

"అంటే?"

"నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను! నా భార్యగా నువ్వు నా యింట్లోనే వుండి పోదువుగాని! అప్పుడు నిన్ను యీ లోకం ఏమీ చెయ్యలేదు!"

స్వప్న కళ్ళు పెద్దవి అయినాయి! విభ్రమంగా అతనివైపే చూస్తోంది!

"ఈ పని నేను ఎప్పుడో చేయవలసింది. నీకీ బాధలు వుండేవి కావు!"

స్వప్న యింకా, నోటమాట రానిదానిలా చూస్తోంది!

ఆ క్షణంలో స్వప్న అతని కళ్ళకి ఎంత అందంగా, అపురూపంగా కనిపించింది!

స్వప్నని అతను దగ్గరకి తీసుకున్నాడు. "ఈ క్షణంనుంచీ నువ్వు అదంతా మర్చిపో!"

స్వప్న నమ్మలేనట్లుగా చూస్తోంది. "మీ అమ్మగారు—!"

"అమ్మకి నేను చెప్పగలను! నా యిష్టాల్ని అమ్మ ఎప్పుడూ కాదనదు! నువ్వు ఆ భయాలేం పెట్టుకోవద్దు."

స్వప్న తలని అతని గుండెలకి అదుముకున్నాడు.

"స్వప్నా! స్వప్నా!" స్వప్న ముఖం ఎత్తి అతను పెదవులమీద గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు.


స్వప్న స్వప్నావిష్టురాలిలా యింకా అతనివైపు అలాగే చూస్తోంది! క్షణం సేపు ఇద్దరూ మాటలురాని మూగవాళ్ళలా నిలబడిపోయారు! స్వప్నని దగ్గరకి తీసుకోవడంలో, అతనికి చిత్రమైన అనుభూతి కలిగింది! అది ఒక చెప్పలేని ఆనందం! అనిర్వచనీయమైన శాంతి! ఎన్నడు, ఎరగని తృప్తి!

ఎక్కడో ఏదో పెద్దగా పడినశబ్దం అయింది. అతను వులిక్కిపడ్డాడు. స్వప్నని వదిలేసి తిరిగిచూసాడు. సుధీర్‌కి క్షణంసేపు అంత అయోమయంగా అనిపించింది! అతని కంటికి స్పష్టంగా ఏదీ కనిపించలేదు.

అతనికి హఠాత్తుగా మెలకువ వచ్చింది! మంచంమీద లేచి కూర్చున్నాడు! ఎదురుగా, టేబిల్‌మీద వున్న కంచు ఫ్లవర్‌వేజ్ క్రిందపడివుంది! పిల్లి ఒకటి తోక ముడిచి మ్యావ్, మ్యావ్ అంటోంది!

సుధీర్ గదంతా కలయచూసాడు! అర్ధరాత్రి నిశ్శబ్దంలో, గాలి చప్పుడు మినహా యింకేం శబ్దంలేదు! అతని మనసు కలలోనుంచి వాస్తవంలోకి రావటానికి పెనుగులాడుతున్నట్లుగా వుంది!

అతను కళ్ళమీద వేళ్ళతో నొక్కుకున్నాడు. "అబ్బా! ఇదంతా కలా!" అతను యింకా నమ్మలేకపోతున్నాడు. ఒక్కొక్కసారి కలలు ఎంత చిత్రంగా



వస్తాయి. నిజంగా జరిగినట్టే వుంటుంది. అతనికి యింకా స్వప్నని దగ్గరకి హత్తుకున్నట్టే వుంది. 'నేను పెళ్ళి చేసుకుంటాను' అని చెప్పటం గుర్తుకు వచ్చింది. అర్థం పర్థం లేని కల. స్వప్న మరియం దగ్గర వుంది. హాస్టలేమిటి? వార్డెనేమిటి? బొత్తిగా అర్థంలేదు.

అతను మంచంమీదనుంచి లేచాడు. క్రిందపడిన ఫ్లవర్ వేజ్ తీసి సరిగ్గా పెట్టాడు. అతన్ని చూడగానే, పిల్లి కిటికీలోనుంచి దూకి పారిపోయింది.

సుధీర్‌కి నిద్రపట్టలేదు. పడకగదిలోనుంచి, హాలులోకివచ్చి, అక్కడనుంచి ఆఫీసు గదిలోకి వచ్చాడు. అక్కడ లైటువేసాడు. మూలనున్న పడక్కుర్చీ కనిపించింది. అది చూడగానే అతనికి గమత్‌గా అనిపించింది. స్వప్న యింకా, అక్కడ ఎక్కడో వున్నట్టే అనిపించింది. స్వప్నని దగ్గరకు తీసుకోవటం గుర్తుకు వచ్చింది. అతని చెంపల్లోకి వేడిరక్తం వచ్చింది. లైటుతీసేసి యివతలకి వచ్చాడు.

అతను మంచంమీద వచ్చి కూర్చున్నాడు. సిగరెట్ తీసి వెలిగించాడు. వెనక్కి దిండుమీదకి జారగిలబడినట్టుగా వాలి సిగరెట్ కాలుస్తున్నాడు. ఎంత వదిలించుకుందామన్నా ఆ జ్ఞాపకం వదలటంలేదు.

స్వప్న తల యింకా తన గుండెలమీద ఆనినట్టుగానే వుంది.

(సశేషం)



చెమటకాయల
యొక్క దురద,
మంట బాధను
మరిచి పోండి.
నైసిల్
ఉపయోగించండి.
అతిశీఘ్రంగా
ఉపశమనమునిచ్చే
చెమటకాయల పౌడరు
2 ప్యాక్‌లలో
దొరుకును —
"బ్లూ" మరియు
"శాండల్ వుడ్"
Glaxo
nycil
PRICKLY HEAT POWDER
నైసిల్ పొందండి.
చెమటకాయలను మరువండి.
కేవలం 6 రూపాయల 63 పైసలు.*
* గరిష్ఠ రీటైల్ ధర.
స్థానిక పన్నులు అదనం.
Sista's-GN-79-364-Tel

గొంతు దిగని కన్నీళ్లు

టి. విమల

త్రీస్టార్ హోటల్లో, ఎయిర్ కండిషన్డు డబుల్ రూంలో గేదరయ్యారు మధు, సూర్యం, ఆర్ముగం, చంద్రం.

ప్రతి 'సండే' యే హోటల్లోనో, సమావేశమై, 'మందు పార్టీ' చేసుకుని, కాసేపు సరదాగా కాలక్షేపం చెయ్యడం ఆ నలుగురు మిత్రులకి రివాజు.

"ఇంకేమిటి ఆలస్యం?" అన్నాడు సూర్యం.

'క్వీన్ ఆఫ్ క్వీన్స్' ఫుల్ బాటిల్ ఓపెన్ చేసి, నాలుగు గ్లాసుల్లో కొంచెం కొంచెంగా పోసి, స్పెన్సర్ షోడా మిక్స్ చేశాడు మధు. ఇలాంటి పార్టీలు ఆర్గనైజ్ చెయ్యడంలో అతని కతడే సాటి. 'మందు' ఒక్కడే త్రాగితే ఆనందంలేదు. ఫ్రెండ్సుతో త్రాగినప్పుడే బ్రహ్మానందంగా వుంటుంది—అని అభిప్రాయ పడుతూ, సంపాదించిన మొత్తాన్ని 'బ్రాందీ'లా ఖర్చుచేస్తూ, ఎప్పుడూ మందు పార్టీలు ఇస్తూ, 'ఇదే నా జీవితాశయం' అని అభిప్రాయపడే మనిషి మధు.

"ఛీర్స్" అన్నారు మిత్రులు నల్గురూ ఒకే సారి—సాధ్యమైనంతవరకూ గ్లాసులు పైకెత్తి, 'ఢీ' కొట్టి.

గ్లాసుల్లోని మందు గొంతులో దిగుతోంది. గొంతులో దిగిన మందు కడుపులోకి జారుకొని నెమ్మది నెమ్మదిగా మెదడుమీద పని చెయ్యడం ప్రారంభించి, కళ్ళల్లోకి మత్తుగా తొంగిచూస్తోంది.

"చికెన్‌ఫ్రై అద్భుతంగా వుందోయ్" అన్నాడు ఆర్ముగం—ఆత్రంగా చికెన్ బోన్స్‌ని కరకరా నములుతూ. ఆర్ముగానికి 'మందు' కంటే 'చికెన్' అంటేనే ప్రీతి మెండు.

చంద్రం త్రాగుతున్నాడన్న మాటేగాని, యెందుకో వెలితిగా వుంది. ఏదో అసంతృప్తి. 'రాజుకూడా వుంటే బావుణ్ణు' లోలోపల అనుకోవాలనుకున్నా ఆ మాటల్ని పైకే అనేశాడు చంద్రం.

రాజు కూడా ఆ మిత్రబృందంలోని వాడే; అతడంటే మిత్రులందరికీ యెంతో యిష్టం. కాని యిటువంటి పార్టీలకి దూరంగా వుంటాడని మిత్రులకి అతనిమీద కోపం.

"వాడెందుకు వొస్తాడోయ్; మనమేదో చెడిపోతున్నామని, మనం దేనికి పిలిచినా తప్పించుకు తిరుగుతుంటాడు వెధవ;" అన్నాడు ఆర్ముగం—పొరపాటున యెక్కడ రాజుగాడు వొస్తాడో, తన చికెన్ వాటా యెక్కడ తగ్గిపోతుందోననే భయంతో.

"ఎంత లేదన్నా వాడు మన మిత్రుడు గదా. వాణ్ణి తీసుకురావల్సిందే" అన్నాడు సూర్యం.

"యస్, యస్. ఈ రోజు యేమైనా సరే వాణ్ణి మన మందు పార్టీ సభ్యుడిగా చేర్చుకోవాల్సిందే;" అన్నాడు 'మందు సామ్రాట్'—మధు.

"కింకర్తవ్యం ఆలోచించండి. ఆలస్యం అమృతం విషం" అన్నాడు చంద్రం.

ఎవరు వెళ్ళాలి? అందుకు యెవరు సమర్థులు?....

ఆలోచనలో పడ్డారు మిత్రులు.

"అయిడియా" ఉన్నట్లుండి అరిచాడు ఆర్ముగం.

"చెప్పేడవ్వోయ్" విసుక్కున్నారు మిగిలిన వాళ్ళు.

"వాడసలే రాస్కెల్ వెధవ; మనలో యెవరు వెళ్ళినా రాకపోవచ్చు. పైపెచ్చు మనలో యెవరికీ వాడిల్లు తెలీదు—ఒక్క చంద్రానికి తప్ప. సో—చంద్రం వెళ్ళి పికప్

చేసుకు రావల్సిందే" అన్నాడు అర్ముగం—ఎంతలేదన్నా రాజు తమ మిత్రుడు గదా తన చికెన్ వాటా తగ్గిపోతే తగ్గిపోయిందిలే అని తనకి తానే తృప్తిపడి.

"ఓకే....ఓకే. ఏమంటావోయ్ చంద్రశేఖరా?" అన్నట్లుగా చూశారు మిత్రులు చంద్రంవైపు.

"ఓ. కే....ఐయాం రెడీ" అన్నాడు చంద్రం, చేతులు త్రిప్పి, భుజాలు యెగరవేస్తూ.

ఆ తర్వాత గ్లాసులో మిగిలిన కాస్త మందునూ గొంతులో పోసుకొని, గోల్డుఫ్లాక్ కింగ్ సిగరెట్ ముట్టించుకొని, టీపాయ్ మీదున్న స్కూటర్ 'కీస్' తీసుకొని, హుషారుగా కదిలాడు చంద్రం.

"ఖాయ్! నువ్వేం దిగులుపడకు. నీ వాటా నీకే భద్రంగా వుంటుందిలే" అన్నాడు జోక్ చేస్తూ సూర్యం.

స్ప్రింగ్ డోర్ లాగి పట్టుకొని, బయట పడటానికి సిద్ధపడుతోన్న చంద్రం, రెండడుగులు వెనక్కివేసి, స్టైఫెల్లో పోజుపెట్టి, స్టైలిష్‌గా "థాంక్యూ" అని, గుబుక్కున బైటికి దూకాడు.

మధు రెండవ రౌండు కలపడానికి సిద్ధపడ్డాడు. కాని అర్ముగం చికెన్‌ఫ్రై తింటంలోనే మునిగిపోయి, యింకా ఫస్టు రౌండే ఫినిష్ చెయ్యలేదు.

"తొందరగా కానివ్వోయ్" విసుక్కున్నాడు మధు.

వాములు తినే స్వాములకి పచ్చగడ్డి ప్రసాదంలా—పీపాలకి పీపాలు స్వాహాచేసే మధుకి మొదటి రౌండ్ జస్టు వాసన చూసినట్లుగా వుంది. యెంత 'మందు'తొందరచేసినా ఫార్మాలిటీస్ అంటే ప్రాణం పెట్టే మధు, అందుకే అర్ముగాన్ని తొందరచేశాడు.

అయిష్టంగానే తన గ్లాసులో వున్న మందునంతా ఒక్కసారిగా గొంతులో పోసుకుని, ముఖం చిట్లించి, వాంతి రాకుండా ఓ చికెన్ ముక్కని నోట్లోకి దూర్చేసుకొన్నాడు అర్ముగం.

రెండవ రౌండ్ మిక్స్ చేశాడు మధు.

"రేడియో ఆన్ చెయ్యవోయ్ అర్ముగం" అన్నాడు సూర్యం విలాసంగా కుషన్‌చైర్లో వెనక్కివాలి, తాపీగా సిగరెట్టు పొగలతో మేఘాల్ని సృష్టిస్తూ.

రేడియో ఆన్ చేశాడు అర్ముగం.

'లో' వాయిస్‌లో మెలోడియస్ వాయిస్‌తో వస్తోంది రేడియోలోంచి పాట.

"వాహ్వా! వాహ్వా....ఏమి వాయిసూ....ఏమి వాయిసూ...." అన్నాడు మధు యే గత స్మృతుల్ని నెమరువేసుకుంటో.

నెమ్మది నెమ్మదిగా 'మందు' గొంతులు దిగుతోంది. మత్తు మత్తుగా వుంది. మాటలు ముద్దుగా మొద్దుగా వస్తున్నాయ్. మిత్రులకి హుషారు హుషారుగా వుంది.

రేడియోలోంచి పాట సన్నగా వినిపిస్తూనే వుంది.

'డిమ్' లైట్ వెలుతుర్లో, మందు చప్పరిస్తూ, చికెన్‌ఫ్రై మటన్‌ఫ్రైలు నములుతూ, సిగరెట్స్ ఊదేస్తూ, కబుర్లలో పడ్డారు మిత్రులు ముగ్గురూ.

పొలిటిక్సూ, సెక్సూ, క్రైమూ, థ్రిల్ సినిమాలూ, అమ్మాయిలూ, వంటింటి రచనలూ, పత్రికలూ, జర్నలిజమూ, చదువులూ, ఉద్యోగాలూ, నిరుద్యోగ సమస్యా, పెరిగే ధరలూ....వాట్ నాట్... అన్ని టాపిక్సుమీదా అనర్గళంగా లెక్చర్లు సాగిపోతున్నాయి.

ఇంతలో కాలింగ్‌బెల్ శబ్దం....

"యస్—కమిన్ ప్లీజ్" అన్నాడు సూర్యం.

తలుపు నెట్టుకొని లోనికొచ్చారు—ముందు చంద్రం, ఆ వెనకే రాజు.

"యువరాజాగారికి స్వాగతం ... సుస్వాగతం" అన్నాడు అర్ముగం.

"వీడ్ని పట్టుకొచ్చేసరికి నా తలప్రాణం తోకొచ్చింది" అన్నాడు చంద్రం సోఫాలో

కూలబడి, గ్లాసులో వున్న మందుని గొంతులో పోసుకుంటూ.

"ఈ రోజు యెంతో మరుపురానిది. యువ రాజాగారు యింతకాలానికి మాపై కరుణించి, మా ఆతిధ్యాన్ని స్వీకరించడానికి వచ్చినందుకు మా అందరి తరుపునా నా థాంక్స్" అన్నాడు సూర్యం.

మధు మరో గ్లాసు తీసుకొని, మందు పోసి, సోడా కలిపి, రాజు ముందుకు నెట్టి "తీసుకో" అన్నాడు.


నవ్వి మౌనంగా వుండిపోయాడు రాజు.

"ఎందుకోయ్ అలా నవ్వుతావ్? ఇంతకీ అసలు నీ ఉద్దేశం యేమిటి? నీ ఉద్దేశంలో మేమంతా చెడిపోయినట్లా? అందుకేనా నువ్వు మాకు దూరంగా తప్పుకు తిరుగుతున్నావ్? చెప్పరా? చెప్పు?" ఆర్మగం కోపంగా అరిచాడు. మామూలుగానే పెద్ద నోరు. ఇక మందు పడితే చెప్పనే అవసరంలేదు.

సమాధానం చెప్పలేదు రాజు.

"యు మస్ట్ టేక్" బలవంతం చేశాడు మధు.

"యస్, యు మస్ టేక్. తీసుకోవా



ల్సిందే....యేమిట్రా అలా వెర్రిమొఖం వేసుకొని చూస్తావ్? 'మందు' తీసుకుంటున్న మేమంతా వెధవలమనా నీ ఉద్దేశం? అసలు నీ ఉద్దేశం చెప్పేడవరా? మేము కాఫీకి పిలిస్తే రావు, సిగరెట్ ఆఫర్ చేస్తే తీసుకోవు. సినిమా చూద్దామంటే వినవు. పేకాట అంటే "అయ్య బాబోయ్' అంటావు. డ్రింకు తీసుకోరా అంటే 'నో థాంక్స్' అంటావు. అసలు యేమిటి నీ ఉద్దేశం? చెప్పరా? చెప్పు? ఈ భూమ్మీద నువ్వొక్కడివే అక్కడికి మహా బుద్ధిమంతుడివై పోయినట్లూ, మేమంతా చెడిపోయి, యెందుకూ పనికిరాని వెధవలమై పోయినట్లూ ఏమిట్రా నీ ఉద్దేశం? చెప్పరా ఫూల్... చెప్పు...." ఉద్రేకంగా అరుస్తున్నాడు మధు.

తన మిత్రులు అనరానిమాటలు అంటున్నా నోరు మెదపలేదు రాజు. తన హృదయం పళ్ళ చక్రాలక్రింద నలిగిపోతున్నట్లుగా బాధపడ్డాడు. ఏమిటి? తను తన నేహితుల్ని అపార్ధం చేసుకుంటున్నాడా! లేక తననే వాళ్ళు అపార్ధం చేసుకున్నారా? దీనికంతకీ కారణం యేమిటి? యెవరు కారణం?

బుర్ర వేడెక్కిపోతోంది రాజుకి.

తన నెందుకు మిత్రులు అర్ధం చేసుకోలేకపోతున్నారు? ఇదేనా ఫ్రెండ్‌షిప్‌కి అర్ధం? ఇదేనా యింతకాలం స్నేహంచేసి వీళ్ళు తనని అర్ధం చేసుకొన్న తీరు?

అవును. ఎలా అర్ధం చేసుకుంటారు? ఇంతకంటే యెవరు మాత్రం యెలా అర్ధం చేసుకోగలరు? అసలు దీనికంతకీ ఒక విధంగా బాధ్యుడు తనే నేమో! తనెప్పుడైనా తన మిత్రులకి అర్ధమయ్యే రీతిలో ప్రవర్తించాడా? పోనీ యెప్పుడైనా తన మనసులోని బాధని మిత్రులతో చెప్పుకున్నాడా? లేదే! చెప్పుకోలేదు. అందుకు ప్రతిఫలంగా యింతవరకూ తన నెంతో గౌరవించే మిత్రులే ఈరోజు తనని అపార్ధం చేసుకుని, అనరాని మాట లంటున్నారు.

ఇక లాభంలేదు. ఇన్నాళ్ళూ, ఇన్నేళ్ళూ తన బాధని తనలోనే దాచుకొని యెలాగో భరించగలిగాడు. ఇక ఉపేక్షించి లాభం లేదు. తన నిర్లిప్తత యింకెన్ని దారుణ పరిణామాలకు దారి తీస్తుందో! అలా జరగటానికి వీల్లేదు. తన మిత్రుల అపోహను తొలగించాలి. కాని...కాని...తప్పదు. స్నేహంలో అపార్ధాలకు తావుండకూడదు....అంతే.... అంతే....

ఏదో నిర్ణయానికి వచ్చినట్లుగా ముందుకు వంగాడు రాజు.

టీపాయ్‌మీద తన కోసం పెట్టిన మందు గ్లాసుని అందుకొని ఎత్తిపట్టి, కళ్ళు మూసుకొని, గొంతు మండుతున్నా, అలవాటులేని వాసన ముక్కుపుటాల్ని బ్రద్దలు చేస్తున్నా, గడగడా తాగేశాడు రాజు.

ఆ తర్వాత టేబిల్‌మీది సిగరెట్ ప్యాకెట్ అందుకొని, ఓ సిగరెట్ తీసి వెలిగించుకొని గబగబా రెండు దమ్ములు లాగి అలవాటు లేనందువల్ల ఉక్కిరి బిక్కిరై పోయాడు.

ఇదంతా చూస్తున్న చంద్రం తనేదో ముళ్ళమీద కూర్చున్నట్లుగా ఫీలవసాగాడు.

రాజుని కంపెనీగా వుంటాడని తీసుకొచ్చాడు తను. కాని యిదేమిటి? రాజు తాగేస్తున్నాడు అలవాటు లేకపోయినా?

"శహబాష్ రాజూ! శహబాష్! ఇప్పుడు నిజంగా నాకు నచ్చావ్. మా మిత్రుడివి అనిపించుకున్నావ్." అన్నాడు చప్పట్లుకొడుతూ మధు.

ఆర్ముగం సోఫాలోంచి లేచి, రాజుదగ్గరికి వెళ్ళి కౌగలించుకొని, "నౌ! యు ఆర్ మై ఫ్రెండ్!" అన్నాడు వికారంగా నవ్వుతూ.

సూర్యం త్రాగుతూ మౌనంగా వుండిపోయాడు, అక్కడ జరుగుతోన్న డ్రామాని చూస్తూ. కాని చంద్రానికి మాత్రం ఏదో బాధగా వుంది. ఏదో చెప్పాలనీ, ఏదో మాట్లాడాలనీ వుంది. కాని ఎవరికీ ఏమీ చెప్పలేని నిస్పృహాయ స్థితిలో వుండిపోయాడు చంద్రం.

మధు మూడవ రౌండు కలిపాడు.

"నాక్కూడా ఫ్రెండ్" అన్నాడు రాజు.

ఆశ్చర్యపోయారు మిత్రులు.

రాజు గ్లాసులో కూడా మందుపోసి, షోడా కలిపాడు మధు. గ్లాసందుకొని గడగడా తాగే శాడు రాజు. రాజు త్రాగుతుంటే వారించాలను కున్నాడు చంద్రం. కాని వారించలేకపోయాడు.

రాజుకిప్పుడు ఆనందంగా వుంది. ఏదో ప్రపంచంలో తేలిపోతున్నట్లుగా వుంది. వొళ్ళు తూలుతోంది. కళ్ళు బరువుగా వాలిపోతు న్నాయి. మెదడంతా మొద్దుబారిపోయినట్లుంది. గుండెల్లో పేరుకుపోయిన బాధ పెల్లుబికి కట్టలు తెంచుకుని బయటపడాలని తెగ ఆరాట పడిపోతోంది.

ఇక ఇప్పుడు మాట్లాడగలడు. అవును. మాట్లాడాలి..

మరో సిగరెట్ ముట్టించుకొని, గొంతు సవరించుకున్నాడు రాజు.

"మైడియర్ ఫ్రెండ్స్! ఇప్పుడు మీకు చాలా ఆనందంగా వుండి వుండాలి. యామై కరెక్ట్...." అన్నాడు రాజు.

"షూర్....షూర్... " అన్నారు ఆర్ముగం, మధు విలాసంగా బ్రాందీని సిప్ చేస్తూ.

"కాని.... ఫ్రెండ్స్! నాదొక రిక్వెస్టు. మీరేదో తాగి చెడిపోతున్నట్లూ, అందుకే మీ నుండి నేను దూరంగా తప్పుకు తిరుగుతున్నా ననీ ఇంతకుముందే మీరు నన్ను 'బ్లేమ్' చేశారు. ఆ మాటకొస్తే నేనూ ఇప్పుడు త్రాగాను. అంటే నేనూ చెడిపోయినట్లే లెఖ్ఖ. కాని మరెప్పుడూ నన్ను త్రాగమనీ, నా కిష్టం లేని పనులు చేయమనీ నన్ను బలవంతం చెయ్యకండి. ప్లీజ్, నన్నింకా దిగుళ్ళతో చంపకండి...." అన్నాడు రాజు.

"ఏమిటీ? నీకు దిగుళ్ళా? వాటే వండర్!"

"నీకేమిటోయ్! ఎప్పుడూ తెల్లని మల్లె పువ్వుల్లాంటి బట్టలతో పూలరంగడిలా వుంటావ్."

"అయినా నువ్వేం పదిమంది పిల్లల్ని పోషించాలా ఏమిటోయ్ నువ్వూ మీ ఆవిడేగా సంసారం?"

"కాదులేరా. మనలాగా పార్టీలనీ, ఫ్రెండ్స్ అనీ డబ్బు ఖర్చు చేస్తే ఎలా! బ్యాంకు బాలెన్స్ పెంచుతున్నట్లున్నాడు గురుడు. ఎంత లేదన్నా ముందు జాగ్రత్త మనిషి."

స్నేహితులు తలో రకంగా అంటున్నారు. ఆ మాటలు వినలేకపోయాడు రాజు. "స్టాప్... స్టాప్...." పెద్దగా అరిచాడు.

బిత్తరపోయారు మిత్రులు.

"....... మీ మాటలకు అడ్డొచ్చినందుకు క్షమించండి.... కాని నేను చెప్పేది కూడా వినండి. మీరు నా తెల్లని బట్టల్నే చూశారు. కాని నా గుండెల్లో అలుముకొన్న అంధ కారాన్ని చూడలేదు. నిజానికి నాకెన్ని జతల బట్టలున్నాయో మీకు తెలుసా? తెలీదు. ఒక వేళ నేను చెప్పినా మీరు నమ్మకపోవచ్చు. కాని ఇది నిజం... నాకున్నవి రెండే రెండు జతలు. ఒకటి వొంటిమీద వుంటుంది. ఒకటి ఉతికి, ఆరేసి దండెంమీద వుంటుంది.

"ఈజిట్........" నమ్మలేనట్లు చూశాడు అర్ముగం.

"అవును. నేను చెప్పింది నిజం....మీకు తెలిసిన నేను-ఒక పెద్ద ఆఫీసర్ని. ఏడెనిమిది

"గీతో"పదేశం

గతం
గరళం
గ్లాసు పారెయ్

భావి
ఎండమావి
పరుగు ఆపెయ్
స్మృతుల్ని
వొదిలేయ్
స్వప్నాల్లోంచి వొచ్చేయ్

వర్తమానం
వొకటే సత్యం
ప్రస్తుతం వొకటే అమృతం.

—టి. చంద్రశేఖరరెడ్డి

వందల జీతగాడ్ని. కాని మా ఇంట్లో రెండు పూటలా భోజనం మినహాయించి కాఫీ, టిఫిన్లు లాంటి ఆర్భాటాలేమీ వుండవు. ఆఫీసులో గానీ, బయటగానీ, నేనెప్పుడూ కాఫీ నీళ్ళకు నోచుకోలేదు. ఫ్రెండ్సుకోసం కానీ ఖర్చుపెట్టలేదు నేను. అంతే కాదురా. నా పెళ్ళాంకోసం పదిపైసలుపెట్టి పూలు కొని ఇంటికి తీసుకెళ్ళలేదంటే మీరు ఆశ్చర్యపోతారు. ఇంతవరకూ నా భార్యని ఒక్క సినిమాక్కూడా తీసుకెళ్ళలేదంటే మీరు షాక్ తినొచ్చు. కాని ఇది నిజం. అయినప్పటికీ నా భార్య నన్నెప్పుడూ అదికావాలనీ, ఇదికావాలనీ పీడించుకు తినలేదు. అందుకే నాకెంతో గర్వంగా వుంటుంది-నన్నర్థం చెసుకొని నాతో సర్దుకుపోయే భార్య దొరికినందుకు....'' రెండు నిముషాలు ఆగాడు రాజు. మరో సిగరెట్ వెలిగించుకొని పొగ వొదులుతూ మళ్ళీ చెప్పడం ప్రారంభించాడు.

"డియర్ ఫ్రెండ్స్! ఇంతకాలం నుండి మనం కలిసి తిరుగుతున్నాం. కాని ఎప్పుడైనా మిమ్మల్ని మా ఇంటికి ఆహ్వానించి, కప్పు కాఫీ మీ మొహాన పోశానా? ఒక్క పూట భోజనం పెట్టానా? చెప్పండిరా చెప్పండి. నేనెప్పుడూ అంత సాహసం చెయ్యలేకపోయాను. కాని—మీరు నన్ను కాఫీలకి పిలిచేవారు. సినిమాలకి పిలిచేవారు. షికార్లకి పిలిచేవారు. విలాసాలకి పిలిచేవారు. కాని నేనెలా వస్తాన్రా.... చెప్పండి. ఫ్రెండ్‌షిప్ ఫ్రెండ్‌షిప్పే. అంతమాత్రం చేత అభిమానాన్ని చంపుకోవలసిన అవసరం లేదుగదా! నాకూ మనస్సుంది. నాకూ అభిమానం వుందిరా. అందుకే మీరు పిలిస్తే నేను వొచ్చేవాడ్నికాదు. మీరు నాకోసం పదిరూపాయలు ఖర్చుచేస్తున్నప్పుడు అందులో పదోవంతు కూడా ఖర్చుచేయలేని నేను ఎలా మీరు పిలిస్తే రమ్మంటారు. చెప్పండిరా....చెప్పండి....

"మీకు తెలిసిన నేను—ఏ బాదరబందీలేని ఒక పెద్ద జీతగాడ్ని. కాని మీకు తెలీని నేను-ఎన్నో బరువులూ, బాధ్యతలూ నెత్తిన వేసుకొని అప్పులతో, అవస్థలతో, దిగుళ్ళతో, గుండె పగుళ్ళతో సతమతమైపోతున్న ఒక అభాగ్యుడ్ని....ఇన్ని బాధ్యతలూ పెట్టుకొని ఏ బాధ్యతలూలేని మీతో నేనెలా ఉల్లాసంగా కాలం గడపగలను? అవున్రా. అవును. మీకు బాధ్యతల్లేవు. బరువుల్లేవు. మీ వెనక మీ తల్లిదండ్రులో, తాత ముత్తాతలో సంపాదించి పెట్టిన బోల్డంత ఆస్తి వుంది. మీకు మంచి మంచి ఉద్యోగాలున్నాయ్. మంచి మంచి బిజినెస్‌లూ వున్నాయ్. మీ సంపాదనమీద బ్రతకాలనుకునే వాళ్ళు లేరు. అందుకే మీ సంపాదనంతా జల్సాలకు వినియోగించుకుంటున్నారు. కాని అలాంటి జీవితం నా కెలా కుదురుతుంది? చెప్పండిరా....చెప్పండి.

"నా జీతంలోనే—కేవలం నా జీతంలోనే ప్రస్తుతం మేముండే ఇంటికి అద్దెకట్టాలి. పాల బాకీ కట్టాలి. పెరిగే ధరల్ని తిట్టుకుంటూ ఈ సిటీలో నేనూ నా భార్యా బ్రతకాలి. మా ఊర్లో వున్న ముసలి తండ్రినీ, ఎన్నో సంవత్సరాల నుండి మంచంలో తీసుకొంటున్న మా అమ్మనీ, మా అమ్మ రోగానికి అయే మందుల బిల్లునీ, డాక్టరు ఫీజుని నేనే భరించాలి... ఇద్దరు తమ్ముళ్ళని చదివించాలి. నా ముగ్గురు చెల్లెళ్ళకి పెళ్ళిళ్ళు చెయ్యాలి. చూశారా? ఎన్ని బాధ్యతలో! ఇవన్నీ చాలవన్నట్లు మొన్నీ మధ్యనే భర్త చనిపోయి, ఆదరించే దిక్కు లేక నలుగురు పిల్లల్ని వెంటేసుకొని పుట్టిల్లు చేరింది మా పెద్ద అక్కయ్య. ఎవర్నికాదనేది? చెప్పండి....పోనీ వీళ్ళందర్నీ పోషించడానికి మా నాన్న ఉన్నవాడేం కాదు. ఉన్న ఒక్క ఎకరం పొలాన్నీ అమ్మేసి, నేనేదో ఉద్ధరిస్తానని, నామీద నమ్మకంతో, విశ్వాసంతో నన్ను చదివించి, నన్నింతవాడ్ని చేశాడు మా నాన్న. అటువంటిది—నా వాళ్ళనందర్నీ ఎలా నట్టేట్లో ముంచగలను? నన్నెలా ద్రోహిని కమ్మంటారు? నాకు నేను ఆత్మద్రోహం ఎలా చేసుకోమంటారు? చెప్పండిరా....నేనేదో చదువుకొని గట్టెక్కి, మాంచి ఉద్యోగమే చేసుకొంటున్నాను కాబట్టి, నా సుఖాలు నేను చూసుకుంటూ, నా వాళ్ళని—నన్ను నమ్ముకున్న నా వాళ్ళు—నామీద ఎన్నో ఆశలు పెట్టుకొని

ఒక్కపూటైనా కనీసం కడుపునింపుకోంటున్న నా వాళ్ళని—నట్టేట్లో ముంచెయ్యమంటారా? చెప్పండి....

"మీకు కాలుమీద కాలేసుకొని తిన్నా తరగని ఆ సిపాస్తులున్నాయి. మీరేంచేసినా అదేమిటని అడిగేవాళ్ళుగానీ అడ్డగించేవాళ్ళుగానీ లేరు. కాని అలా నాకెలా కుదురుతుంది? చెప్పండిరా చెప్పండి....అందుకే నన్ను నేను నిగ్రహించుకుంటూ, సుఖాలకి దూరంగా బ్రతుకుతున్నాను. అందుకే మీరు నన్ను అపార్థంచేసుకున్నారు.

"ఒరేయ్! మీకు కోపమొస్తే నన్ను కొట్టండి. తిట్టండి. ఇంకేమైనా చెయ్యండి. అంతేగాని నన్ను అపార్థం చేసుకొని, నన్ను మీనుండి దూరం చెయ్యకండి. నన్ను నెట్టేయకండిరా....ఇంతకాలం నేను సుఖంగా గడిపిన క్షణాలు కేవలం మీతో నవ్వుతూ, తుళ్ళుతూ గడిపిన క్షణాలే రేయ్....ఆ అదృష్టాన్ని కూడా నాకు దూరం చెయ్యకండిరా....

"ఒరేయ్!.... ఇంతకంటే నా జీవితంలో మరో విషాద సంఘటన వుంది. చెప్తాను. వినండిరా. నా బాధ్యత, నా వాళ్ళకూ నాకూ మధ్య వున్న ప్రేమపాశం, రక్తసంబంధం నన్నెంత ఘోరం చేయించిందో చెప్తానువినండి. నేను నావాళ్ళకి సహాయం చేస్తుంటే నా భార్య ఇంతకాలం కాదనలేదు. కాని రేపు తనకూ పిల్లలుపుట్టి వాళ్ళు పెరిగి పెద్దవాళ్ళయితే, నా జీతం సరిపోయే మాట ఎలావున్నా నా భార్య అప్పుడు నా వాళ్ళకి సహాయపడటానికి వొప్పుకుంటుందా? నో... వొప్పుకోదు. తన కడుపున పుట్టిన పిల్లల్నికాదని పరాయివాళ్ళకి పెట్టడానికి నా భార్య వొప్పుకోదు. నేనూ అప్పుడు నా మనసు మార్చుకోవచ్చునేమో....అప్పుడు నా వాళ్ళందరూ ఆకలి మంటలకు తట్టుకోలేక నల్లుల్లా మాడి మసైపోతారు....నో....నో.... అలా జరగటం నేను ఊహించలేను. అందుకే అందుకే.... నాకు పిల్లలు పుట్టకుండా నా సంసారం వృద్ధిచెందకుండా నేను ఆపరేషన్ చేయించుకున్నానురా. ఆపరేషన్ చేయించుకున్నాను.... పిల్లలంటే ఎంతో ఇష్టపడే నా భార్యకు ఒక విధంగా చెయ్యరాని ద్రోహం చేశానురా....ద్రోహం చేశాను. ఇదంతా కేవలం నావాళ్ళకోసం, నన్ను నమ్ముకున్నవాళ్ళకోసం, నామీద ఎన్నో ఆశలు పెట్టుకున్నవాళ్ళకోసం. అందుకేరా అందుకేరా....అన్ని సుఖాలకీ అతీతంగా బ్రతుకుతున్నాను, విధిలేక.

"ఒరేయ్! నన్ను అర్థం చేసుకోండిరా.... నేను మీ ఫ్రెండుని. నన్నెప్పుడూ కష్టపెట్టి మీరు మనసుని కష్టపెట్టుకోకండిరా" గొల్లున ఏడుస్తున్నాడు రాజు.

మిత్రులంతా ఒకరి మొఖాలొకరు చూచుకున్నారు.

చంద్రానికి మరీ దిగులుగా వుంది.

చిన్నపిల్లాడిలా ఏడుస్తున్న రాజుని చూస్తుంటే గుండె బరువెక్కింది. అప్పటి వరకూ చేతిలో వున్న గ్లాసులోని మందు ఒక్కసారిగా గొంతులో పోసుకున్నాడు.

ఇంతకాలం అలవాటుగా గొంతులో పోసుకోగానే అమృతంలా మెత్తగా కడుపులోకి జారిపోయే మందు, ఆ రోజెందుకో, రాజు కార్చిన కన్నీటిలా, ఉప్పగా, అదోరకంగా గొంతు దిగటంలేదు. గొంతులోనే నిలిచి పోయింది. □

త్రికోణ స్మృతి

స్మృతి
అస్తమించిన అనుభవాల్ని
గతంలోంచి తోడే
బొక్కెన

ఆశ
రేపటికి అని
వుదయించే స్వప్నాల్ని చూపే
నిచ్చెన.

తడిసే, మెరిసే
రెప్పల స్థితి
ఎపుడూ వొహే స్థానంలో
వర్తమానంలో—

—టి. చంద్రశేఖరరెడ్డి

బాకీ

— చెళ్ళూరి సీతారాజేశ్వరరావు

జానికమ్మ సగం తీసిన తలుపురెక్క వెనుక శిలావిగ్రహంలా నిలబడిపోయివుంది. ఏమనడానికి నోరురాలేదు.

"అర్నెల్లు ఆగమన్నారు. మీరు అన్నట్లే చేశాను. ఏది నా బాకీ? మళ్లా గడువా? వీల్లేదు. ఈ తిరగడం నావల్ల కాదు. జగన్నాధం అర్ధాంతరంగా పోయి నా పీకలమీదికి తెచ్చాడు. మీరు యివ్వనంటే దిక్కులేనివాడికి దానం చేసుకున్నానని నీళ్లు వదులుకుంటాను."

జగపతిరాయుడు లౌక్యం తెలిసిన మనిషి. ఆడవాళ్ళ దగ్గర ఎలా మాట్లాడాలో అతనికి బాగా తెల్సు. జానికమ్మ పాతతరం యిల్లాలు. భర్తని అవమానిస్తే అంగీకరించదు. మధ్యతరగతివాడు పెనుగులాడేది గౌరవంకోసం. దాన్ని పోగొట్టుకోడానికి సుతరామూ ఒప్పుకోలేదు.

"మీ బాకీ ఎగవేస్తానని చెప్పడంలేదు. ఏదోలా యిచ్చుకుంటాను. ఆయన పోయినప్పటినుంచి చెయ్యివిరిగినట్లయింది. అన్నీ చూసుకోవడంతో వుక్కిరిబిక్కిరిగా వుంది. తొందరలో మీ బాకీ తీర్చేస్తాను."

ఇదే సమయంలో భూపతి వచ్చాడు అతన్ని చూడగానే జానికమ్మకి వెయ్యి ఏనుగుల బలం వచ్చింది.

"రా అన్నయ్యా" సాదరంగా ఆహ్వానించింది.

భూపతి లోపలికి రాలేదు. బయట అరుగు మీదే కూర్చున్నాడు. "చుట్టరికానికి రాలేదమ్మాయ్. మీ ఆయన నాకు పన్నెండు వేలు యివ్వాలి. నీకు తెలిసేవుంటుంది. ఎన్నాళ్ళయినా నువ్వు మాట్లాడవు? గుర్తుచేద్దామని వచ్చాను."

"నీకూ బాకీ వున్నారా?" బాధగా అడిగింది.

జగపతిరాయుడు బింకంగా కూర్చున్నాడు. భూపతి కూడ తనకి తోడయ్యాడు. తన బాకీ వసూలయి తీరుతుంది.

జానికమ్మ భూపతి ఇచ్చిన ఖాతా పుస్తకాలు చూసి యిచ్చేసింది. "నన్నేం చెయ్యమంటావు అన్నయ్యా!"

"నా బాకీ తీర్చమంటాను."

"నీకు ఏది సబబు అని తోస్తే అదిచెయ్యి. నా విషయం నీకు తెల్సినదే కదా!" జానికమ్మ నిష్ఠూరంగా చూస్తూ, లోపలికి వెళ్ళిపోయింది.

జగపతిరాయుడు దగ్గరికివచ్చాడు. "ఏదోలా యివాళ తేల్చేయండి. నేను తిరగలేక యిదవుతున్నాను."

"నీకు నాలుగువేలు రావాలి కదా!"

"అవును."

భూపతి గడ్డం రాసుకుంటూ "మా బావ పేర్న యిల్లు మాత్రమే మిగిలింది. దాన్నే అమ్మించి మన బాకీలు తీసుకోవాలి"అన్నాడు.

"అలాగే చేద్దాం. మనం కోర్టుకి పోయినా అంతకంటె రాబట్టగలమా మరి?"

"ఇల్లు అమ్మగా వచ్చింది మన బాకీల నిష్పత్తిలోనే తీసుకుందాం!"

జగపతిరాయుడు అంగీకరించాడు.

ఇల్లు బేరానికిపెట్టారు. రెండునెలలు గడిచినా సరయిన బేరం ఎక్కలేదు. చివరికి పుల్లయ్య నాలుగువేలకి కొంటానని వచ్చాడు. జగపతిరాయుడు వెయ్యి తీసుకుని ఋణపత్రాలు యిచ్చేశాడు.

ఓసాయంత్రం భూపతి చెల్లెలింటికివెళ్ళాడు. జానికమ్మ ముభావంగా పలకరించింది "రేపట్నించి అద్దెయింటిలోకి వెళ్ళాలి కాబోలు."

"ఇది నీఇల్లు. నిన్నెవరు వెళ్ళమంటారు?"

జానికమ్మకి అయోమయంగా వుంది.

"ఇల్లు పుల్లయ్య చేత కొనిపించినట్లు నాటకం ఆడానమ్మా. జగపతికి బావ యివ్వాల్సింది వెయ్యే. అంకెలు మార్చి నాలుగువేలు చేశాడు. బాకీకోసం యిల్లు వేసుకుందామని చూస్తున్నాడు. నాకూ బాకీవున్నట్లు నటించాను. దానివల్ల వాడికి ముట్టవల్సిందే ముట్టింది." భూపతి వివరించాడు.

జానికమ్మ అన్నగార్ని ప్రశంసగా చూసింది.

పిల్ల

తులసి బాలకృష్ణ

అన్నీ తెలుసుననుకొనే అహంభావాన్నికంటే ఏమీ తెలియని అమాయకత్వాన్నే మొదట్నుంచీ యిష్టపడతాడు సత్యమూర్తి. అందుకనే ఏరికోరి పల్లెటూరి పిల్ల నిర్మలని పెళ్ళాడాడు.

అమాయకపు కళ్ళలోని భావాల్ని చదవ ప్రయత్నించడంలోని ఆనందం లిప్‌స్టిక్ పెదవుల్ని గాఢంగా చుంబించటంలో వుండదంటాడు.

పల్లెటూరి పిల్లకు నగరంలోని వింతల్ని చూపించడం హీరోయిజంగా ఫీలవుతూ, టాంక్‌బండ్ మీది సోఫాలో కూర్చుని పరిసరాల అందాన్ని వివరించి చెప్తున్నాడు—

“హైద్రాబాదుకి రావడం నీకిదే మొదటిసారి కాబట్టి, ఇదంతా చూస్తూంటే నీకు భలే వింతగా వుందికదూ?”

సిగ్గుతోకూడిన నవ్వుతో వంచిన తలని ఆడించింది నిర్మల.

“ఇంటికి వెళ్ళేటప్పుడు ఎంత ఆలస్యమయినా సరే డబుల్‌డెక్కర్‌లోనే వెళ్దాం. పైన ఎక్కితే కొత్తవాళ్ళకి భలే తమాషాగా వుంటుంది. మీ బండార్లంకలో డబుల్‌డెక్కర్లే వి(టి, అసలు సిటీబస్సులే వుండవుగా?” అన్నాడు ఆమె చుబుకంపట్టి, ముఖం పైకి ఎత్తి, కళ్ళల్లోకి చూస్తూ నవ్వి.

నవ్వింది నిర్మల.

“ఇదేం సిగ్గు పిల్లా—పెళ్ళయ్యాక కూడా పెళ్ళి చూపుల్లోలాగ సిగ్గుపడితే యెలా?”

ఈసారి సత్యమూర్తి కళ్ళల్లోకి చూసి నవ్వింది నిర్మల.

ఆనందంతో సత్యమూర్తి హృదయం వుప్పొంగి, హుసేన్‌సాగర్ అంత అయ్యింది.

“చూడు నిర్మలా—ఈ చెరువుని హుసేన్ సాగర్ అంటారు. అదుగో ఆ కొండమీద కనిపిస్తోందే — పాలరాతి దేవాలయం—అది బిర్లామందిరం. ఆ ప్రక్కగా....”

—సోఫాకి జేర్లాపడి కూర్చుని, వేరుసెనగ పలుకుల్ని ఒక్కొక్కటే నోట్లో వేసుకుంటూ, ఆగకుండా చెప్పుకుపోతున్న భర్త ముఖంలోకి తదేకంగా చూస్తూ వింటోంది నిర్మల.

... తన భర్త అందంగా వుంటాడు. తెల్లని తెలుపు కాకపోయినా ఆకర్షణీయంగా వుంటుంది అతని ముఖం. రింగులు తిరిగిన జుట్టు కాదు గానీ అడ్డంగా నుదుటిమీదుగా దువ్విన క్రాపు అతని నిర్మలాకర్షణీయమైన ముఖానికి క్రొత్త అందాన్నిచ్చి, చూపరులకు అతనంటే మరింత గౌరవాన్ని పెంచేదిగా వుంది. చిన్న గుండ్రని చుబుకం, పల్చని చెంపలు. నవ్వినప్పుడు వాటిపైపడే సొట్టలు ముద్దొస్తుంటాయి. కండలు తిరిగిన శరీరం కాదు సత్యమూర్తిది—కాని పుష్టిగా నిండుగా వుంటుంది. అతని కంఠంలో గంభీరతకంటే మాధుర్యం యెక్కువగా ధ్వనిస్తుంది....

హుసేన్ సాగర్ చుట్టూ వున్న యితర ప్రదేశాల గురించీ, తాము సోఫాలో కూర్చుని వున్న ప్రదేశం టాంక్‌బండ్ గురించీ చెప్పుకుపోతున్నాడు సత్యమూర్తి. ప్రేమగా అతని ముఖంలోకే చూస్తూ, కొసరుకొసరుగా సిగ్గు విడిచి పెడుతూ భర్తవైపు జరుగుతూన్న నిర్మల—

—సోఫా వెనకే నిటారుగా, సరిగ్గా సత్యమూర్తికీ తనకీ మధ్యగా వెనగ్గా, నిల్చున్న ఆరడుగుల నాలుగంగుళాల జబర్దస్తీ మనిషి ఖుస్రూని చూసి, అదిరిపడింది. కెవ్వున అరవలేకపోయిందికూడా.

భార్య ముఖంలోకే చూస్తూన్న సత్యమూర్తి చటుక్కున వెనక్కితిరిగి, భయభ్రాంతుడయ్యాడు. అంతలోనే తమాయించుకుని,

భార్యకు దగ్గరగా జరిగి, ఆమె ముఖాన్ని హుసేన్‌సాగర్ వైపు త్రిప్పి, ఏవో మాటలు పొడిగించాలని ప్రయత్నించాడుగాని, గొంతు ఓ పట్టాన పెగల్లేదు. ఆమెకూడా తేరుకోలేదు.

ఖుస్రూ చిన్నగా నవ్వుకున్నాడు. అప్రయత్నంగా మీసం కొసని పైకి తోసాడు. నెమ్మదిగా వచ్చి, సోఫామీద నిర్మల ప్రక్కగా కూర్చున్నాడు.

గబుక్కున ఒకేసారి లేచి నిలబడ్డారు సత్యమూర్తి, నిర్మల. గబగబా నడుస్తూ కొంత దూరం పోయేక ఖాళీగా వున్న ఒక సోఫాలో కూర్చున్నారు. ఇద్దరి గుండెలూ దడదడలాడుతున్నాయి. భార్యతో సమానంగా తనూ భయపడుతున్నందుకు సిగ్గుపడ్డాడు సత్యమూర్తి. పైగా ఇలా మౌనంగానే వుంటే భార్య మరీ భయపడుతుంది. బలవంతపు నవ్వు తెరొకటి ముఖంమీదకి జార్చుకున్నాడు.

"అక్కడ కంటే ఇక్కడే బావుందికదూ నిర్మలా" అన్నాడు.

అవున్నన్నట్లుగా గబగబా తలూపింది నిర్మల. ఒకసారి గబుక్కున వెనక్కి తిరిగి చూసిందికూడా. ఏమీ 'జరగనట్లుగా నటించడానికి ప్రయత్నించసాగింది.

నవ్వుతెర రంగు వెలియకుండా జాగర్త పడుతూ హైద్రాబాదు విశేషాలు చెప్పుకుపోతున్నాడు సత్యమూర్తి. భర్తకి పూర్తిగా అనుకుని కూర్చుని, అతని చేతివేళ్ళతో ఆడుకుంటూ అతన్నే చూస్తూ అతని మాటలు వింటూన్న నిర్మల——

——భర్త మాటలు ఆపి, తన వెనగ్గా భయంగా చూస్తూండడం గమనించి, చటుక్కున వెనుతిరిగి నిర్విణ్ణురాలై పోయింది.

అలవోకగా నవ్వుతూ వచ్చి నిర్మలప్రక్కనే కూర్చున్నాడు ఖుస్రూ.

గొంతు తడారిపోయి, వేగంగా కొట్టుకుంటూన్న గుండెలతో, బిగుసుకుపోయి ఒకరినొకరూ చూసుకుంటూ కూర్చుండిపోయేరు భార్యాభర్తలు.

సత్యమూర్తి మనస్సు మెలికలు తిరుగుతోంది. తను భయపడుతున్నట్లు భార్యకు ఏమాత్రం తెలిసినా తనని చులకన భావంతో చూస్తుంది. మరింత ఆమె బెంబేలు పడిపోతుంది.

నిర్మల కంగారుగా నుదుటిమీది చెమటను తుడుచుకుంది. భయపడనట్లు నవ్వ ప్రయత్నించింది. భర్తమీద తనకి చులకన భావం కలుగుతోందని అనుకునే అవకాశం యివ్వకూడదని సత్యమూర్తి ముఖంలోకి వీలయినంత ప్రేమగా చూడసాగింది.

"రేపు మనం జూపార్క్‌కి వెళ్దాం. దార్లో చార్‌మీనార్‌కూడా చూపిస్తా" - ఏదో మాట్లాడాలని మొదలుపెట్టాడు సత్యమూర్తి ఖుస్రూ వైపే చూస్తూ.

నెమ్మదిగా, పొగరుగా నిర్మలవైపు జరగసాగాడు ఖుస్రూ. వాడి పెర్సనాలిటీ సత్యమూర్తిని భయపెడ్తోంది.

నిర్మల భర్తని అంటిపెట్టుకుని కూర్చుంది.

'ఎవడీ కీచకుడు?!! ఎందుకు తమనిలా వెంబడిస్తున్నాడు?!'

ఇవే ప్రశ్నలు ఇద్దర్నీ ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

వాడ్ని యేదో చేసెయ్యాలన్న కోపం. ఏమీ చెయ్యలేని అసమర్థత. తాము భయపడుతున్నామని వాడు గ్రహిస్తే మరింత రెచ్చిపోతాడేమో నన్న అనుమానం.

అటూ, ఇటూ అనేకమంది పోతూనే వున్నారు. అందరూ చూస్తూనే వున్నారు. గబుక్కున మొహాలు త్రిప్పేసుకుని వెళ్ళిపోతున్నారు.

టాంక్‌బండ్‌మీద స్థానిక రౌడీలుగా పేరు మోసిన గ్యాంగ్‌లు సైతం ఎత్తిన కాలర్లుదించి పిల్లుల్లా జారుకుంటున్నారు.

ఖుస్రూ అంటే, వాడి పెర్సనాలిటీ అంటే, వాడి వెనకవున్న మద్దతు అంటే, వాడి గత చరిత్ర అంటే——ఆ లొకాలిటీలో వున్న భయంకరమైన భయం ఎవర్నీ ముందడుగు వేసి, వాడి చేతుల్లోంచి శాంతి పావురాల్ని రక్షించే శక్తిని యివ్వదు.

"నిర్మలా! మరేం ఫర్వాలేదు .... భయ పడకు...." గొంతు పెగల్చుకుని రహస్యంగా గొణిగాడు సత్యమూర్తి భార్యని పొదివి పట్టుకుని.

"అబ్బెబ్బె....ఉఁ....భయందేనికి...."

"నీ ప్రక్కన ఎవడో రౌడీ వెధవ కూర్చున్నాడు కదూ. వాడ్నిచూసి నువ్వేమైనా భయపడుతున్నావేమోనని...."

"ఛఛ....ఏం లేదు.. .ఇంతమంది తిరుగుతూండగా .... అందులో మీరుండగా నాకేం భయం" ధైర్యంగా నవ్వుతూ అంది.

కళ్ళలో నీళ్ళు తిరిగినంత పనయ్యింది సత్యమూర్తికి ఆమెమీద ప్రేమతో. బలంగా గుండెలు ఉబికి, రెండు క్షణాలకు పల్చబడిపోయేయి. అయినా ధైర్యం ప్రకటిస్తూ, వాడ్ని లెక్కచెయ్యనట్లు నటిస్తూ, భార్యతో మాటలు పొడిగించబోయేడు. కాని ఇంతలో—

—నిర్మల భుజంమీద ఖుస్రూ చెయ్యి మోటుగా పడింది.

ఉలిక్కిపడ్డారిద్దరూ. భయంతో, అవమానంతో వజవజ వణికిపోయేరు.

'కీచు' మంటూ బ్రేకులు పడుతూండగా



వెనగ్గా రోడ్డుమీద ఆగిన సిటీబస్సు ఆపద్బాంధవుడిలా కనిపించింది యిద్దరికీ. నాలుగు కళ్ళు మెరిసాయి. వెంటనే అనుకున్నవారిలా రివ్వున లేచి బస్సువైపు పరిగెత్తాడు.

"నిర్మలా! నువ్వు ముందునుంచి యెక్కు. ముందునుంచి నేనెక్కకూడదు. వెనకనుంచి యెక్కి ముందుకొస్తా. ధైర్యంగా వుండు. గబగబా యెక్కు" అని అరిచినట్లు అని, బస్సెక్కాడు సత్యమూర్తి వెనగ్గా.

పరిగెట్టి, ముందుకి తూలి పడబోయి, నిలదొక్కుకుని, బస్సెక్కెయ్యగలిగిన నిర్మల సీటులేక జనం మధ్య నిలబడిపోయి, భర్త కోసం వెనక్కి జనం మధ్యగా చూడసాగింది.

ముందునుంచి బస్సెక్కబోయిన మగవాడిని, "పీఛేసే ఆవ్...." (వెనకనుంచి రా) అని కసరబోయిన డ్రైవరు, ఆ మనిషిని గుర్తుపట్టి, మొహంనిండా నవ్వుతూ, "అయియే ఖుస్రూ సాబ్....ఆయియే...." అని ఆహ్వానించాడు. నవ్వుతూ లోపలకివస్తూన్న ఖుస్రూని చూసి భయంతో బిగుసుకుపోయింది నిర్మల.

జనాన్ని తప్పించుకుని ముందుకు భార్య దగ్గరకు వెళ్ళడానికి ఎంత ప్రయత్నిస్తున్నా సత్యమూర్తికి వీలుకావడంలేదు.

నిర్మలకు తగుల్తూ నిల్చున్నాడు ఖుస్రూ.

ముడివేసినట్లు ముడుచుకుపోయి నిల్చుంది నిర్మల.

ఒక సీట్లోని యిద్దరు ఆడవాళ్ళు లేచి, దిగిపోయేరు. 'బ్రతుకు జీవుడా' అని గబుక్కున ఆ సీట్లో కిటికీ వారగా కూర్చుని, వేరే మరో ఆడమనిషిని తన ప్రక్కన కూర్చోమని నిర్మల ఆహ్వానించే లోగా, అసహ్యంగా నవ్వుతూ ఖుస్రూ అందులో కూలబడ్డాడు.

చటుక్కున లేచి నిల్చుంది నిర్మల.

కాళ్ళు అడ్డుపెట్టి కూర్చున్నాడు ఖుస్రూ.

ఆడ మగా అంతా వింతగా చూస్తున్నారు. కండక్టరు ఖుస్రూని చూసి, గబగబా వెనక్కి వెళ్ళిపోయేడు. డ్రైవరుకి వెనక జరుగుతున్న ఘోరం తెలుసును కాబట్టి, వెనక్కి తిరిగి చూసే ధైర్యంలేక ముక్కుసూటిగా చూస్తూ పోనిచ్చాడు బస్సుని.

జనాన్ని తప్పించుకుని సత్యమూర్తి భార్య సీటువద్దకు చేరేసరికి — బస్సు ఆఖరి స్టాప్ చేరుకుంది. బస్ అంతా ఖాళీ అయిపోయింది. ఖాళీ అవనిది ఖుస్రూ కూర్చున్న సీటు ఒక్కటే. ప్రక్కన మూలలో బలిపశువులా నిర్మల నిల్చుని వుంది. రెండవ ప్రక్క దోషిలా సత్యమూర్తి నిల్చునివున్నాడు.

"మేష్టారూ! మీరు కొంచెం కాళ్ళు అడ్డు తీస్తారా, నా భార్య బయటకు వస్తుంది" అన్నాడు సత్యమూర్తి, ఖుస్రూతో—విన్నవించుకుంటున్నట్లుగా.

అరమోడ్పు కన్నులతో సత్యమూర్తిని చూసిన ఖుస్రూ చిన్నగా నవ్వడం మొదలుపెట్టి, క్రమేపీ పెంచుతూ, బండరాళ్ళు దొర్లిస్తున్న ధ్వనితో భయంకరంగా, విజయగర్వంగా ఒక నవ్వు నవ్వి, కిటికీలోంచి బస్సు బయటకు చూసాడు. బస్సు చుట్టూ అనేకమంది సినిమా చూస్తున్నట్లు కళ్ళు విప్పార్చి చూస్తున్నారు. ఖుస్రూ మళ్ళీ నవ్వి, నిర్మలని ఆపాదమస్తకం చూడసాగాడు.

ఉన్నపళంగా గుండె ఆగి చచ్చిపోతే బాగుండును అనిపిస్తోంది భార్యాభర్త లిద్దరికీ.

బయట జనంలో వీళ్ళమీద జాలిపడ్తున్న వాళ్ళు, జరుగుతున్న సంఘటనని వినోదంగా భావించి ఆనందిస్తూన్న వాళ్ళూ వున్నారు.

సత్యమూర్తి మళ్ళీ విన్నవించుకున్నాడు ఖుస్రూకి.

ఉరుముతున్నట్లు, పిడుగులు కురుస్తున్నట్లు మళ్ళీ నవ్వాడు ఖుస్రూ.

చుట్టూ చూసాడు సత్యమూర్తి. బస్సంతా ఖాళీ. బస్సు చుట్టూ తీర్థజనంలాగ అనేకమంది ఇటే చూస్తున్నారు.

అవమాన భారంతో తల వంచుకొంది నిర్మల.

ముఖం నిండా పొటమరించిన స్వేదధారలతో, బయటకు వినిపించే ధ్వనితో కొట్టుకుంటూన్న గుండెలతో, వణుకుతూన్న పెదవులతో, గొంతులో కొట్టుమిట్టాడుతున్న దుఃఖంతో సత్యమూర్తి నిలబడి వున్నాడు. మరొకసారి

విన్నవించుకున్నాడు ఖుస్రూకి కాళ్ళు అడ్డు తియ్యమని.

ఖుస్రూ తలెత్తి సూటిగా సత్యమూర్తి కళ్ళల్లోకి చూసాడు.

"క్యారే .... క్యా .... క్యా బోల్రా రేతూ? అఁ—ఐసీ బుల్‌బుల్ కూ ఛోడ్ దేనా...." అని నవ్వి, "ఆజ్ రాత్‌కూ ఖుషీ కర్తూం ఏ పోట్టీకే సాత్. తూ జాబే జా...." అని సత్యమూర్తిని బలంగా ఒక్క తోపు తోసాడు.

విసురుగా వెళ్ళి వెల్లకిలా పడ్డాడు సత్యమూర్తి.

చటుక్కున తలెత్తి భర్తవైపు చూసిన నిర్మల కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి.

పగలబడి నవ్వుతూ ప్రక్కకు తిరిగి నిర్మల చెయ్యి పట్టుకున్నాడు ఖుస్రూ.

అంతే!!

మనిషి అహం దెబ్బతింది.

అవమానాగ్ని కామారణ్యాలమీదకు విరుచుకు పడింది.

అన్నివైపులా తలుపులు బిగించి వున్నాయి అని తెలుసుకున్న పిల్లి యెదురు తిరిగింది.

అగ్నిపర్వతం బ్రద్దలై ప్రళయఘోషతో తన్నుకొచ్చింది లావా.

భగభగ మండుతున్న గుండెలు భళ్లున దావానలాన్ని కక్కేయి.

మంచుకి తడిసిన లేగులాబి మొగ్గలాంటి నిర్మల అపరకాళిగా మారింది. శాంతానికి మారురూపం, శాంతికపోతం లాంటి సత్యమూర్తి ప్రళయకాలరుద్రుడయ్యాడు.

నోటికొచ్చినట్లు శపిస్తూ తన ముంజేతితో ఖుస్రూ మొహంమీద ఎడతెరిపి లేకుండా కొట్ట సాగింది నిర్మల.

బంతిలా లేచొచ్చి, బలంగా ఖుస్రూ పొత్తి కడుపులో తన్నసాగాడు సత్యమూర్తి.

ఊహించని ఈ పరిణామానికి ఉక్కిరి బిక్కిరై, తట్టుకుని, తిరగబడేలోగా—

"అల్లా!.... ఆంఖే.... మేరా ఆంఖే...."

—కోటి డప్పులు ఒక్కసారిగా నేమ్రోగించినంత ధ్వనితో పెడబొబ్బలు పెట్టూ లేచి, పిచ్చిపట్టిన వాడిలా ఇటూ అటూ సీట్లను పట్టుకుంటూ, గుద్దుకుంటూ గుమ్మంవద్దకొచ్చి పడిపోయేడు ఖుస్రూ.

వాడి రెండు కళ్ళల్లోనూ నిర్మల చేతి గాజు ముక్కలు బలంగా దిగబడిపోయేయి. వేరొక చేత్తో పొత్తికడుపు నొక్కిపట్టుకుని మెలికలు తిరుగుతూ, దొర్లుతూ, అరుస్తున్నాడు వాడు.

బస్సు చుట్టూ వున్న జనంలో చలనం కలిగింది.

పిరికి వెధవలకి సైతం ధైర్యం వచ్చింది. పరుగుపరుగున ముందుకు వచ్చి, ఖుస్రూని బస్సు బయటకు ఈడ్చేశారు.

"తగిన శాస్తి జరిగింది వెధవకి. ఇంక జీవితాంతం గుడ్డిబ్రతుకే."

—ఇవేమాటల్ని వివిధ తరహాల్లో అందరూ ఆనందం పెల్లుబుకుతూండగా అనుకున్నారు.

"ఈ యెదవపని ఈడు గత అయిదేల్లుగా సేత్తూనే వున్నాడు. సంపేత్తాడేమో ననే భయంతో ఒక్క యెదవకూడా యిన్నాల్లూ అడ్డి ఏఁవఁనలేకపోయారు. ఈ రోజున పార్వతీ పరమేశ్వరులే దిగొచ్చి ఆడి కల్లు పీకేశారు" అంటూ నసుగుతున్నట్లు అంటోంది ఒక ముసల్ది వారగా నిల్చుని.

"మా స్టూడెంట్స్ యూనియన్ తరఫున యిప్పటికి రెండుసార్లు వార్నింగ్ యిచ్చాను కూడా వీడికి. రేపో యెల్లుండో వీడి భరతం పడదామని అనుకుంటున్నాం మేష్టారూ. ఇంతలో మీరే బుద్ధిచెప్పారు వీడికి" అన్నాడొక వస్తాదులాంటి యువకుడు చొక్కాచేతులు మడుచుకుంటూ.

రిక్షావాడొకడు ఆ యువకుడివైపు జాలిగా నవ్వేడు, "వెర్రి మొహవాఁ" అన్నట్లుగా.

కళ్లుపోయి రోడ్డు వారగా పడివుండి, అరుస్తూన్న ఖుస్రూనిగాని, ఆనందిస్తూన్న జనాన్నిగాని, తమని పొగుడుతూన్న చుట్టూ వున్నవారినిగాని గమనించే స్థితిలో లేరు ఇద్దరు—సత్యమూర్తి, నిర్మల.

ఒకరి ముఖాల్లోకి ఒకరు అత్యంత ప్రేమగా చూసుకున్నారు.

చెదిరిన జుట్టుని, బట్టల్ని సర్దుకున్నారు.

నడుం చుట్టూ చేతులు వేసుకుని, ఆనందంగా, మనసులతో అభినందించుకుంటూ నడుచుకు వెళ్ళిపోయేరు. □

జాతీ మనసులు ప్రాంతీ జేబులు

మాదిరెడ్డి సులోచన

జాతీయ క్రీడోత్సవాలు జరుగుతాయని కాలేజీలకు సెలవులిచ్చారు. పరీక్షలు దగ్గరకు వస్తున్నాయి కదా, త్వరగా గదికి వెళ్ళి చదువుకుందాము అనుకుంటున్నాను. సుధ, లక్ష్మి కూడా వస్తారేమోనని వాళ్ళున్న దగ్గరకు వెళ్ళాను.

"మీ రెన్ని అయినా చెప్పండి రమేష్‌గారూ! సౌత్‌లో విద్యాధికుల శాతం, క్రీడాకారులశాతం కేరళలోనే వుంది" గొంతులో మైకు వున్నట్టు ఖంగుమన్నది సుధ గొంతు.

"ఏమండోయ్ సుధగారూ! మహా తెలిసినట్టు మాట్లాడకండి. ఆంధ్ర అంత తీసికట్టు కాదు' మీరంతా పొరుగింటి పుల్లకూర రుచి అనుకుంటారు" అన్నాడు శేఖర్.

"పుల్లకూర ఏ ఇంటిదయినా రుచేగాని శేఖర్, క్రీడోత్సవాలు జరుగుతున్నాయికదా, ఫలితాలు వస్తే తెలియదా యెవరు వీరులో యెవరు శూరులో. తమ్ముడు తనవాడయినా తగు ధర్మం చెప్పాలన్నారు" అన్నది లక్ష్మి తనకున్న పరిజ్ఞానాన్ని అంతా మాటల్లోపెడుతూ.

"పక్షపాతంగా మాట్లాడకండి. మన రాష్ట్రంలోకూడా క్రీడాకారులకు కొరతలేదు" అన్నాడు హేమచంద్ర.

"తినబోతూ రుచులెందుకు. కొన్నిరోజులు ఆగితే తెలుస్తుందిగా" అన్నది సుధ పదునుగా.

"ఐసీ! మీరు మాట్లాడరేం మాలతీ!" అందరిమీదుగా చూస్తూ అడిగాడు రమేష్.

"నిజాన్ని అంగీకరించటానికి వెనుకాడవద్దు" అన్నాను క్లుప్తంగా. సాధారణంగా ఇలాంటి విషయాలు వస్తేనూ తేలిసీ తెలియనట్టు ఏదో అనేస్తుంది సుధ. అబ్బాయిలు వాదిస్తారు. చివరకు నేను కలుగజేసుకుని 'మొద్దూ' తెలియని విషయాలజోలికి పోతావెందుకే అని తిడుతుంటాను. కాని ఈ రోజు సుధ అన్న దాంట్లో నిజంవుంది. కేరళలో విద్యాధికులు యెక్కువే, క్రీడలపై మక్కువే.

నా మాటకు రమేష్‌కు పౌరుషంలాంటిది వచ్చింది.

"ఏమిటండీ మీరు కూడాను! మనల్ని మనము చిన్నబుచ్చుకుని యెవర్నో పొగడటం బాగుందా?" రమేష్ అరిచాడు.

"అర్థం పర్థం లేకుండా ఏం పొగడటం లేదు. క్రానికల్‌లోని ఆఖరిపేజి యెప్పుడయినా చదివారా?" సుధ అడిగింది. నేను తన మాట అవును అనేసరికి యెక్కడలేని ఉత్సాహం వచ్చింది, సుధకు.

"మేం మగవాళ్ళం కదూ! ఏదో ఉద్యోగం కావాలి. యెప్పుడూ వాంటెడ్ కాలమ్స్ చూస్తాం" విసురుగా అన్నాడు శేఖర్.

"అబ్బబ్బ! ఈ తగువెందుకు, క్రీడోత్సవాలు ముగిస్తే తెలుస్తుంది" అన్నది లక్ష్మి.

"అబ్బాయిలంటే, అందునా ఆంధ్రులంటే అంత చులకనగా వుందా? చూద్దాంకాదు బెట్" అన్నాడు రమేష్ ఉక్రోషంగా.

"బెట్!....యెంతెంత?" అన్నది సుధ.

"ఇంతంత ఇవ్వడానికి మేము లక్షాధికార్లము కాము" అన్నాడు రమేష్.

"ఒరేయ్ భిక్షాధికార్లమా! వెధవన్నర వెధవ. ఆడకూతుళ్లాంటి ఆడపిల్లల ముందు పరువు తీస్తున్నాడు. యెంతో చెప్పండి మేం రడీ" కాలర్ సర్దుకున్నాడు శేఖర్.

"వాళ్ళతో పందెంకాచి గెలువటం కష్టంరా. అమ్మా, నాన్నతోపాటు ఉద్యోగంచేసే అన్నలు కూడా డబ్బులిస్తారు" అన్నాడు రమేష్, అతని చెల్లెల్ని గుర్తుకు తెచ్చుకుని. తండ్రి, తల్లి పెద్దన్న ముగ్గురిస్తారు. తనడిగితే ఇంకమ్ టాక్స్ వాళ్ళకంటే అధ్వాన్నంగా లెక్కలు అడుగుతారు.

"అహా! ఏం సత్యం చెప్పాడమ్మా మొనగాడు. ఇంటికి దీపాలు, వంశోద్ధారకులు, మగ పురుషులు అంటూ అమ్మమ్మలు, బామ్మలతో పాటు, అమ్మాయిలున్న మేనమామలు జేబులు తడుపుతుంటారు'' అన్నది సుధ, తనింట్లో తమ్ముడికిచ్చే ప్రాముఖ్యం తలచుకుని.

"మాలతీ! నువ్వు ఏదంటే అది? కాడ్‌బరీసా? ఇంగ్లీష్ సినిమానా?'' హేమచంద్ర అడిగాడు.

"అసలీ పందెం కాయటమే నా కిష్టంలేదు. సుధ అన్నదాంట్లో అతిశయోక్తి లేదు" అన్నాను.

''అలా సమర్థించకు మరి. పందెం ఓడిపోతే నష్టపోయేది యెవరు? మేం? ఆంధ్రప్రదేశ్ పరువు నిలుపటానికి డబ్బుపోయినా ఫరవాలేదు. వియ్ డోంట్ కేర్....'' అన్నాడు శేఖర్ తమ్వింపుగా.

"సరే. ఈ సారి ఆంధ్రకు యెక్కువ పాయింట్లు వస్తే మీరు ముగ్గురూ తిన్నన్ని అయిటమ్స్ మీరు కోరిన హోటల్లో ఇప్పిస్తాం'' అన్నాను.

"మాట తప్పొద్దు మాలతమ్మా." అన్నాడు రమేష్.

''పూర్తిగా విను మరి. కేరళా గెలిస్తే మా ముగ్గురికి, మేం కోరిన హోటల్లో మా కిష్టమయిన పదార్థాలు మీరు ఇప్పించాలి" అన్నాను.

''అగ్రీడ్! మీరు మహా కోరితే ఏమిటి? అయిస్‌క్రీమ్ అంతేకదా. మేం డ్రింక్స్ అడిగినా వద్దనవద్దు" హుషారుగా ఈలవేసాడు హేమచంద్ర.

"చిన్న సవరణ, మాలతి తినడం అన్నది గాని త్రాగటం అనలేదు" సవరించబోయింది సుధ.

"సుద్దమ్మా! అంత కాపీనం వద్దమ్మా, అరవవాళ్ళు కాఫీని, టీని, సారాయిని తింటారు" అన్నాడు శేఖర్.

"మీరు అరవవాళ్ళు యెప్పుడయ్యారు?'' లక్ష్మి వెక్కిరింతగా అన్నది.

''లక్ష్మీ! నో ఆర్గ్యుమెంట్స్. పందెం ఖాయం'' అన్నాను.

"మీ ఆడవారి మాటలు నమ్మిందెవరట. అబలలం, అసహాయులం అని తప్పించుకున్నా తప్పించుకుంటారు'' అన్నాడు శేఖర్.

మేం కాచిన పందెం ఓ కాగితంమీద వ్రాసి, అర్గురం సంతకంచేసి, మా అందరిని యెరిగిన అధ్యాపకులు అవధానిగారి దగ్గర పెట్టాం. అయన చిరునవ్వుతో దాన్ని తీసుకున్నారు.

"వయసు వెల్లువలు!'' అనుకోవటం వినిపించింది.

ఆ తరువాత ఆ విషయమే మరిచిపోయాం. చదువు, రికార్డ్ ఇవే గొడవలు.

ఆరోజు యునివర్సిటీలో కెమిస్ట్రీ లాబ్ ముందు కూర్చున్నాను. సుధ పరుగున వచ్చింది.

"లేలే .... లే .... కేరళవాళ్ళే ఎక్కువ పాయింట్లు కొట్టేసారు" అన్నది ఉత్సాహంగా.

"కొట్టెయ్యనీ. ఈ ఎంపరికల్ ఫార్ములాతో చస్తున్నాను'' అన్నాను, తల యెత్తకుండానే.

"అది కాదే మాలమ్మా! మనతో పందెం కాసిన వీరులు చిత్తుగా ఓడిపోయారు. పార్టీ ఇస్తామంటున్నారు" అన్నది అంచులు మించిన ఆనందంతో.

"మతిమరుపు దద్దమ్మా, లే....లే....'' లక్ష్మి వచ్చింది.

అప్పటిగాని తలయెత్తి చుట్టూ చూచే అవకాశం దొరికింది. చెట్టుక్రింద నిలబడి చూస్తున్నారు ముగ్గురు వీరులు.

''అబ్బ పోనివ్వండె. పరీక్షలు అయ్యాక చూచుకుందాము'' అన్నాను.

''అదేంలేదు. అలా వదిలేస్తే అయిందానికి, కానిదానికి తాటాకులు కడతారు. వెళ్ళి తీరాల్సిందే'' సుధ పట్టుపట్టింది.

లేవక తప్పలేదు. ఇప్పటికే అప్పుడప్పుడు సుధ నామీద విసర్లు విసురుతుంది.

"నీలా తీయగా మాట్లాడటం రాదమ్మా."

"ఆఁ....మాకు మాటంటే మాటే'' అంటూ లేచాను. అందరం రమేష్‌వంక చూచాం.

"ఏమండోయ్! పార్టీ అంటే భయం అనుకున్నారా? పదండి'' అన్నాడు.

"ఏ హోటల్‌కు వెళ్దాం?" సుధ అడిగింది.

"పార్టీ నిర్ణయించింది మాలతే కాబట్టి,

హోటల్ తనే నిర్ణయించాలి" అన్నారు ముగ్గురూ.

"కోటి తాజ్‌కెళ్దాం పదండి" అన్నాను.

మావాళ్ళు కొర, కొర చూచారు. అబ్బాయిలు రిలీఫ్‌గా ఫీలయ్యారు.

"మాలమ్మా! నీ పెత్తనము చాలమ్మా. ఏఏ పదార్థాలు కావాలో నేను ఆర్డరిస్తాను" అన్నది దర్పంగా సుధ.

"సంవత్సరానికి ఆరునెలలు డయటింగ్ చేసే నువ్వేం ఆర్డరిస్తావే?"

చిటికె వేసింది సుధ.

"ఈ రోజు మూడు రోజులకు సరిపడా తింటానే. అర్థం అయిందా?"

"అయింది....అయింది" అన్నాను.

"అవునే....సుధా! అయిస్‌క్రీమ్ కాస్ట్‌లీది అడుగు" లక్ష్మి గుస, గుసగా చెప్పింది. అందరం వెళ్ళి ఫ్యామిలీ రూమ్‌లో కూర్చున్నాం.

"బేరర్!" ఆగలేనట్టు పిలిచింది.

"ఎస్....ఉప్మా, పూరి, ఊతప్పం, కట్లెట్" దండకం చదివాడు అతను మంచినీళ్ళు మా ముందు పెట్టి.

"మొదట ఆరుప్లేట్లు కట్లెట్టు తీసుకురా" దర్పంగా చెప్పింది మా సుధ.

మొదటి రౌండు వాయించేసాం.

రెండవ రౌండులో మసాలాదోసె కావాలన్నది.

మరో అయిదు నిమిషాల్లో దోసె వచ్చింది. ఈసారి నవ్వుతూ లాగించేసాము.

"గులాబ్‌జామున్ తీసుకురా" అన్నది.

"స్వీట్ తింటే ఆరోగ్యం చెడిపోతుంది" అన్నాడు శేఖర్.

"ఒక్కరోజుకి మరేం పరవాలేదు" గులాబ్ జామున్ వచ్చింది. అది పూర్తి అవుతుండగానే టమేటో బాత్‌కు ఆర్డర్ చేసింది. అంతవరకు జాలీగావున్న అబ్బాయిల మూడ్స్ ఖాళీగా మారాయి. ఒకరిని ఒకరు చూసుకుని, కళ్ళతోనే లెక్కలు, సైగలు ప్రారంభించారు.

"కాఫీయా, టీయా?" రమేష్ ఆర్టిఫిషియల్‌గా నవ్వుతూ అడిగాడు.

"కాఫీకేం తొందర ఆగండి" అన్నది సుధ.

వాళ్ళు ముఖాలు చూసుకుంటూ జేబులు తడుముకుంటున్నారు. ఒకరినొకరు చూచుకుంటున్నారు. నాకు చాలు అందామనిపించింది. కాని మంగలోడి మీసాలకోసం మగువలిద్దరు పోట్లాడారన్నట్టు ఛాలెంజీలు పందెం కాయటాలా? తిక్క కుదరనీ అనుకున్నాను. అప్పటికే కడుపు నిండిపోయింది.

"చూడు ఒకొక్కప్లేటు వెనిలా, మరి.... ఆ! టుటి ఫ్రూటి అయిస్‌క్రీమ్ తీసుకురా" అన్నది సుధ టమేటో బాత్ జాగ్రత్తగా తింటూ.

"అయిస్‌క్రీమ్ కావాలంటే మీరు తినండి. నాకు గొంతునొప్పి" అన్నాడు శేఖర్ దిగులుగా చూస్తూ.

"జలుబా! తలనొప్పా, గొంతునొప్పా! రెండు ఆస్ప్రో బిళ్ళలు వేసుకోండి" అన్నది సుధ నవ్వుతూ.

"లేదు, నాకు ఇస్నొఫీలియా కంప్లెయింటు" అన్నాడు రమేష్.

"అవునా! నాకు అయిస్‌క్రీమ్ పడటం లేదు ఈ మధ్య" అన్నాడు హేమచంద్ర.

"ఇంట్లో కూరలు, వస్తువులు సరిపడ లేనప్పుడు మా అమ్మకు ఏది సహించదు" అన్నది లక్ష్మి కవ్వింపుగా.

"భలేవారండి. మేం డబ్బుకోసం వెనకాడటంలేదు. జబ్బు వస్తుందనిగాని" అన్నాడు రమేష్.

వాళ్ళు ముగ్గురూ చూస్తుండగా మేం ముగ్గురం అయిస్‌క్రీమ్ తిన్నాం.

"సుధా! ఇంకా ఏమయినా కావాలా ఉప్మా, ఇడ్లీ వదిలేసావేం" అన్నాడు శేఖర్ వెటకారంగా.

"ఉప్మా మాకు స్టేపుల్‌ఫుడ్ అయింది. అది చేతకానిరోజు అయ్యర్ హోటల్ ఇడ్లీ తిని విసుగొచ్చింది. చాక్లెట్ అయిస్‌క్రీమ్ కావాలా" అన్నది.

"నాకొద్దు సుధా!...." అన్నాను.

"ఏమ్మా ఒక్కరోజులో లావయిపోవులే" అన్నది.


CHANDRA

"తంతాను జాగ్రత్త. ఇప్పటికే రెండుసార్లు తిన్నాం అయిస్‌క్రీమ్'' అన్నాను.

"తింటే ఏమయింది? అదేం అరగని పదార్థం కాదే."

"పరవాలేదు సుధా! ఇష్టంలేనివారిని బలవంతం చెయ్యటం దేనికి? నీకు తెప్పిస్తాను" అన్నాడు రమేష్.

ఆఖరుపట్టు అయిపోయాక అందరం రిలాక్స్‌డ్‌గా కూర్చున్నాము. బేరర్ బిల్లు తెచ్చాడు. నలభై యెనిమిది రూపాయల చిల్లర అయింది.

"నా దగ్గర నాలు రూపాయలుందిరా" సిన్సియర్‌గా డబ్బుతీసి బల్లపై పెట్టాడు శేఖర్.

"నా దగ్గర తొమ్మిది రూపాయలుందిరా" అన్నాడు హేమచంద్ర.

నేను క్రీగంట వారిని గమనిస్తూనే లక్ష్మి చెప్పే కబుర్లు వింటున్నాను. రమేష్ ముఖం వెలవెలబోయింది.

"నా దగ్గర మూడురూపాయలే వుంది" అన్నాడు ఆరిపోయిన గొంతును తడి చేసుకుంటూ.

"వాళ్ళ దగ్గర యెంతుందో అడిగి రేపి చ్చేద్దాం" హేమచంద్ర సలహా యిచ్చాడు. రమేష్‌కి నచ్చలేదు.

"జీవితాంతము హేళన చెయ్యటానికా. వద్దు" అన్నాడు.

"బిల్ పే చెయ్యండి. ఒక్క దగ్గరుంటే నాకు గడుస్తుందా?'' అన్నాడు బేరర్. మరోసారి ప్యాంటుజేబులు తడుముకుంటే డబ్బు లేదుగాని పాతది రమేష్ చెక్‌బుక్కు బయటికి వచ్చింది.

"పదవయ్యా బేరర్! మీ మేనేజర్ దగ్గర కొచ్చి చెక్కిస్తాను" అన్నాడు.

"ఏందయ్యా! తిన్నదిక్కడ బిల్ మేనెజర్ దగ్గర పే చేస్తారా? భలేవారు గనక, నా ఉద్యోగం ఊడాలా. ఊడాలా?'' అన్నాడు కోపంగా.

మా వాళ్ళకు పరిస్థితి అర్థం అయింది.

"మాలా వెళ్దాం పదవే" అన్నది సుధ.

''అవునవును. ఇప్పుడు గొప్పకోసం బిల్ యిచ్చినా ఇస్తుంది" జబ్బపట్టి లాగినంత పని జేసింది లక్ష్మి.

"ఉండవే. వాళ్ళకు చెబుదాం" అన్నాను.

"నువ్వుండు." సుధ నన్ను వెనక్కు నెట్టి ముందుకు వెళ్ళింది. "థాంక్యూ రమేష్ మాకు కాస్త కోఠీలో పనివుంది వస్తాం" అన్నది. అనుసరించక తప్పలేదు. గది దాటుతూ ఒక్కసారి తిరిగిచూచాను. ముగ్గురూ బేరర్‌తో ఘర్షణ పడుతున్నారు.

"జేబుల్లో యెంత డబ్బుందో తెలియకుండా దర్జాగా యెవరు ఆర్డరివ్వమన్నారండీ!"

"అవునయ్యా! ఇలాంటి తమాషాలు హోటల్లో జరుగటం సినిమాల్లో చూచాంగాని ఇలా యెరగం బాబూ!" అంటున్నాడు మరో బేరర్.

"ముగ్గురి జేబుల్లో కలిసివుండవా, అనుకున్నాము లేవయ్యా! ఆ మాత్రం తెలియదా?" శేఖర్ దబాయింపు వినిపించింది.

మేం గడప దాటాం.

"అమ్మయ్య!వాళ్ళు వెళ్ళిపోయారు. డబ్బుల ఏర్పాటు నేను చూస్తాను. మీరిద్దరూ యిక్కడే కూర్చుని వెయిట్ చెయ్యండి" హేమచంద్ర కంఠం మెల్లగా వినిపించింది.

పాపం అనిపించింది. కాని వాళ్ళ ధీమాకు నిజంగా ఒకసారి యిలాంటి శాస్తి జరగాలనిపించింది. లేకపోతే ఏమిటో మరోసారి డబ్బు దస్కం చూచుకుని ఏర్పాటు చేసుకోరూ!

ముగ్గురం ఆటో చేసుకుని గదికి వచ్చాము. పిన్నిగారి తమ్ముడిని అవమానించామని కాస్త ముభావంగా వుంటుంది. పరీక్షలు అయ్యేవరకు అదే ముభావంతో వుంటే బావుండును అనుకున్నాను. ఎవరిమట్టుకు వాళ్ళం పుస్తకాలు పట్టుకుని కూర్చున్నాం.

"మాలా! నేనలా తెలిసిన వాళ్ళింటికి వెళ్ళి వస్తానే" అని సుధ వెళ్ళిపోయింది.

"మాలా! అది యెందుకు వెళ్ళిందో తెలుసా?" పెద్ద డిటెక్టివ్‌లా అడిగింది లక్ష్మి.

"బాయ్ ఫ్రెండ్‌ను మీట్ అవ్వడానికేమో" అన్నాను.

"ఏముందే ఆ బుర్రలో!"

"చూచుకోలేదుగాని, చెప్పవోయ్!" అన్నాను.

"తిన్నది అరగడానికి నడుస్తుంది తెలుసా?" అన్నది. నవ్వేసాను. మర్నాడు లాబ్ నుండి వస్తుంటే హేమచంద్ర కనిపించాడు. నన్ను చూచి ముఖం చాటుచేసుకోబోయాడు. పిలిచాను.

"నాకు పని వుందండి" అన్నాడు. నాకు నవ్వు వస్తుంది. వచ్చే నవ్వును ఆపుకున్నాను.

"ఇంతకీ నిన్న హోటల్ బిల్ పే చేసారా?"

"చెయ్యకపోతే వాడు వదులుతాడా?" అన్నాడు ముఖం గంటుపెట్టుకుని.

"డబ్బు సరిపోలేదన్నారు. సారీ మేం వుండి యివ్వలేకపోయాం" అన్నాను. అతను తన యెడమచేయి చూపి వెళ్ళిపోయాడు. చాలా సేపటికి అర్థం అయింది వాచి లేదని. పాపం జాలీ మనసులు ఖాళీ జేబులు అనుకున్నాను. □

మినీ కథ :

వాచీ

కృపానందం తిట్టుకున్నాడు. పాడు వాచీ!

అందరి టైములూ పదిగంటలయితే తన వాచీ ఎనిమిదిన్నర చూపిస్తోంది. రాత్రి పండుకోబోయే ముందే సరిచేశాడు కృపానందం. అంతే షుమారుగా గంటకి అయిదు నిమిషాలు స్లో నడుస్తోంది.

కృపానందానికి పెళ్ళిలో అయిదు సంవత్సరాలనాడు మామగారు చదివించిన వాచీ అది. చదివించిన మూడో నాటికే వాచీ తప్పుగా తిరుగుతోన్నట్టు రూఢీ అయిపోయింది కృపానందానికి.

రిపేరరు వాచీ చూచి, పెదిమ విరచి, "కేసు కొత్తదండి. మిషను ఈనాటిది కాదు" అన్నాడు.

కృపానందం తన మామగారిమీద గంయ్ మనలేక భార్యమీద కంయ్ మన్నాడు.

భార్య కొత్తలోనే గంయ్ గంయ్ లాడింది. అప్పట్నించీ భార్యతోనూ వాచీతోనూ సరిపెట్టుకుంటూ వస్తున్నాడు కృపానందం.

ఉదయం లేస్తూనే గంటకి అయిదు నిమిషాలు చొప్పున లెక్కగట్టి ఆఫీస్ టయిముకి 25 నిమిషాలు ముందుకి నెట్టాడు.

ఈ వాచీ మూలంగా రోజూ మేనేజర్‌తో చీవాట్లు తినకుండా ఈ పద్ధతినే శాశ్వతంగా అమలుజరపాలనికూడా నిశ్చయించుకున్నాడు. తను రోజూ లేచేమరి!

సరిగ్గా 10 గంటలకి ఆఫీసుకు బయలు దేరాడు. అతనికి తృప్తిగా వుంది. సరిగ్గా పావు గంటలో బస్‌స్టాండుకు, మరో పావుగంటకి ఆఫీసుకి చేరుకోవచ్చును.

అన్నీ సక్రమంగా ముగిసి ఆఫీసుకి చేరాడు. కాని కృపానందానికి చీవాట్లు తప్పలేదు.

అతడి వాచీ 10.30 చూపిస్తోంటే ఆఫీస్ టైం 10.50 లో వుంది. మేనేజర్ చెడతిట్టాడు.

కృపానందం ఏడుపు బిగబెట్టుకుని సీట్లో కూలబడ్డాడు.

"చూడు .... మీ నాన్న యిచ్చిన వాచీ!" అన్నాడు భార్యతో సాయంకాలం ఇంటికి వెళ్ళగానే.

"ఏమయింది? ఉదయం టైము సరిచేశానే! స్పీడుగా పోతోంటే" అన్నది భార్య.

కృపానందం కసిగా చూసి, "నీకు అంత దయ ఈనాడు నా వాచీమీద ఎందుకు పుట్టుకు వచ్చింది?" అన్నాడు.

—ఎం. వి. వి. సత్యనారాయణ

పనికి ఆహారం పథకం

నిరుద్యోగులకు, చేతినిండా పని లేనివారికి లాభసాటి అయిన ఉపాధి కల్పించి, సామాజిక ఆస్థులను పెంపొందించే లక్ష్యంతో పనికి ప్రతిఫలంగా ఆహారం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు.

ఆంధ్రప్రదేశ్ లో యీ పథకాన్ని ముమ్మరంగా అమలు జరుపుతున్నారు. దీనిక్రింద రు. 14.55 కోట్లు విలువ చేసే కార్యక్రమాలను రాష్ట్రప్రభుత్వం చేపట్టింది.

ఈ కార్యక్రమం క్రింద ఇంతవరకూ 1056 కి.మీ. పొడవున కొత్త రోడ్లు, 3170 కి.మీ. పొడవున మెటల్, కంకర రోడ్ల మరమ్మత్తులు, 170 పాఠశాల భవనాల నిర్మాణం, 134 నీటి పారుదల వసరుల నిర్మాణం వంటి కార్యక్రమాలను చేపట్టి పూర్తిచేశారు.

వీటివలన 49,392 లక్షల శ్రామిక దినాల మేరకు ఉపాధి కల్పించగలిగారు.

డి.జి.స.పౌ.సం.శా. 48

సర్పశాంతి

'మిర్రర్'

సాయంకాలం అయిదున్నర అయింది.

ఆఫీసునుంచి ఇంటిముఖంగా వెళుతున్నాను. ఆబిడ్సు చేరుకునేసరికి కార్డులు, కవర్లు కొనవలసిన అవుసరం గుర్తువచ్చి జి.పి.వో.లో జొరబడ్డాను.

కౌంటరులో వున్న క్లర్కుతో నాకు కావలసిన వాటి వివరాలు చెబుతుండగా గబగబా వో యువకుడు వచ్చి అంతకంటె తొందరగా ఇరవై అయిదు పైసల స్టాంపు కావాలంటూ హడావిడి పెట్టాడు.

అతని తొందరపాటుకు నాతోపాటు కౌంటరులో క్లర్కుకూడా ఆశ్చర్యపోయాడు.

ఆ యువకుడు తన చేతిలో వున్న కవరు కౌంటరుమీద వుంచి జేబులోంచి పర్సుతీసి ఇరవై అయిదు పైసల నాణెం అందించాడు.

యధాలాపంగా ఆ కవరువైపు చూసిన నేను నిలుచున్న చోటినే కొయ్యబారిపోయాను. ఆ కవరుమీద నా భార్య పేరుతోపాటు మా ఇంటి అడ్రసు వ్రాసి వుంది.

నా భార్య సునందకు లెటరు వ్రాస్తున్న ఆ యువకుడిని గతంలో నేనెన్నడూ చూడలేదు. అతనికి ఇరవై ఎనిమిది సంవత్సరాల వయసుంటుంది. మనిషి మహా స్మార్టుగా వున్నాడు.

నేను తేరుకునే లోపల ఆ వ్యక్తి కవరుమీద స్టాంపు అంటించి ప్రక్కనేవున్న లెటరుబాక్సులోకి కవరు జారవిడిచి గబగబా బయటకు నడిచాడు.

అయోమయంగా అతన్ని వెంబడిస్తూ బయటకు వచ్చాను. చూస్తూ చూస్తూ వుండగానే అతను ఎదురుగా ఆగివున్న డబుల్‌డెక్కర్ బస్సు ఎక్కటం అది కదిలి వెళ్ళటం జరిగిపోయింది.

ఆ యువకుడు ఎవరు? అతనికి సునందకి గల సంబంధం ఏమిటి? అతని గురించి తెలుసుకునే లోపలే క్షణంలో మరుగైపోయి నా మనసులో పెద్ద తుఫాను సృష్టించాడు.

వుత్తరాలు కొనకుండానే రోడ్డున పడి నడవటం మొదలుపెట్టాను. ఎందుకో ఇంటికి వెళ్ళ బుద్ధికాలేదు. దగ్గరిలో వున్న పార్కుకి వెళ్ళి ఒక మూల కూర్చున్నాను.

సునందకి నాకూ పెళ్ళిజరిగి ఆరునెలలు అయింది. మూడునెలల కిందట ఆమె కాపురానికి వచ్చింది. పెళ్ళికి ముందు ఆమె గత చరిత్ర ఏమిటో నాకు తెలియదు. అసలు "గతం" అంటూ ఏదైనా వుందో లేదోకూడా తెలియదు.

వాళ్ళవాళ్ళు ఎవరో వచ్చి పిల్లనిస్తామని మా నాన్నగారిని అడిగారు. ఆ తరువాత పెళ్ళిచూపులకి వెళ్ళి ఆమె నచ్చటం, పెళ్ళి చేసుకోవటం చకచకా జరిగిపోయాయి.

మూడు నెలలనుంచీ ఆమెతో కలిసి జీవిస్తున్నా, ఆమె నాకు ఇంకా పూర్తిగా పరిచయం కాలేదు. మా ఇరువురి మధ్య "కొత్త" ఇంకా వదలిపోలేదు.

ఈ హైదరాబాదులో తనకి తెలిసిన ఒక వ్యక్తి వున్నట్లు ఆమె నాకెన్నడూ చెప్పలేదు.

అతనెవరై వుండవచ్చు?

ఆమె బి.యే. చదివింది. అతను ఆమె కలిసి చదువుకున్నారా? ఆమె అతన్ని గతంలో ప్రేమించిందా? అతను ఆ కవరులో ఏమి వ్రాసి వుండవచ్చు? ప్రేమలేఖా?

మెదడు మొద్దుబారి పోయింది. బుర్ర వేడెక్కిపోయింది.

అసలు ఆ వుత్తరంలో ఏం వ్రాసి వుందో తెలిసేవరకూ ఏమీ అంతుపట్టేలా లేదు.

రేపు మధ్యాహ్నం పోస్టులో లెటరు ఇంటికి వస్తుంది. రేపు సెలవుపెట్టి సునందకంటె ముందుగా ఆ లెటరు అందుకోవాలి.

ఈ నిర్ణయం తీసుకున్న తరువాత మనసు కాస్త కుదుటపడింది.

ఆలస్యంగా ఇల్లు చేరుకున్నాను.

"ఇంత ఆలస్యం అయిందేం" అంది సునంద.

"ఆఫీసులో పని ఎక్కువగా వుండి ఇప్పటి దాకా వుండిపోయాను."

"త్వరగా స్నానంచేసి రండి. భోజనం చేద్దురుగానీ" అంది సునంద.

భోజనంచేస్తూ ఆమెను గమనిస్తున్నాను. కానీ ఆమెలో నాకు కొత్తభావాలు ఏమీ కనపడ లేదు.

రాత్రి పది దాటింది.

ఆమె నిద్రలోకి జారుకుంది. నేను ఇంకా ఆ వ్యక్తి గురించే ఆలోచిస్తున్నాను. ఎంత ప్రయత్నించినా నిద్ర రావటంలేదు.

"అతను సునందకి ఇంతకుముందుకూడా వుత్తరాలు వ్రాసివుంటాడు. ఆమె వాటిని దాచివుంటుంది" అనిపించింది.

సునంద నిద్రపోతూనే వుంది.

నిశ్శబ్దంగాలేచి ఆమె ట్రంకుపెట్టి తెరిచాను. ఎన్నో చీరెలు, ఎన్నో జాకెట్లు, ఎన్నో లంగాలు. అన్నిటినీ మడతలు విప్పిచూసాను. ఆఖరుకు ట్రంకు అడుగున వేసిన న్యూస్ పేపర్ కిందకూడా వెతికాను. నేను వూహించిన వస్తువు కనపడలేదు.

బట్టలు తిరిగి సర్దుతూవుండగా, సునందకి మెలకువ వచ్చినట్లుంది.

"ఏమిటండీ వెతుకుతున్నారు" అంది.

కన్నంలో పట్టుబడిన దొంగలా అయి పోయింది నా పరిస్థితి.

"ఆఫీసు కాగితం ఒకటి కనపడటంలేదు. నీ పెట్టెలోకి వచ్చిందేమోనని వెతుకుతున్నాను" నోటికి వచ్చిన అబద్ధం ఏదో చెప్పాను.

నా మాటలు నమ్మినట్టులేదు. అయినా ఏమనుకుందో ఏమో, మవునంగా మళ్ళీ నిద్ర పోయింది.

మరునాడు ఆఫీసుకు సెలవుపెట్టి రోజు అంతా పోస్ట్‌మాన్ కొరకు ఎదురుచూస్తూ కూర్చున్నాను. పోస్ట్‌మాన్ అందరికీ లెటర్లు పంచిపెట్టి వెళ్ళాడు. కానీ మాకు ఆ యువకుడు వ్రాసిన లెటరు రాలేదు.

అసలు ఆ లెటరుమీద సునంద పేరు వుందా? లేక నేను వూరికే భ్రమపడి వుండవచ్చా అన్న సందేహం కలిగింది. కానీ సందేహానికి తావులేదు. ఆమె పేరుతోపాటు మా యింటి అడ్రసు కూడా స్పష్టంగా చదివాను.

ఇవాళ కాకపోతే రేపు అయినా ఆ లెటరు వస్తుంది. ఆ లెటరు కోసమని రెండవరోజు కూడా సెలవుపెట్టాను.

"ఇవాళ కూడా ఆఫీసుకు వెళ్ళలేదు. వంట్లో బాగుండలేదా?" అంటూ సునంద నా నుదుటిమీద చెయ్యివేసింది జ్వరం చూస్తు న్నట్టుగా.

ఆమె చేతిస్పర్శలో గల ప్రేమకి, ఆమె నాపై చూపుతున్న అభిమానానికి క్షణకాలం కరిగిపోయాను. ఆమెను అనుమానిస్తున్నందుకు సిగ్గుపడ్డాను. కానీ ఆ లెటరులో ఏముందో చూడాలనే కోరిక చంపుకోలేకపోతున్నాను.

"వంట్లో కులాసగానే వుంది. కానీ ఆఫీసు పనిలో చికాకుగా వుంటూంది. అందుకే సెలవు పెట్టాను" అన్నాను.

"భోజనంచేసి హాయిగా నిద్రపొండి. విసుగు తగ్గిపోతుంది" అంది ఆమె.

నేను సెలవుపెట్టిన కారణం ఆమె గ్రహించి వుండవచ్చా? నేను నిద్రపోయే సమయంలో ఆ లెటరు వస్తే నాకు అందకుండా చేయాలని ఆమె పథకం చేస్తూందేమో. ఈ రోజు లెటరు వస్తుందని ఆమె వూహిస్తూ వుండాలి.

ఇలా కాదని చెప్పి తిన్నగా పోస్టాఫీసుకు బయలుదేరాడు.

మా బజారుకు వచ్చే పోస్టుమాన్ ఎవరో తెలుసుకుని, అతన్ని మంచిచేసుకుని, అడ్రసు చెప్పి మాకు లెటర్లు వుంటే యిచ్చెయ్యమని కోరాను.

అతను తనవద్దగల సంచిలోంచి యింత కట్ట బయటకు తీసి వరుసగా వెతకటం మొదలు పెట్టాడు.

నేను సస్పెన్సు భరించలేకపోతున్నాను.

ఇంతలో అతను ఒక కవరుతీసి అందించాడు.

అది సరిగ్గా నిన్న ఆ యువకుడి చేతిలో చూసిన కవరే. ఒకవైపు నుంచి జాగ్రత్తగా చింపి లోపలి కాగితం బయటకు తీసాను.

అందులో ఇలా వుంది.

డియర్ సునందా!

నిన్ను ఎప్పుడు చూస్తానా అని అనుక్షణం ఆరాటపడుతున్నాను. కానీ పని తొందరవల్ల వీలుపడటంలేదు. వీలు చూసుకుని వస్తాను. అన్ని విషయాలు అప్పుడే చెప్పుకుందాము.


ఇట్లు
నీ శ్రీపతి

నాకు అంతా అర్థం అయింది. అమాయకంగా కనపడే సునందలో ఇంత జాణతనం వుందని వూహించలేకపోయాను. అందుకే కాబోలు ఆడదాన్ని అసలు నమ్మకూడదంటారు. బహుశా ఈ శ్రీపతితో లేచిపోవటానికి ఈ పథకం వేస్తూందేమో. అతనిమీద అంత ప్రేమవుంటే మరి నన్నెందుకు పెళ్ళి చేసుకుందో?

సునంద మీద నాకు అంతులేని అసహ్యం కలుగుతూంది. ఆమెని నిలువునా హత్య చెయ్యాలనిపిస్తూంది. కానీ ఆమెను చంపినందువల్ల నేను కొత్తచిక్కుల్లో ఇరుక్కోవటం తప్పించి నాకు ఒరిగేదేమీలేదు.

ఎలాగైనా ఆమెను వదిలించుకోవటం మంచిది. ఇలాంటిది అని తెలిసింతరువాత కూడా ఆమెతో ఎలా సంసారం సాగించటం? ఏది ఏమైనా బంగారంలాంటి నా జీవితం నాశనం అయిపోయింది. వివాహం అంటే ఇద్దరు కలిసి నిర్మించుకునే "స్వర్గసీమ" అనుకున్నాను కానీ ఇలా "నరకయాత్ర" అవుతుందని వూహించలేకపోయాను. ఇదంతా నా దురదృష్టం. కానీ కొంతలో కొంత మేలు అన్నట్టుగా పిల్లలు పుట్టకముందే అసలు రంకు బయటపడిపోయింది.

తక్షణం ఆమెని పుట్టింటికి పంపించి వెయ్యాలి. తరువాత లాయరును కన్సల్టుచేసి విడాకులు కోసం కోర్టులో కేసు ఫైలుచెయ్యాలి



గ్రామాలకు మంచినీరు

ఆంధ్రప్రదేశ్ లోని గ్రామీణ ప్రాంతాలలో మంచి నీటి సౌకర్యాల కల్పనకు అధిక ప్రాధాన్యత నిస్తున్నారు.

ప్రతి ఏడాది సగటున 3500 గొట్టపు బావుల త్రవ్వకం జరుగుతున్నది.

అయితే 1978 సంవత్సరం వేసవి కాలంలోనే 3930 బావులు త్రవ్వడం జరిగింది.

దానికితోడు నీటి ఎద్దడిగల ప్రాంతాలకు బృహత్తర పథకాన్ని తయారుచేశారు. నెదర్లాండు ప్రభుత్వ సహాయంతో త్వరలో ఫ్లోరైడ్‌కు గురైన గ్రామాలకు రక్షిత మంచినీటి సరఫరా చేసే పథకాన్ని అమలు జరుపుతారు.

డి.జి.స.పౌ.సం.శా. 49

అనుకున్నాను.

అనుకున్నదే తడవుగా తిన్నగా బస్‌డిపోకి వెళ్ళి వాళ్ళవూరికి వెళ్ళే బస్సులో ఒక సీటు రిజర్వు చేయించాను.

ఇవాల్టి బస్సులో సీట్లులేవు. అందువల్ల రేపటి వుదయం బస్సులో టికెట్టు తీసుకున్నాను.

ఆమెను పుట్టింటికి పంపుతున్నట్టుగా ఇవాళే చెప్పకూడదు. చెబితే ఆమె ఏవో కథలు అల్లి నా మనసు కరిగిపోయేలా చేయవచ్చు. రేపు వుదయం ప్రయాణం ఒకగంటలో వుందనగా, ఆమెకు చెప్పి ఆలోచించుకోవటానికి కూడా టైము యివ్వకుండా ఆమెను పంపెయ్యాలి.

నేను తిరిగి తిరిగి ఇంటికి వచ్చేసరికి నా భార్య ఎవరితోనో మాట్లాడుతూంది. నేను లోపలికి వెళ్ళేసరికి "నమస్కారం బావగారూ" అంటూ కుర్చీలోంచి లేచి వినయంగా నాకు నమస్కరించాడు అతను.

అతను ఎవరో కాదు. నిన్న నేను జి.పి.ఓ.లో చూసిన యువకుడే. అంటె శ్రీపతి అన్నమాట. నాకు కోపంలో వళ్ళు తెలియటంలేదు. ఇంకా కొంచెం ఆగితే నేను ఏంచేసివుండేవాడినో నాకే తెలియదు. కానీ ఇంతలో నా భార్య "వీడు శ్రీపతి. మా పెద్దనాన్నగారి అబ్బాయి. నాకంటె రెండేళ్ళ పెద్దవాడు. మన పెళ్ళికి రాలేదు. మీరు చూసివుండరు" అంది.

ఏదో చెప్పి దాటవెయ్యాలని సునంద ప్రయత్నిస్తూవుండాలి. ఇతను మా పెద్దమామగారి అబ్బాయి అయితే నాకు తెలియకపోవటం ఏమిటి? నా పెళ్ళికి రాకపోవటమేమిటో? ఆమె మాటలు నమ్మశక్యంగా లేవు.

"వీడు ఇన్నాళ్ళూ బెనారస్‌లో స్టేట్ బాంక్‌లో పనిచేశాడు. సెలవు దొరకక అప్పుడు మన పెళ్ళికి రాలేకపోయాడు. ఇప్పుడు వీడికి హైదరాబాదు ట్రాన్స్‌ఫరు అయిందట. వీడికి నేనంటే ఎంతో ప్రేమ. చూడండి నా కోసం ఎన్ని వస్తువులు తెచ్చిపెట్టాడో. నాకు అన్నయ్యలున్నారు కానీ వీడికి చెల్లెళ్ళు లేరు. అందుకే వీడికి నేనంటే చిన్నప్పటినుంచీ ఎంతో ప్రేమ" అంది సునంద.

"బావగారూ! మీరు నాకు చాలా నచ్చారు. మా చెల్లెలు చాలా అదృష్టవంతురాలు. మీలాంటి వున్నత విద్యావంతుడు, ఎంతో సంస్కారంగల వ్యక్తి ఆమెకు లభించటం మా అందరి అదృష్టం. మీరు మా సునందని ఎంతో మంచిగా చూసుకుంటారుట. ఆ విషయమే చెబుతూంది. మా సునందికి ఎలాంటి భర్త వస్తాడో అని అందరికంటె నేను దిగులు పడుతూవుండే వాడిని. మిమ్మల్ని ఇదే చూడటం అయినా ఎంతో ఆత్మీయులులాగా వున్నారు" అంటూ శ్రీపతి లేచి అక్షరాలా నన్ను కౌగలించుకుని నన్ను వున్నతుడిగా చిత్రిస్తూ తన ఆనందం వ్యక్తపరిచాడు.

నెమ్మదిగా నా ఆవేశం తగ్గిపోయింది.

నా తొందరపాటుకు నేను ఎంతో సిగ్గుపడ్డాను. నా భార్యపై నిష్కారణంగా అనుమానం పెంచుకున్నందుకు నాకు ఎంతో మానసిక గ్లాని కలిగింది.

శ్రీపతి సునందకి కజిన్ బ్రదర్ అన్న విషయం రూఢీ అయింది. ఇప్పుడు అతని ముఖంలో మామగారి పోలికలు స్పష్టంగా అగుపడుతున్నాయి.

"అన్నట్లు సునందా! నిన్న నీకు లెటర్ వ్రాసాను. అందిందా? సిటీకి వచ్చి రెండు రోజులు అయినా ఆఫీజుచార్జి తీసుకోవటంలో తీరుబడి కాలేదు. ఇలా కాదని ఓ లెటరు రాసి పడేసాలే" అన్నాడు శ్రీపతి.

"లెటరా! నాకు ఏదీ రాలేదే" అంది సునంద ఆశ్చర్యంగా.

"లెటరు వచ్చింది. ఇందాక బజారులో పోస్టుమాన్ కనబడి ఈ లెటరు ఇచ్చాడు" అంటూ జేబులోంచి కవరు బయటకు తీసాను. కవరుతోపాటు బస్సుటికెట్టు వచ్చి కిందపడింది.

"ఈ టికెట్టు ఏమిటి? ఎవరికోసం?" అంటూ సునంద ఆ టికెట్టును తీసుకుని ఆశ్చర్యపోసాగింది.

"మా ఆఫీసులో ఒకతను తెచ్చిపెట్టమంటే ఇందాక అటువెళ్ళి తీసుకువచ్చాను. ఇలా యియ్యి" అంటూ దాన్ని ఆమెనుంచి తీసుకుని దాచేశాను.

అయితే యిది జరిగినప్పటి నుంచీ నా భార్య ముందు గిల్టీగానే ఫీలు అవుతున్నాను. □

చీకటి వైపు

ప్రతాప రవిశంకర్

తలుపు తీసింది సుందరి.

ఎదురుగా ప్రకాశం నిలబడి వున్నాడు.

"నువ్వా" అన్నది సుందరి.

"అవును నేనే....ఇంకెవరయినా వస్తారను కున్నావా"

"అవును....మా అమ్మ అనుకున్నాను."

లోపలకు వెళ్ళాడతను. గోడవారగా వున్న కుర్చీలో కూర్చున్నాడు. ప్రకాశం ఎదురుగా సుందరి కూర్చుంది.

"మీ అమ్మ ఆఫీసునించి అప్పుడే వస్తుందా" అడిగాడతను....

"ఒంటిగంటకే వస్తానని చెప్పింది. ఎందు వల్లనో రాలేదు. ఎవరింటికో వెళ్ళాలనిచెప్పింది. పర్మిషన్ తీసుకుని వస్తానన్నది"

"నీ చదువు ఎలావుంది?" ప్రక్కనే టేబుల్ మీది వారపత్రికను అందుకుంటూ అడిగాడు.

"బోర్ కొడుతూంది....వెధవ చదువు.... చదివినదే చదవడం....ఈ ఎకనమిక్స్‌తో చస్తు న్నాను....ఎంత చదివినా రావటంలేదు...."

"ఈసారయినా పాస్ అవుతావా?"

"నమ్మకం లేదు."

చేతిలోవున్న పుస్తకంలో ఓ కథ తీసి చద వటం మొదలుపెట్టాడు ప్రకాశం.

"కథలు చదువుతున్నావా?"

"అవును" తల వూగించాడు....

"వెధవ కథలు చెత్తగావున్నాయి....అవేం చదువుతావ్?" అంటూ అతని చేతిలోనించి ఆ వారపత్రికను లాక్కుంది సుందరి.

"మరేం చెయ్యమంటావ్?"

"మన ఎదురింటి మేడమీద గదిలోకి కొత్తగా అద్దెకు వచ్చిన ఆమెను చూశావా?" అడిగింది సుందరి.

"చూశాను."

"ఆమె గురించి నీ అభిప్రాయం ఏమిటి?"

"ఇంతవరకూ ఏ అభిప్రాయానికీ రాలేదు" చెప్పాడు.

"నేను వచ్చాను" అన్నది.

"ఏమిటి నీ అభిప్రాయం! ఆమె అంద మైనదనా?"

"ఆఁ ఏమంత అందమయినది" తేలిగ్గా అన్నది.

"మరి ఏమని?"

"ఆమె మంచిది కాదు."

"మంచి కాదా! అంటే?" కొంచెం ముందుకు వంగుతూ అడిగాడతను.

"ఆమె మనిషి మంచిది కాదు."

"ఎలా చెప్పగలవు? ఆమె నీకు ఇంతకు ముందే తెలుసా?"

"కాదు. ఇంట్లోకి వచ్చిన నాలుగు రోజుల నించీ చూస్తున్నాను. రోజూ రాత్రి పొద్దుబోయిన తర్వాత ఆమెకోసం ఎవరో వస్తున్నారు."

"నిజంగానా"

"అవును. మొదటిరోజు రాత్రి అంతగా పట్టించుకోలేదు. కాని రెండోరాత్రి ఓ నవల చదువుతూ పడుకున్నాను. పన్నెండు గంటల వేళ పైన గదితలుపులను ఎవరో తట్టిన చప్పుడు వినిపించింది. చూస్తే ఒకాయన నిలబడివున్నాడు. తలుపులు తెరుచుకున్నాయి. ఆయన లోపలకు వెళ్ళాడు. తలుపులు మూసు కున్నాయి. ఆ తర్వాత కొంచెంసేపటికి లైటారి పోయింది. అప్పట్నించీ రోజూ చూస్తున్నాను. అలాగే జరుగుతోంది" అన్నది సుందరి.

ప్రకాశం మాట్లాడలేదు.

ఒకసారి ఎదురింటి మేడమీద గదికేసి చూశాడు. తలుపులు మూసివున్నాయి.

"ఆమెకు ఎవరూ లేరేమో" అన్నది సుందరి.

"ఏమో. కనుక్కురమ్మంటావా?" అడిగా డతను నవ్వుతూ.

"నువ్వెందుకు కనుక్కురావడం" అన్నది.

"నీకు చెప్పటానికి."

"సర్లే మూడయినట్టుంది. కాఫీ చేస్తాను"

లేచి నిలబడింది సుందరి.

దగ్గరకు వేసివున్న తలుపులను తెరుచుకుని వంటగదిలోకి వెళ్ళింది. స్టవ్ తీసుకొచ్చి అతని ఎదురుగా గుమ్మం దగ్గరగా వుంచి వెలిగించింది. తర్వాత దానిమీద స్టీలుగిన్నెతో నీళ్ళు పెట్టింది.

ప్రకాశం మళ్ళీ ఆ వారపత్రికను చేతికి తీసుకున్నాడు. ఇంతకుముందు కొంచెం చదివిన కథను చదవటం మొదలుపెట్టాడు.

"నీ శెలవు ఇవాళతో అయిపోతుందా?" అడిగింది సుందరి.

"అవును. రేపు ఆఫీసుకు వెళ్ళాలి."

"నిన్న ఎప్పటినించో అడగాలని అనుకుంటున్నాను ఒక విషయం. మరచిపోతూనే వున్నాను" అన్నది.

"ఏమిటి?"

"మీ ఆఫీసులో అమ్మాయిలు వున్నారు కదూ?"

"అవును."

"వాళ్ళు మీతో ఫ్రీగా మూవ్ అవుతారా?"

ప్రకాశం మాట్లాడలేదు. నవ్వాడు చిన్నగా.

"మాట్లాడవేం?"

"ఎందుకు అవన్నీ అడుగుతున్నావ్?"

"ఊరికే సరదాకు."

"బాగానే మాట్లాడతారు. మగవాళ్ళతో కాంటీన్‌కి వస్తారు. కొంతమందితో అంటే ఇష్టమయిన వాళ్ళతో సినిమాలకు కూడా వెళతారు" చెప్పాడు.


"నువ్వు ఏ అమ్మాయినైనా సినిమాకు తీసుకెళ్ళావా?"

"ఆఁ"

"నిజంగానా?"

"అవును... నిజంగానే"

"ఎవర్ని" కంగారుగా అడిగింది.



"నిన్ను" నవ్వుతూ చెప్పాడు ప్రకాశం....

"చంపేశావు....నేను అడుగుతున్నది నా విషయం కాదు....మీ ఆఫీసులో అమ్మాయిల విషయం" కాఫీ కలుపుతూ అడిగింది.

"లేదు....నేను ఎవర్నీ రమ్మని అడగలేదు. ఎవరూ వస్తామనీ అనలేదు"

"ఐతే నువ్వు బుద్ధిమంతుడివన్నమాట" కాఫీ కప్పు ప్రకాశానికి అందిస్తూ అన్నది....

"కాదు" అన్నాడు....

"కాదా ఏ అమ్మాయితో సినిమాకు వెళ్ళ లేదు గదా"

"నీతో వచ్చానుగదా"

"నా విషయం వేరు"

"ఏం?"

"కాబోయే శ్రీమతిగారి హోదాలో వచ్చాను నేను" సిగ్గుపడుతూ అన్నది.

"అలాగా" అన్నాడు కప్పు కిందబెడుతూ.

"ఇవాళ రాత్రి పన్నెండుగంటల వరకూ మెలకువతో వుంటావా?" అడిగింది సుందరి.

"ఎందుకు?"

"ఎదురింటి మేడమీద గదిలో ఆమెకోసం వచ్చే మనిషిని చూడొచ్చు."

"ఎందుకు చూడటం?"

"ఎందుకేమిటి?·వూరికే....నీకూ తెలుస్తుంది ఆమె ఎలాంటి మనిషో."

"ఎలాంటిదయితే మనకెందుకు?" అని లేచి నిలబడ్డాడు ప్రకాశం.

"నీ గదిలోకి వెడుతున్నావా?" అడిగింది.

"కాదు. అలా బజారువరకు వెళ్ళొస్తాను."

"అయితే మంచి నవల ఒకటి అద్దెకు తీసుకురా" అన్నది.

"ముందు నువ్వు ఎకనమిక్స్ చదువు—నవలలు తర్వాత చదువుదువుగాని" అని బయటకు వెళ్ళిపోయాడు ప్రకాశం....

అతను వెళ్ళినవయిపే చూస్తూ నిలబడింది సుందరి.

ర ర ర

ఆదివారం. మధ్యాహ్నం పన్నెండుగంటలు కావస్తోంది.

ముందుగదిలో కుర్చీలో కూర్చుని నవల చదువుతోంది సుందరి. అప్పుడే గేటు నెట్టుకొని లోపలకు వచ్చాడు ప్రకాశం.

అతన్ని చూడగానే "భోజనం అయిందా?" అడిగింది సుందరి.

"ఇప్పుడే చేసివస్తున్నాను" అన్నాడు అతను తన గదివయిపుకు వెళుతూ.

"మా ఇంట్లోకూర్చుందువుగాని... ఇటురా" పిల్చింది.

"మీ అమ్మ ఇంట్లోలేదా?" లోపలకు వస్తూ అడిగాడు.

"లేదు....ఎవరో ఫ్రెండు ఇంటికి వెళ్ళింది"

"నువ్వు పరీక్షల్లో చదివిన నవలలన్నీ రాస్తున్నట్టున్నావు" సుందరి చేతిలోవున్న నవలను చూసి అన్నాడు ప్రకాశం.

"నవలలు రాసినా నయమే... ఇక చదువెందుకు?" నవలను మూసి ప్రక్కన పెడుతూ అన్నది సుందరి.

"మీ అక్కయ్యల దగ్గర్నుంచి ఉత్తరాలు వచ్చాయా?" అడిగాడు.

"ఎవరి దగ్గర్నించీ రాలేదు....నేనే రేపు రాయాలనుకుంటున్నాను."

అతను మాట్లాడలేదు.

"నువు మన వెనుక ఇంట్లో మొదటి భాగంలో వుండే ఆ మె ను ఎప్పుడయినా చూశావా?" అడిగింది సుందరి.

"చూశాను....ఎందుకు?"

"ఆమె చూపులకు ఎంత అమాయకంగా వుంటుందీ?"

"ఐతే?"

"ఇవాళ ఉదయం ఆమెను మొగుడు చచ్చేట్టు కొట్టేడుట"

"ఎందుకు?"

"ఆమె రెండ్రోజుల క్రితం పుట్టింటికని వెళ్ళిందిట....నిన్న రాత్రి పుట్టింటినించి ఆమె తండ్రి ఇక్కడకు వచ్చాడుట. కూతురు అక్కడకు రాలేదని అన్నాడు. ఇవాళ ఉదయం వచ్చిందిట. ఎవడిదగ్గరకు వెళ్ళిందోనని చావ గొట్టేడుట... "

"ఇంకెవరయినా బంధువుల ఇంటికి వెళ్ళిందేమో" అన్నాడు ప్రకాశం.

"అలాంటప్పుడు పుట్టింటికని చెప్పటం ఎందుకు?" అడిగింది సుందరి.

"ఏమో! ఆమె కారణాలు మనకేంతెలుసు?"

"నేను మాత్రం అందుకు ఒప్పుకోను" అన్నది సుందరి.

"నీ యిష్టం వచ్చినట్టు ఆలోచించుకో" అని వెళ్ళిపోయాడు ప్రకాశం.

ఆ రోజు సాయంత్రం అతని గదిలోకి వెళ్ళింది సుందరి. అతను అప్పుడే నిద్రలేచాడు.

"మేము రేపువూరికి వెళుతున్నాం" అన్నది.

"ఎందుకు?" అడిగాడు ప్రకాశం.

"మా బాబాయి కూతురు పెళ్ళి ఇంకో నాలుగు రోజుల్లో... ఓ వారంలో వస్తాము."

ప్రకాశం మాట్లాడలేదు.

"కొంచెం మా ఇల్లుకూడా చూస్తూ వుండు" అని వెళ్ళిపోయింది సుందరి.

ఆ మరురోజు సుందరి-సుందరి తల్లి వూరికి వెళ్ళిపోయేరు.

గ గ గ

సుందరి పూర్ణించి వచ్చింది తల్లితో పది రోజుల తర్వాత....వచ్చేసరికి ప్రకాశం గదికి తాళంపెట్టి వుంది. ఎక్కడికయినా వెళ్ళాడేమో అనుకుంది. కాని అతను మరురోజుకూడా రాలేదు. ఇంటివాళ్ళను కనుక్కుందా మనుకున్నా వాళ్ళు ఆ వూళ్ళో వుండరు....ప్రకాశం ఎక్కడికి వెళ్ళాడో అర్థంకాలేదు....ఆరోజు సాయంత్రం అతని ఆఫీసుకు వెళ్ళింది....శలవు పెట్టేడని తెలిసింది.

సుందరి ఎంత ఆలోచించినా అతను ఎక్కడకి వెళ్ళాడో అర్థంకాలేదు.

ఆ మరురోజు ఉదయం పోస్టులో సుందరికి ప్రకాశం దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. గబగబా దాన్ని విప్పి చదువసాగింది.

సుందరీ....

ఈ ఉత్తరం నీకు చాలా ఆశాభంగాన్ని కలిగిస్తుందనుకుంటాను. నేను సెకండియర్‌లో వున్నప్పుడు మీ ఇంటిపక్కనున్న గదిలోకి అద్దెకు వచ్చాను. అప్పుడు నువ్వు టెన్తు క్లాసు చదువుతున్నావు. తర్వాత నాకు ఇక్కడే ఉద్యోగం రావటంవల్ల ఆ గదినించి మారలేదు. నాలుగేళ్ళనించీ మనిద్దరిమధ్యా స్నేహంవుంది. నీలో నాకు తెలిసి ఎలాంటి లోపం లేకపోవటం వల్ల నిన్ను పెళ్ళి చేసుకుంటానని మీతో చెప్పాను. కాని నీలో వయస్సు పెరుగుతున్నకొద్దీ మనుషులను అర్థంచేసుకునే శక్తి నశించి పోతూ వచ్చింది. ప్రతి విషయాన్నీ చీకటివైపు నించే చూడటం ఎక్కువయిపోయింది. నువ్వు చెప్పిన ఎదురింటామె పక్కింటామె కథలు నిజంకాదని నాకు తెలుసు. ఎదురింటామె దగ్గరకు రాత్రిపూట వచ్చి తలుపు కొట్టేది ఆమె భర్తే. ఆయనకు మరో వూళ్ళో ఉద్యోగం.... వచ్చేసరికి ఆ టైమవుతుంది. ఇక పక్కింటామె వెళ్ళింది ఆమె అక్కయ్యగారింటికి. ఆమె అక్కయ్యకూ భర్తకూ వైరం ... ఆమె మొగుడు ఆమెకు మేనమామే. అందుకని ఆయన కొట్టేడు.

ఇక అసలు విషయం రాస్తాను. నువ్వు ఇంతమందిని వేలుపెట్టి చూపిస్తున్నావు. మీ అమ్మ ఎలాంటిదో నీకు తెలుసుననుకుంటాను. ఎలాంటి ఆస్తులూ లేకుండా పదివేల కట్నం ఇచ్చి ఇద్దరు కూతుళ్ళ పెళ్ళిళ్ళు ఎలా చేసిందో నీకు తెలుసుననుకుంటాను. నాలుగయిదుసార్లు ఇతర మగవాళ్ళతో నాకు సినిమా థియేటర్లో కనిపించింది. రాత్రిపూట మీ అమ్మకోసం అప్పుడప్పుడు మగవాళ్ళు రావటం నేను గమనించానుకూడా. ఎప్పుడో పదేళ్ళక్రితం మొగుడు ఎక్కడికో పోయినా ఓ ప్రయివేటు కంపెనీలో చిన్న ఉద్యోగం చేస్తూ మిమ్మల్నందరినీ ఇంత పెద్ద నగరంలో ఎలా ఇప్పటివరకూ పెంచినదీ నాకు తెలుసు. ఇవన్నీ నీకూ తెలుసు. తెలిసి కూడా నువ్వు ఎదుటివారి తప్పులను భూతద్దంలో నాకు చూపటానికి ఎందుకు ప్రయత్నించేవావో నాకు తెలీదు. దీన్నిబట్టి నీ సంస్కారం తెలుస్తోంది. నీలాంటి మనిషిని చేసుకున్న ఏ మనిషికీ మనశ్శాంతి వుండదని నా ఉద్దేశం.... అందుకే నువ్వు రాకముందే ఆ గది ఖాళీచేసి వెళ్ళిపోయాను. దయచేసి ఇకముందు నన్ను కలుసుకునే ప్రయత్నం చెయ్యవద్దు. నీలో ఆశలు కలిగించివుంటే నన్ను క్షమించు.

—ప్రకాశం.

ఆ ఉత్తరాన్ని చదివి మొదలు నరికిన చెట్టులా కూలిపోయింది సుందరి. ◻

హింస : నక్కబూరి వెంకటేశ్వరరావు

వెళ్ళిపోతున్నాయన్ని అగ్గిపెట్టె ఇమ్మంటే, తీసిచ్చి ఆగకుండానే వెళ్ళిపోతున్నాడు మళ్ళీ అగ్గిపెట్టె అవసరం లేదన్నట్లు. అగ్గిపెట్టె తెరిస్తే ఒకే పుల్లుంది. ఈ మధ్యే సిగరెట్ అలవాటయింది. ఆ ఒక్క అగ్గిపుల్లతో వీస్తున్న గాలిలో వెలిగించే చాకచక్యం అలవడలేదింకా. అయినా ప్రయత్నం. సఫలమయింది. గర్వంగా చుట్టూ చూశాడు.

గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం అయింది. వెళ్ళిపోతోంది కదిలి బండి.

సీట్లో కూర్చున్నాడు. తన వరుసలో మూడు సీట్లలో భార్యాభర్త, మరో స్త్రీ కూర్చుని వున్నారు. ఆ స్త్రీ వాళ్ళ తాలూకు అవునోకాదో కొంతసేపు పోతేగాని తెలీదు. ఆమె ఒళ్ళో బూరబుగ్గల బాబు నిద్రపోతున్నాడు.

దిగాడండి వీడెవడో రంగంలోకి. లావుగా వున్నాడు. పొడుగ్గా వున్నాడు. అంతేనా? నల్లగాకూడా ఏడ్చాడు. ఆ మూడు లక్షణాలను ఒక్కచోట చూడలేడు. మనసులో అయిష్టత ఆ శాల్తీమీద తప్పక మిగులుతుంది. ఇప్పుడూ అట్లాగే జరిగింది. తెల్ల ప్యాంట్‌లోకి చారల చొక్కా (కంచరగాడిద చర్మంలాంటిది) దోపి, నాలుగంగుళాల వెడల్పు బెల్టుతో నడుము బిగించేశాడు. ఎదుటి సీటు ఖాళీగా వుందేమో అని అయిదు నిమిషాల కాలంలోనూ రెండున్నరోసారి అనుకుంటున్నప్పుడు దిగబడ్డాడు. వెళ్ళేవాడు సరిగ్గా వెళ్ళకుండా తన భుజాన్ని గుద్దుకుని మళ్ళీ వెళ్ళాడు. ఎవడ్రా వెధవ, అని కోపంగా పక్కకు చూసేసరికి ముందుసీటు దగ్గర నిలబడి పైనవున్న సూట్‌కేస్ తీసి ఏదో న్యూస్‌పేపరు తీస్తున్నాడు. పోన్లే, పేపరు కొనుక్కోవడం మరిచిపోయ్యాను, వీడిదగ్గర చదువుకోవచ్చు అనుకుంటుండగా, సూట్‌కేస్ మూసి రెండు కాగితాలు మాత్రం తీసి జాగ్రత్తగా తన సీటుమీద పరుస్తున్నాడు. పరవడం అయిన తర్వాత గాలికి అవి ఎగిరిపోకుండా చేతులతో నాలుగు మూలలు అదిమిపట్టి అతి కష్టంమీద కూర్చున్నాడు. ఆ తర్వాత కాలర్ మాసిపోతుందేమోనని మెడచుట్టూ వేసుకున్న చేతిరుమాలు తీసి మొహం తుడుచుకుని (చిత్రంగా: మొహపు మకిలి రుమాలుకి అంటి మాసిపోతుందేమోనన్నట్లు) మళ్ళీ కాలర్‌చుట్టూ వేసుకున్నాడు.

ఇడియట్! తెల్ల ప్యాంట్‌ని ప్రయాణంలో ఎవడేసుకోమన్నాడు. అంపశయ్యమీద కూరు న్నట్లు ఆ బాధ ఎవడు పడమన్నాడు. అస చేతిరుమాలు మెడచుట్టూ ఎవరన్నా వేసుకుం తనకు ఒళ్ళు మండుకొస్తుంది. వీడు ఆ చే రుమాలుకూడా మాయడం ఇష్టంలేనట్లు ప్రవ స్తుంటే చెప్పాలా ఇక.

ఎదుటి సీట్లో మూలగా ఓ బురఖా వేసుకున్న స్త్రీ కనిపిస్తోంది. ఆమెను చూస్తుంటే నీ కంఠం గుర్తుకొస్తున్నాడు. ఎప్పుడు వాడింటి కెళ్ళినా ముళ్ళమీద వున్నట్లు "అనీజీ"గా వుంటుందేవాడు. చాలా రోజులదాకా తెలీలేదు తనకు. తన ఈడొచ్చిన చెల్లెల్ని, ఈడెళ్ళి పోతున్న భార్యని మగాడెవడు చూసినా చిత్రవధ అనుభవిస్తాడని. వాడు మాత్రం తను తనభార్య పడకగదిలో వున్నప్పుడుకూడా లోపలకి దూరిన రోజులున్నాయ్.

బూరెబుగ్గల వాడు లేచాడు. వాడి కడుపులో ఆత్మారాముడుకూడా కళ్లు నులుముకుంటున్నట్లున్నాడు. పాలసీసా అందించింది ఆమె. కొద్దిగా తాగి "తూ" అన్నాడు. పాలపీక సహించలేదేమో. ఏడుపు. రైలురొద మరోవైపు. వాడి కళ్ళెంట నీలాలు రాలుతున్నాయి. బుగ్గలు తడుస్తున్నాయి.

బఠాణీలు అమ్మేవాడొచ్చాడు. ఎదుటిసీటు కంచరగాడిద పావలా బఠాణీలు కొన్నాడు. చేతిరుమాలలో పోసుకుని ఒక్కొక్క బఠాణీ శబ్దంచేసుకుంటూ తింటున్నాడు. ఒలిచిన పొట్టు గాలికొచ్చి ఒళ్ళో పడుతోంది. ఎట్టిగా, విసుగ్గా

రెండుమూడుసార్లు వాడివైపు చూశాడు. వాడు పట్టించుకోవడం లేదు. పశువు అర్థ నిమీలిత నేత్రాలతో నములుతున్నట్లు తింటున్నాడు దవడ ఆడిస్తూ. తినేప్పుడు చప్పుడుచేస్తే చెడ్డ చికాకు కలిగిస్తుంది.

మొత్తానికి ఆమె కుర్రవాడిచేత ఏడుపు మాన్పించింది. క్రింది కనురెప్ప అంచున నిలిచిన కన్నీటి బిందువు జారడంలేదు. వాడు నవ్వుతున్నాడు ఇంతలోకి వాన కురిసి అంతలోకి ఎండ వచ్చినట్లు.

ఎవడో బత్తాయి కాయలు అమ్మడానికి వచ్చాడు. ఎదుటిసీటు కంచరగాడిద చిటికవేసి వాడిని పిలిచాడు. కంపార్టుమెంటులో నలుగురి ముందూ తినడమనేది తనకు నచ్చని అంశాలలో ఒకటి. ఈ గాడిద తినుబండారాన్ని దేన్నీ వదల దలుచుకున్నట్లు లేదు. తొక్కవలచి ఒక్కొక్క తొన చప్పరిస్తున్నాడు శబ్దంచేస్తూ మరీ.

నెత్తిమీద మొట్టికాయ వేయాలనిపిస్తోంది (కానీ వెధవ తాట వలిచేస్తాడే).

"పాపా, దా!" బూరెబుగ్గల తల్లి కొడుకుని పిలుస్తున్నాడు వాడు. రానుపో అన్నట్లు వాడు తల అడ్డుగా తిప్పి, చేయి విసిరికొట్టాడు.

బాగా చెప్పేడు వెధవకి సమాధానం.

"పాపకాదండి, బాబు" ఆమె అని, కుర్రవాడిని క్రిందకి దించి విడివైపు నెట్టింది.



కొత్త దృక్పథంలో ప్రణాళికలు

ఆంధ్రప్రదేశ్ ఐదవ ప్రణాళిక (1974—79) లో పెట్టుబడి రు. 1,500 కోట్లు కాగా మధ్యంతర ప్రణాళికా పెట్టుబడి మొత్తం రు. 3,966 కోట్లు సూచిస్తుంది.

బలహీన వర్గాల సముద్ధరణ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. వీరికి ఉపాధి అవకాశాలు కల్పించడం కనీస అవసరాల కార్యక్రమాన్ని అమలు జరపడం వంటి ఎన్నో పథకాలు అమలు జరుపుతున్నారు.

ఈ కృషిలో భాగంగానే వివిధ విషయాలలో శిక్షణ నివ్వడంతోపాటు 15,000 మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి వీలుగా రు. 13 కోట్ల ఖర్చుతో పథకాలను రూపొందిస్తున్నారు.

డి.జి.స.పౌ.సం.శా. 50

"ఎందాకా వెడుతున్నారు" వీడు ఆమెని అడుగుతున్నాడు.

వీడు కుర్రాడిని పిలిచింది వాడిమీద ముద్దు కన్నా తల్లిమీద ముద్దుచేతనే అనిపించింది. వాడిమీద అసహ్యాన్ని ఎక్కువ చేసింది ఆ ఆలోచన. **The cup of scorn is full to the brim.** ఈ ప్రయాణంలో ఆనందం లేకుండా వీడు భలే తగిలాడే.

ఆమెతో మాట్లాడుతూనే సీట్లోంచి లేచి "టక్" సరిచేసుకుని, రేగిన జుత్తుని వేళ్ళతో అణచుకున్నాడు. జుత్తు చెదరకుండా, బట్ట నలగకుండా ఏ ఏర్ కండిషన్డ్ కంపార్ట్ మెంటులోనో ప్రయాణం చేయకూడదు.

ఒక అరగంట ప్రయాణం తర్వాత దిగవలసిన ఊరు వస్తుంది. ఈ పీడ వదులుతుంది.

అటుపక్క కిటికీలోంచి ఆమె ఎక్కడికో చూస్తోంది ఏదో ఆలోచిస్తూ. బహుశ, భర్త కూడా వుండి వుంటే ఈ ప్రయాణం బాగుండేదని(?) పుట్టింటి కెళుతోందా, పుట్టింటినించి వెళ్ళుతోందా? కాఫీరంగు చీర, అదేరంగు జాకెట్. జాకెట్ బిగుతుగా వుంది. నలభై దగ్గిర పడుతున్న ఈ వెధవ నఖశిఖ పర్యంతం తాగేస్తున్నాడు.

బూరెబుగ్గల పిల్లాడిని ఆమె దగ్గిరనించి లాక్కున్నట్లు తీసుకున్నాడు కంచరగాడిద. కొద్దిగా జరిగి తన సీటు ఖాళీలో వాడిని నిలబెట్టి, నంగినంగిగా వాడికేవో చెప్పి మాట్లాడించడానికి ప్రయత్నిస్తున్నాడు.

మనసులాంటి ఇరుకు రైలు పెట్టెలోంచి బయటికి చూస్తే నీలంగా ఆకాశం. అక్కడక్కడా దూదిపింజలు. కొంగలు ఎగిరిపోతున్నాయి. టెలిగ్రాఫ్ స్థంభాలు చెట్టాపట్టా లేసుకుని రైలుపెట్టెలోకి తొంగిచూసి వీడ్కోలు చెప్పేస్తున్నాయి. దూరంగా సోలిటరీ రీపర్ అగుపిస్తోంది. డాఫడిల్స్ విరగపూసి నవ్వుకుంటున్నాయి. కొద్ది క్షణాలు—అంతే; అందాన్ని చూసి ఆనందించే అర మూసుకుపోయింది.

ఇంతలో హృదయంలో పన్నీటిజల్లు కురిసినట్లు, ఆసందకరమైన సంఘటన జరిగింది.

బూరెబుగ్గల తల్లి 'అరరే' అంటూ లేచింది,



కంగారుగా. మిగతావాళ్ళు ఆమెవైపు ఉలిక్కిపడి చూశారు. తను కాళ్ళని వెనక్కి లాగుకున్నాడు. ఎదుటి సీటువాడి మొహం వాడిపోయింది. కుర్రాడు కేరింతలు కొడుతున్నాడు. కళ్ళలో అమాయకత—ప్రపంచంలో ఎవరూ నన్ను ద్వేషించరు, నేను ద్వేషించడానికి ఎవరూ లేరు అన్నట్లు.

తనకు ఎదుటి సీటువాడి అవస్థ చూస్తుంటే నవ్వు ఆగడంలేదు. ఆమె కుర్రాడ్ని వీడిదగ్గిర నుంచీ తీసుకుంది. బట్టలగురించి వాడు తీసుకున్న జాగ్రత్తలు గుర్తుకొచ్చి నవ్వు పొర్లి వస్తోంది. తను ఆశించినట్లు వాడికి సరైన శిక్ష పడింది. పిల్లవాడు పోసిన వుచ్చతో తడిసిపోయింది వాడి ప్యాంట్.

మరో పదినిమిషాల తర్వాత తను రైలుదిగపోతున్నపుడుగాని ఎదుర్కొనలేదు ఈ ప్రశ్న-

పిల్లవాడు కంచరగాడిద చౌకావాడికి సరైన శిక్ష వేశాడు అనుకున్నాడు గాని, ఈ మూడు గంటల కాలంలో సరైన కారణం లేకుండానే వాడిమీద ద్వేషం పెంచుకోవడం ద్వారా అనుభవించిన హింస దేనికి శిక్ష? □

ప్రగతికి కీలకం పరిశ్రమలు

ఉత్తర, దక్షిణాల మేలికలయిక ఆంధ్రప్రదేశ్‌కు ప్రకృతి ఎనలేని వనరులను ప్రసాదించింది. మిశ్రమ సంస్కృతికి చిహ్నంగా, ప్రాచీన వైభవానికి, ఆధునిక పారిశ్రామిక ప్రగతికీ ప్రతీకగా నిలిచిన రాజధానీ నగరాన్ని చరిత్ర మనకు సంక్రమింపజేసింది. నేడు తెలుగు గడ్డ నిజంగా సిరులు పొంగే జీవగడ్డ.

ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు ప్రగతి చక్రాన్ని తిప్పుతున్నాయి. రు. 478 కోట్ల భారీ పెట్టుబడితో, 260 భారీ, మధ్యతరహా పరిశ్రమలు నెల కొంటూ పారిశ్రామికంగా మన రాష్ట్రం రూపురేఖలనే మార్చివేస్తున్నాయి. యంత్రవాద్యాల సందడిలో కొత్త అందాన్ని దిద్దుకుంటున్న ఆంధ్రప్రదేశ్ గత ఐదేండ్ల కాలంలో మునుపటికన్నా నాల్గింతలెక్కువగా సంస్థాగత ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నది. 1978 జూలై 7 న కాకినాడ వద్ద రాష్ట్రపతి శంకుస్థాపన గావించిన రు. 232 కోట్లు ఖర్చుకాగల 'ఎరువుల కర్మాగారం' 1981 లో ఉత్పత్తిని ప్రారంభించబోతున్నది.

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సహాయక సంస్థ. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రాతిపదిక సౌకర్యాల కల్పనా సంస్థ, మున్నగు ప్రోత్సాహక సంస్థలు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి చక్కటి దోహదాన్ని కలిగిస్తున్నాయి.

ప్రగతి రంగంలో పరిశ్రమలు నిజంగా
కీలకపాత్ర వహిస్తున్నాయి.

డి. జి; స. పౌ. సం. శా. 47

"ఈరోజు శనివారం కాదుగదా?" అన్నాడు కృష్ణమూర్తి, అన్నం బదులుగా చపాతీలు వడ్డించిన భార్యవైపు చూసి.

"కాదనుకోండి. రాణీ వాళ్ళు గ్రైండర్ కొన్నారు. గోదుమపిండి నిముషంలో కలిపేసిం దనుకోండి...." మెచ్చుకోలుగా అంది శాంతి.

"ఓహో(— గ్రైండర్ మీద ఎక్స్పరిమెంట్ చేశావన్న మాట. బాగుంది."

"రెండేళ్ళలో ఎంత సామాను కొన్నదండీ రాణి. గాడ్రెజ్ బీరువా, ప్లాస్టిక్ వైరు కుర్చీల సెట్టూ, ప్రెషర్‌కుక్కరూ... కొన్నాళ్ళుపోతే ఫ్రిజ్‌గూడా కొంటారట."

కృష్ణమూర్తి మౌనంగా వింటూ కూర్చున్నాడు.

"ఏమండీ."

"వూ(...."

"విరల్‌రావు ఇంటికి ఎప్పుడైనా వెళ్ళారా మీరు?"

"వెళ్ళలేదు. ఏం?"

"వెళ్ళివుంటే తెలిసేది."

"ఏమిటో చెప్పరాదూ!"

"నిన్న వాళ్ళమ్మాయి బర్త్‌డే పార్టీకి వెళ్ళానా? ఎంత గ్రాండ్‌గా చేశారనుకున్నారు? వాళ్ళది గుమస్తా ఇంటిలా వుందా? సోఫాసెట్, గ్రైండర్, గాడ్రెజ్ ఫర్నిచర్, ఫ్రిజ్...."

"వింటున్నారా?"

"వూ(... వూ(.... చెప్పు."

"ఆయనా మీలాగే గుమస్తా గదా? ఆ డబ్బంతా ఎలా వస్తుందంటారు?"

కృష్ణమూర్తి భార్యవైపు జాలిగా చూశాడు.

"ఎలాగో వస్తుందిలే. మనకెందుకు?"

"ఏం? మనం మనుషులంకాదా? అందరిలా వుండాలని మనకి వుండదా?"

"ఎందుకుండాలి? మనకంటే బాగా బ్రతుకుతున్న వాళ్ళతో పోల్చుకుని బాధపడుతున్నావు గాని, మనకంటే హీనంగా జీవిస్తున్నవాళ్ళతో పోల్చుకుని తృప్తిపడరాదూ? మనం తల దాచుకోవడానికి ఇల్లుంది. రెండుపూటలా భోజనానికి గ్యారంటీ వుంది. అది లేనివాళ్ళని గురించి ఆలోచించవేం? మరొకరి జీవితాలతో పోల్చుకోనంతవరకూ ఫరవాలేదు శాంతీ! తృప్తిగానే బ్రతుకు సాగిస్తాం. మన జీవితాన్ని మరొకరితో పోల్చుకుంటూ వుంటే అసంతృప్తే మిగులుతుంది."

కృష్ణమూర్తి చెప్పే మాటలు చేదుగా వున్నాయి శాంతికి.

'ఏం మనిషో? వట్టి వేదాంతి' అనుకుంది.

"సరే ఇన్ని మాటలెందుకు. మిమ్మల్నొక మాట అడుగుతాను కాదనరుగదా?"

"ఏమిటో?"

"ఏం లేదు. రాణీలాగే నేనూ కుట్టుపని నేర్చుకుంటానండీ. కొన్నాళ్ళుపోతే ఒక మిషన్ కొనుక్కుని కొద్దో గొప్పో సంపాదించుకో వచ్చుగదా" అంది శాంతి.

"ఇప్పుడు ఏమంత అవసరం?"

"డబ్బు సంపాదించుకోవడానికి అవసరాలే రావాలా? ముందు ముందు ఏం అవసరాలు వస్తాయో?"

"అవసరాలుకాదులే. అర్జంటుగా ఫర్నిచరూ, గ్రైండరూ, సోఫా సెట్టూ కొనాలి.... అంతేనా. అయినా నా మాట వింటావుగనుకనా. డబ్బుమాట వింటావుగాని." అని నవ్వాడు కృష్ణమూర్తి.

"మీరు మాత్రం నా మాట ఎప్పుడు విన్నారు? మీరు పట్టిన కుందేటికి మూడుకాళ్ళే గదా?" అంది శాంతి నవ్వుతూ.

*　　　*　　　*

పిల్లలకి భోజనంపెట్టి స్కూలుకి పంపించి

భర్తకి వడ్డించింది శాంతి.

కృష్ణమూర్తి ఆఫీసుకి వెళ్ళాక కత్తెర, పాత బట్టలు తీసుకుని మరియమ్మ ఇంటికి వెళ్ళి టైలరింగ్ నేర్చుకోవడం నిత్యకృత్యమై పోయింది శాంతికి.

ఏదో పొందాలనుకుని పొందలేకపోయిన అసంతృప్తి ఆమెను బాధిస్తోంది. బహుశా చాలామందిని అటువంటి అసంతృప్తి వెంటాడుతూ వుంటుందేమో?

తలిదండ్రులయి గొప్ప సంబంధం తెచ్చి పెళ్ళి చేస్తారని ఆమె కలలుకని వుండవచ్చు. కాని కలలు కల్లలయ్యాయి.

కృష్ణమూర్తి భోజనం ముగించి ఆఫీసుకి బయల్దేరాడు.

తనకి వున్నదాన్ని నిర్లక్ష్యంచేస్తూ, తనకి లేనిదానికోసం ప్రాకులాడుతున్న శాంతిని గురించే ఆలోచిస్తూ నడుస్తున్నాడు.

మనసు గత స్మృతులతో పొంగింది.

పదేళ్ళ క్రితం—

అప్పుడు కృష్ణమూర్తి చిన్న ప్రాజెక్టుకి సంబంధించిన సబ్‌డివిజన్‌లో గుమస్తా.

శాంతి తండ్రి సుబ్బారావు, అసిస్టెంట్ ఇంజనీర్. సిన్సియర్ అని ఆయనకి గొప్ప పేరుండేది. నిప్పుకైనా చెదలు పట్టవచ్చునేమో గాని సుబ్బారావు నిజాయితీకి మాత్రం మచ్చ లేదు.

ఏ ఆఫీసులోనూ సంవత్సరానికి మించి సుబ్బారావుని పనిచెయ్యనీయలేదంటే అతిశయోక్తి కాదు.

అటు పై ఆఫీసర్లకి, ఇటు కంట్రాక్టర్లకే గాక, మేస్త్రీలకి గుమస్తాలకీగూడా కొరకరాని కొయ్యగా తయారయ్యాడు.

గడ్డివామి దగ్గిర కుక్కలాంటి సుబ్బారావు వల్ల దేశపురోభివృద్ధి కుంటుపడుతుందేమో ననే భయంవల్ల కాబోలు తరచు దేశ నాయకులు జోక్యం చేసుకుంటూ వుండేవారు. ప్లేగ్రౌండ్‌లో ఫుట్‌బాల్‌లా దేశమంతా తిరుగుతూ వుండేవాడు.

సుబ్బారావు గురించి ఎవరేమనుకున్నా కృష్ణమూర్తికి మాత్రం ఎంతో గౌరవం వుండేది.

కాకీ ప్యాంటులో తెల్లటి చొక్కా టక్‌చేసి, నెత్తిమీద టోపీ పెట్టుకుని నల్లటి బూటు వేసుకుని పందేనికి తయారై వచ్చిన గుఱ్ఱంలా హుషారుగా సైటులో కనిపించేవాడు.

సుబ్బారావు రూల్సు కొరడా ఝళిపించడం వల్ల ఆయన దగ్గర పనిచేసే సూపర్‌వైజర్లకి వచ్చే లాభం గంగలో కలిసిందిగాక కంట్రాక్టర్ జగన్నాథం నోట్లో దుమ్ము పడింది. 'అసలుకే మోసం వచ్చింది దేవుడోయ్' అని ఏడవ సాగాడు.

పైన సుబ్బారావులాంటి మరొక దిక్కుమాలిన ఆఫీసరొకాయన తగలబడ్డం వల్ల అతన్ని ట్రాన్సుఫర్ చేయించడంకూడా అసాధ్యమని తెలిసి అంతా కృంగిపోయారు.

ఎవరికీ ఉపయోగపడని యీ ఇంజనీర్ని తొందరగా పంపిస్తే నీ కొండకు వచ్చి కళ్యాణం చేయిస్తామని దేవుడికి మొరపెట్టుకున్న వాళ్ళు గూడా వున్నారు.

కంట్రాక్టర్ జగన్నాథానికే కొరుకుడుపడని ఘటం ఒకడు పుట్టాడని తెలిసి దేశం ఆశ్చర్యపోయింది.

జగన్నాథం రీవి, వేషధారణ చూస్తే ఈ మహానుభావుడు ఏ మంత్రిగారి వారసుడో అని ఎవరికైనా అనిపించక మానదు. కొందరు ఆ రాజకీయ రీవిని వుగ్గుపాలతోనే నేర్చుకుంటారు.

ఆయనంటే కూలివాడి మొదలు పెద్ద ఆఫీసరు వరకూ అందరూ భయభక్తులతోనే వుంటారు. 'ఏమో ఈ దుర్మార్గుడు ఎవరి మెడలో తాడు తెంచుతాడో!' అని.

అయితే భయంకరంగా వుండడు. ఎప్పుడూ చిరునవ్వు పెదవుల మీద అతికించుకునే వుంటాడు. నోట్లో పంచదార పోసుకున్నట్లు ఎంత తియ్యగా మాట్లాడుతాడో అంతరంగంలో అంతకు పదిరెట్లు విషం కక్కుతూ వుంటాడు.

"ఇదుగో ఇంజనీర్‌గారూ! గాడిద పని గాడిద, కుక్కపని కుక్కా చెయ్యాలండీ. మీ కెందుకీ కుక్కపని?" అని నయనా భయనా చెప్పి చూసినా సుబ్బారావు దారికొస్తేనా?

ఊహూఁ....

"ఇదుగో సారూ! నా ఒక్కడికోసమేనా ఇలా అడ్డమైన వాళ్ళ కాళ్ళూ పట్టుకుంటూ, నానా గడ్డీ కరిచి సంపాదించాలనుకుంటున్నది నేనేం మూట కట్టుకోవడం లేదు. నలుగురి కోసమే నా కష్టమంతా!" అనేవాడు తరచుగా.

ఆ మెట్ట వేదాంతం సుబ్బారావుకి అర్థమైతేనా?

జగన్నాథం చెప్పినా చెప్పకపోయినా ఆయన సిసలైన సోషలిస్టు. ఏ కాంట్రాక్టులో ఎవరెవరికి ఎంతెంత ముట్టజెప్పాలో, ఇరవై ఏళ్ళ అనుభవం వుంది. రెండు దశాబ్దాలుగా కాంట్రాక్టు కళలో ఆరితేరిన కళాకారుడు.

అవసరమైతే జుట్టు పట్టుకోడానికిగాని, చెప్పులు నాకడానికిగాని వెనుదియ్యడని తెలియని వాళ్ళెవ్వరు?

సుబ్బారావు వచ్చి చార్జి తీసుకున్న తర్వాత సంవత్సరం లోగానే ఏభై వేలు నష్టపోయిన జగన్నాథం బోనులో బంధించబడ్డ పెద్దపులిలా గాండ్రించసాగాడు.

పగబట్టిన త్రాచుపాములా సమయంకోసం ఎదురుచూస్తున్నాడు.

ఒకరోజు సుబ్బారావు, అతని భార్య షికారుగా వూరి బైటికి వెళ్ళి చీకటిపడిన తర్వాత ఇంటికి వస్తుంటే, లారీక్రింద పడి ప్రాణాలు పోగొట్టుకున్నారు.

ఈ ప్రపంచంలో అన్నిటికంటే చౌకయినది మనిషి ప్రాణం అనే సిద్ధాంతంలో నమ్మకమున్న జగన్నాథం 'ఈ పని ఎప్పుడో చేసి వుంటే ఏభై వేలు మిగిలి వుండేవి' అనుకుని వుంటాడు.

పెళ్ళీడుకొచ్చిన కూతురు, హైస్కూల్లో చదువుకుంటున్న కొడుకూ దిక్కులేని వాళ్ళయిపోయారు.

సుబ్బారావుకి వెనకా ముందూ ఆస్తిపాస్తులేవీ లేవని తెలిసి కృష్ణమూర్తికి ఆశ్చర్యం కలగలేదు.

అనాథలైపోయిన శాంతినీ, ఆమె తమ్ముడు రాముని చూసి చలించిపోయాడు కృష్ణమూర్తి.

* * *

ధర్మవరం పట్టుచీరలు ఒక్కొక్కటే ట్రంక్ పెట్టిలో నుంచి బైటపడేస్తున్నాడు.

మరియమ్మ వాటి నాణ్యం పరిశీలిస్తుంది.


జరీ పూలతో నేసిన రంగురంగుల పట్టుచీరలు చూస్తుంటే శాంతి కళ్ళు జిగేలుమంటున్నాయి.

రెండువందల చిల్లర ఖరీదువున్న నీలం రంగు పట్టుచీర తీసుకుంది మరియమ్మ.

"నువ్వూ ఒకటి తీసుకో శాంతీ" అంది.

"వద్దండీ."

"ఫరవాలేదు తీసుకో. ఇతను మనకు తెలిసినవాడే. నెలనెలా వస్తుంటాడు. నెలనెలా ఏభై ఇస్తుంటే సరి. నాలుగు నెలల్లో బాకీ తీరిపోతుంది" అని సర్దిచెప్పి శాంతితో పట్టుచీర



కొనిపించింది.

ఆమె చిరకాలంగా కట్టుకోవాలని కలలు కంటున్న గులాబీ రంగు పట్టుచీర తీసుకుంది.

కాని నెలనెలా ఏభై ఇవ్వాలంటే ఎంత కష్టమో? ఆయనకు వచ్చే జీతంలో ఎన్ని కోత లున్నాయో? ప్రావిడెంట్ ఫండ్, ఇన్సూరెన్స్, ఫెస్టివల్ అడ్వాన్సు వగైరా!....

పట్టుచీర తీసుకున్నానన్న సంతోషం ఎంతోసేపు నిలవలేదు, భర్త ఏమంటాడో? అని.

"నువ్వేం భయపడకు అమ్మాయీ! బాకీ తీర్చే మార్గం నేను చూపిస్తాగా." అంది మరియమ్మ.

"ఇంకో నెలలో నేను జాకెట్లు కుట్టగలనా?" ఆశగా అడిగింది శాంతి.

"అప్పుడేనా? ఒక సంవత్సరమైనా గట్టిగా నేర్చుకుంటే ఫరవాలేదు,"

'సంవత్సరం గడపాలా?' శాంతి నీరసపడి పోయింది.

"రాణి చాలా తొందరగా నేర్చుకుంది అనుకుంటాను" అంది.

మరియమ్మ నవ్వింది.

"అయితే రాణి టైలరింగ్ చేసి డబ్బు సంపాదిస్తుందని అనుకుంటున్నావా?"

"మరి."

"ఆవిడకి కొన్ని ఖాతాలున్నాయిలే. రహస్యంగానే అనుకో. నెలకో వెయ్యి అవలీలగా సంపాదిస్తుంది. కంట్రాక్టర్ సుబ్బరాజు, సినిమాహాలు మేనేజర్ ఒకాయనా. ..ఇంకా వున్నారులే...."

మరియమ్మ మాటలు వింటుంటే ముచ్చెమటలు పోశాయి శాంతికి. నిజమేనా? రాణీ అటువంటి మనిషా?

"ఆఁ....తప్పేముందిలే. కష్టపడి ఎంత కాలం సంపాదిస్తాం చెప్పు. జాకెట్టు కుడితే ముష్టి రూపాయి, లంగా కుడితే రెండు. ఎన్ని కుడితే ఒక వంద కూడతాయి చెప్పు? అదే కాసేపు కళ్ళు మూసుకుంటే వంద కాగితం చేతిలో పడుతుంది" మరియమ్మ మామూలుగా చెప్పుకుపోతోంది.

"రాణీ వాళ్ళాయనకి ఈ విషయం తెలియదా?" ఆశ్చర్యంతో అడిగింది,

"ఎలా తెలుస్తుంది?" అని ఎదురుప్రశ్న వేసి "అంతా రహస్యంగానే సాగుతుంది. అల్లరి చిల్లరగా తిరగటం కాదుగా. హైక్లాస్...." అంది మరియమ్మ.

శాంతి ఎంత వుత్సాహంతో టైలరింగ్ నేర్చుకోవాలని మొదలుపెట్టిందో ఇప్పుడదంతా జారిపోయింది. అయితే రాణీ సంపాదన రహస్యం ఇదన్నమాట.

"నీకు తెలియదు. చాలామంది అంతే. పైకి ప్రతివ్రతల్లా వుంటారు. లేకపోతే ఇళ్ళనిండా వుండే ఫర్నిచర్, ఫ్రిజ్‌లూ మొగుళ్ళు సంపాదిస్తున్నారా? వాళ్ళు తెచ్చేది తిండికే కనాకష్టం. ఇంక సరదాలెప్పుడు తీరతాయి" అంది మరియమ్మ.

శాంతి బెల్లంకొట్టిన రాయిలా వులుకూ పలుకూ లేకుండా కూర్చుండిపోయింది.

"అన్నట్లు ఇద్దరు పిల్లల తర్వాత నువ్వు ఆపరేషన్ చేయించుకున్నావనుకుంటాను."

"అవునండీ" అంది శాంతి తల వంచుకుని.

"అయితే ఇక పిల్లా పీచూ బాధేలేదు. అన్నట్లు ఆ ఎదురు మేడ ఎవరిదో తెలుసా?"

"లేదండీ."

"సుబ్బరాజుది. లక్షాధికారి."

"అలాగా!"

"ఆఁ... అతను నువ్వంటే మోజుపడుతున్నాడు." నెమ్మదిగా అంది మరియమ్మ.

శాంతి కలలో వింటున్నదానిలా వులిక్కిపడింది.

ఆమె గుండెలమీద నుంచి రోడ్‌రోలర్ పోతున్నట్లనిపించి వూపిరాడక వుక్కిరిబిక్కిరై పోయింది.

తడబడుతూ లేచి "వెళ్ళొస్తానండీ" అంది.


* * *

సుబ్బారావు పోయాక ఆ ఇంటితో వున్న ఆత్మీయత కారణంగా రోజూ వెళ్ళి పిల్లల్ని చూసి వస్తున్నాడు కృష్ణమూర్తి.

దినవారాలు పూర్తి కాగానే బంధువులు ఎవరిదారిన వాళ్ళు పోయారు.

'దిక్కులేనివాళ్ళకి దేవుడే దిక్కట.'

'బ్రతికున్నప్పుడు ఎవరికేం మేలు చేశాడు?'



'తను ఒక్కడే నిజాయితీ పరుడనని ఎంత గర్వం?'

'బంధుప్రీతి గూడా లేదు ఆ మనిషికి'

తలా ఒక మాట అనడంగూడా విన్నాడు కృష్ణమూర్తి.

నవ్వుతూ, తుళ్ళుతూ తిరిగే శాంతి గుర్తు పట్టకుండా అయిపోయింది.

గలగలా పారే సెలయేరు మంచుముద్దలా ఘనీభవించిపోయినట్లు ఆమె చలనం లేకుండా మంచంమీద పడివుండడం చూసి కృష్ణమూర్తి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

తల్లి చచ్చిపోయిన కుక్కపిల్లలా పిచ్చి పిచ్చిగా చూస్తున్న రాము కన్పించేసరికి అతని కడుపు తరుక్కుపోయింది.

అతని బలవంతంమీదే పిల్లలిద్దరూ కాస్త ఎంగిలి పడుతున్నారు.

రోజులు గడిచేకొద్దీ శాంతిమీద జాలి మాత్రమేకాక మరేదో భావం చివురిస్తున్నట్లు గ్రహించాడు.

ఏం? అయితే? అనుకున్నాడు.

'ఎంత త్యాగంచేసి అయినా సరే శాంతిని పెళ్ళి చేసుకోవాలి' అని నిర్ణయించుకున్నాడు.

ఆ రోజు అతనికి బాగా గుర్తుంది.

అప్పుడే చీకటిపడింది. ఇంకా భోజనమైనా చేయలేదు.

శాంతికి వెంటనే ఈ విషయం తెలియ జెయ్యాలి అనుకున్నాడు.

మధురనాదం ఏదో అతని వీనుల విందు చేస్తోంది.

తియ్యటి భావాలతో పరవశించి పోతూ శాంతికోసం బయల్దేరాడు.

రోజూ చూసే దృశ్యాలే ఎంతో కొత్తగా కన్పిస్తున్నాయి ఎందుకో.

మామిడిచెట్లు చిగిర్చి తలలు వూపుతూ వుంటే అతనికి ఎంతో అందంగా కనిపించింది.

పచ్చటి పొలాలమీదనుంచి వీస్తున్న పైరు గాలి అతనికి చల్లగా తగిలింది.

వెన్నెల మైకంలో మత్తుగా జోగుతున్నాయి సరివి తోటలు.

ఇంటి ముందు ఆగిపోయాడు కృష్ణమూర్తి. శాంతి ఏమంటుందో?

"ఎవరూ?"

"నేనే."

గేటు తెరిచింది.

"మీరా! రండి" అంది శాంతి.

"భోజనం చేశారా?" అన్నాడు పలకరింపుగా.

"లేదు అప్పుడేనా?" అంది.

"రాము ఏం చేస్తున్నాడు?"

"చదువుకుంటున్నాడు."

తర్వాత ఏం మాట్లాడాలో తోచలేదు అతనికి.

"నిల్చుండిపోయారేం? రండి లోపలకి."

యాంత్రికంగా అడుగులు వేశాడు లోపలకి.

ఎంత అందంగా వుంది శాంతి?

అప్పటివరకూ అంత అందాన్ని గుర్తించలేదు ఎందుకని?

అప్పుడు శాంతి తన పై అధికారి కూతురు.

ఇప్పుడు దిక్కులేని అనాథ.

వాస్తవమే అయినా కృష్ణమూర్తికి ఎందుకో చిరాకు కలిగింది.

"శాంతీ."

శాంతి కళ్ళెత్తి చూసింది. కృష్ణమూర్తి ఏదో చెప్పటానికి ప్రయత్నిస్తున్నాడని గ్రహించింది. ఆమె అంతర్యం అతని పిలుపుని గ్రహించింది.

"వూఁ...." అంది

"నేను యీ రోజు ఒక నిర్ణయం తీసుకున్నాను."

"ఏమిటి?"

"నీకు అభ్యంతరం లేకపోతే."

"నా అభ్యంతరమా? ...." ఆశ్చర్యంతో అంది శాంతి.

"మనం పెళ్ళి చేసుకుందాని."

అతను చెప్పే తీరుచూసి అంత బాధలో వున్నా ఆమెకు నవ్వు వచ్చింది.

'కృష్ణమూర్తి ఎంత మంచివాడు.'

శాంతి దగ్గరగా వచ్చింది.

అతని అరచేతిని తన చేతుల్లోకి తీసుకుని ముద్దుపెట్టింది. కృతజ్ఞతాభావంతో ఆమె హృదయం ద్రవించింది.

కృష్ణమూర్తికి, శాంతికి పెళ్ళయింది.

పదేళ్ళు దొర్లిపోయాయి.

రాము బుద్ధిగా చదువుకుని బ్యాంక్‌లో వుద్యోగం చేస్తున్నాడు. ప్రేమించి పెళ్ళి చేసుకొని హాయిగా వున్నాడు.

యాంత్రికంగా రోజులు గడిచిపోతున్నాయి.

కాని శాంతిలో రోజురోజుకీ ఏదో మార్పు వస్తోంది.

ఇరుగు పొరుగుల పరిసరాల ప్రభావం కావచ్చు.

అందరిలాగా సుఖపడాలనే ఒక చిత్రయం పెరిగిపోతోంది ఆమెలో.

మనిషికి తిండి, బట్ట మాత్రమేగాక తృప్తి గూడా కావాలి.

కాని తృప్తికి అంతెక్కడ?

కృష్ణమూర్తికి ఆఫీసుపని చెయ్య బుద్ధి కావడంలేదు.

తల భారంగా వున్నట్లనిపించింది.

పెన్ను మూసేసి క్యాంటీన్‌లోకి వెళ్ళి కూర్చున్నాడు.

కంట్రాక్టర్ లోకనాథం తన భారీ శరీరాన్ని అతిప్రయాసతో మోసుకుంటూ వచ్చి ఎదురుగా కూర్చున్నాడు.

"నమస్తే కృష్ణమూర్తిగారూ."

"నమస్తే."

లోకనాథం స్వీట్స్ తెప్పించాడు.

తర్వాత వేడివేడి కాఫీలు వచ్చాయి.

అధికారులు ఎవరెంత సంపాదించిందీ, ఎక్కడెక్కడ యిళ్ళు కట్టిస్తున్నదీ, పొలాలు తోటలూ కొంటున్నదీ, వివరాలు చెప్పసాగాడు లోకనాథం.

కృష్ణమూర్తి పరధ్యానంగా వినసాగాడు.

అతని జీవితంలో ఎన్నడూ లేని సంఘర్షణ మొదలైంది. నీతికీ, అవినీతికీ, అబద్ధానికీ నిజానికీ మధ్య అతని మనసు నలిగిపోయింది.

"మీ పక్కసీట్లో గుమాస్తా విఠల్‌రావు బామ్మర్దిని డాక్టర్ని చేస్తున్నాడు తెలుసా?" అన్నాడు లోకనాథం.

"వూఁ...." కొట్టాడు కృష్ణమూర్తి.

"మీరొక్కరే ఎందుకు మడికట్టుకోవాలో నాకు అర్థం కావడం లేదు" అన్నాడు లోకనాథం.



"నాకు మాత్రం ఏం పట్టిందీ? నావల్ల ఏం మేలు జరుగుతుంది దేశానికి?" కసిగా అన్నాడు కృష్ణమూర్తి.

అతని మాటలు కొత్తగా వినిపించాయి లోకనాథానికి.

"మీరేం చెయ్యలేరనేది మీకు తెలుసు గదా? మీ వాటా మీరు తీసుకుంటే సరిపోయె. పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారు మరి. కుర్రవాళ్ళప్పుడు ఏవో ఆదర్శాలుంటాయనుకోండి. మీరింకా కుర్రాళ్ళేనా?" పెళ్ళున నవ్వాడు లోకనాథం.

"నా మొఖం ఆదర్శాలు. మా మామగారు మీకు తెలుసు గదా?"

"తెలియకేం. సుబ్బారావుగారి పేరు చెప్తే కంట్రాక్టర్లు మంచినీళ్ళు తాగరు."

"ఏం లాభం. అర్ధాంతరంగా హత్య చేయించారా? పిల్లలు దిక్కులేని పక్షులై పోయారా?"

"అవును. అందరికీ తెలిసిందే." విచారిస్తూ అన్నాడు లోకనాథం.

"నేను ఇన్నాళ్ళూ గుడ్డివాడిలా ప్రవర్తించాను."

"అదేకదా నేను మొత్తుకునేది. అన్నట్లు నా బిల్లు మూడునెలల నుంచీ మీ సీట్లో...."

"ఈ రోజు పాస్‌చేస్తాలెండి."

"థాంక్స్."

పచ్చనోటు కృష్ణమూర్తి జేబులోకి వెళ్ళింది.

"ఇప్పుడెందుకు?...."

"ఉంచండి...." నవ్వుతూ వెళ్ళిపోయాడు లోకనాథం.

ఎదురీతకు గూడా హద్దువుంటుంది. అవినీతి ఉప్పెన కెరటాల తాకిడికి అతను ఓడిపోయాడు. ఇప్పుడిక ఎదురీదే శక్తి అతనికి లేదు.

* * *

తన ఇంట్లో అడుగు పెట్టబోయే ఇనుప బీరువా, గ్రైండర్, సోఫాసెట్టు, ప్రెషర్ కుక్కర్ వగైరా తల్చుకొని శాంతి హృదయం గంతులేస్తోంది.

'పట్టుచీరలు, రవ్వల నెక్లిస్'.. చంపుకున్న కోర్కెలు వూపిరిపోసుకుంటున్నాయి.

తన యింటినిండా నిండబోయే సామాను తలుచుకుంటే ఆనందం కలుగుతున్నా మరో వైపు అస్పష్టమైన భయం ఏదో మనసుని వణికిస్తున్నది.

చీకట్లో నెమ్మదిగా నడుస్తున్న శాంతి ధైర్యం తెచ్చుకుంది. సంఘంలో తనకు కలుగబోయే మిధ్యాగౌరవం మత్తులో పడిపోయింది.

మరియమ్మ అన్నట్లుగా తనవంటి అందగత్తె

ఏ ఆఫీసర్‌కో భార్య అవవలసింది కాని దుర దృష్టవశాత్తు ఈ దిక్కుమాలిన గుమస్తా పాలిట బడింది. భగవంతుడా ఏ జన్మలో ఏం పాపం చేశానో ఈ జన్మలో యింతటి కఠినశిక్ష విధించావు అనుకుంది శాంతి.

కనిపించని విషసర్పం ఆమెని కాటేసింది.

పిచ్చిపిచ్చి ఆలోచనలు జలగలై ఆమె నెత్తురు పీల్చివేస్తున్నాయి.

అశాంతి ఆరని జ్వాలలా ఆమెను దహించి వేస్తున్నది.

భర్తమీద ప్రేమ, విశ్వాసమూ నీతి నిజాయితీలు ఆ జ్వాలలోపడి దహించుకుపోతున్నాయి.

అమావాస్య చీకటి.

ఎదురుగా ఎవరు వస్తున్నారో గూడా తెలియడంలేదు.

అయినా ఆమె ముఖం కన్పిస్తుందేమోనని భయంతో ముసుగు కప్పుకుంది.

నక్షత్రాలు తనను గమనిస్తున్న లోకుల కళ్ళలా అనిపించి భయంతో వణికింది ఆమె.

తడబడుతున్న అడుగులతో మరియమ్మ ఇల్లు చేరుకుంది శాంతి.

ఇంటిముందు లైటు వెలుగుతోంది.

కుండీలో గులాబీమొక్కకు నిన్న విచ్చిన పువ్వు మంచులో తడిసి ఒక్కొక్క రెక్క రాలుస్తూ 'జీవితం యింత స్వల్పమా' అనుకుంటూ కళ్ళు మూస్తోంది.

శాంతి తలుపు కొట్టగానే ఆమె కోసమే ఎదురుచూస్తున్న దానిలా తలుపు తీసింది మరియమ్మ.

"ఇంతాలిస్యం చేశావేం?" అంది.

శాంతి మాట్లాడలేదు. నవ్వలేక నవ్వింది. ఆ నవ్వులో ప్రాణంలేదు. చచ్చిపోయిన మనిషి

వెన్న అమ్మబడదు

" 'ఫలానా' బట్టర్ బిల్డ్స్ బెటర్ బాడీస్" ప్రకటన.

"బాబూ నాకు 'ఫలానా' బట్టరివ్వరా, బిక్కసచ్చిపోయున్నాను. బెటరు బాడీ కావాల్నాకు."

"ఊరకనే ఇవ్వరయ్యా."

"ఏం చెయ్యాలి మరి?"

"కొనుక్కోవాలి."

"ఏమెట్టి కొనడం, డబ్బుమల్లేవు నాకాడ."

"సంపాదించు."

"ఎక్కడ? ఎలాగ?"

"నీకు 'ఫలానా' బట్టరే కావాలా?"

"కావాలి బాబు. నీ పున్నెముంటాది,"

"అయితే కన్నం వేసయినా సంపాదించు."

"ఏటి?"

"డబ్బు."

"ఎందుకు?"

" 'ఫలానా' అక్కరలేదా?"

"కావాలి."

"అందుకే డబ్బు!"

"మరయితే డబ్బెట్టి కొనాలని రాయవా? డబ్బా కరీదు రాయవా?"

"ఆఁ.........!"

—నిష్టల వెంకటరావు

నవ్వినట్లు కృత్రిమంగా వుంది.

సుబ్బరాజు ఎర్రబడిన కళ్ళతో మత్తుగా చూస్తున్నాడు.

మరియమ్మ విజయగర్వంతో అతని వైపొక సారి చూసి నవ్వి వెళ్ళిపోయింది.

శాంతికి అతన్ని చూస్తుంటే మనిషిలా కని పించడం లేదు. తనని కబళించడానికి వచ్చిన భక్షకిలా సంఘంలో స్వైర విహారం చేస్తున్న స్వార్థానికి ప్రతిబింబంలా....

ఆమె తల తిరిగిపోతోంది ఆమె మనసు లాగే వాతావరణం గూడా వేడెక్కిపోయినట్లని పించింది. చెమటతో ఆమె శరీరం తడిసి పోయింది.

సుబ్బరాజు నెమ్మదిగా కదిలి వస్తున్నాడు.

పారిపోదామా అనుకుంది.

కాని—

ఆమె కాళ్ళు గజగజ వణికాయి.

భయంతో శరీరం కంపించిపోయింది.

పాదాలు నేలకు అంటుకుపోయినట్లు ఆమె కదలలేకపోయింది.

కొండమీద నుంచి దూకే జలపాతంలాగా అతను ఆమెమీద పడి కౌగలించుకున్నాడు.

ఎందుకో తొలిరేయి జ్ఞాపకం వచ్చింది.

గదిలో గుబాళిస్తున్న పరిమళం, అగరొత్తుల సువాసన, సిగ్గుతో పరవశించిపోతున్న మనసు. కాని ఇప్పుడూ—

బంగారం వాసన ముక్కుకి తాకుతోంది,

నోట్లకట్లని కౌగలించుకున్నట్లు అనుభూతి.

*   *   *

వంటగది నిండా స్టెయిన్‌లెస్ స్టీల్ సామాను, వంట చేసుకోడానికి గ్యాస్‌స్టవ్ ప్రెషర్ కుక్కరూ, వేడినీళ్ళకు రాగిబాయిలర్, పప్పు రుబ్బుకోడానికి గ్రైండర్, బెడ్‌రూంలో ఫోంబెడ్, దానిచుట్టూ నైలాన్ దోమతెర, పైన గిరగిరా తిరుగుతూ సీలింగ్‌ఫ్యాన్, డెకోలామ్ టేబుల్‌మీద ఐదుబ్యాండుల రేడియోసెట్, ఒక మూలుగా మినీఫ్రిజ్, ఇక హాల్లోకి వస్తే సోఫాసెట్, గాడ్రెజ్‌బీరువా, మాష్టర్ వాల్‌క్లాక్ వగైరా....

ఆ ఇల్లు శాంతి వాళ్ళదా? కాదా? అని ఎవరూ సనిదేహించనవసరం లేదు.

అది కృష్ణమూర్తి ఇల్లే.

ఇవన్నీగాక కృష్ణమూర్తి ఖాతాలో బ్యాంక్ బ్యాలన్సు ఎంతవుందో ఎవరికి తెలుసు?

'మా అబ్బాయిని ఇంజనీర్ చెయ్యాలనీ, మా అమ్మాయిని డాక్టరు చెయ్యాలనీ' మాటల సందర్భంగా శాంతి అంటూవుంటుంది.

కాని శాంతి హృదయంలో మాత్రం రోజు రోజుకీ అశాంతి పేరుకుపోతోంది. ఇరుగు పొరుగు వాళ్ళు గుచ్చి, గుచ్చి చూసేచూపులు ఆమె గుండెల్ని ఈటెలై పొడుస్తున్నాయి.

దొంగతనం చేసి తిప్పించుకుని తిరుగుతున్న దానిలా బాధపడసాగింది. సూటిగా ఎవరి మొఖంలోకీ చూడలేకపోతోంది.

పుట్టిన దాదిగా గుండెల్లో దాచుకున్న పవిత్రతనంతా ఒక్కసారిగా కోల్పోయిన ఆ భయంకరక్షణం మాటిమాటికీ గుర్తుకొచ్చి మనసు వికలమైపోసాగింది.

మరియమ్మ ఆమె అంతర్యంలో ఏదో మత్తు నింపింది. ఆమె వున్మత్తురాలై పోయింది. కాని అప్పుడప్పుడూ ఆ మత్తు విడిపోతూ వుంటుంది.

అప్పుడామె భయంతో వొణిపోతుంది. అణుచుకోలేని ఆవేదనతో కంపించిపోయి వెక్కి వెక్కి ఏడుస్తుంది. ఏడ్పులోనే ఆమెకు మనశ్శాంతి లభించేది.

కొద్దిరోజుల్లోనే అమె కళ్ళు గుంటలు పడ్డాయి. ఆమె చూపులు స్థిరంగా నిలవడం లేదు. కళ్ళెత్తి ఎవర్నీ చూడలేకపోతోంది. ఆమె గుండెల నిండా భయం....గూడు కట్టు కుంది. ముఖంలో కళాకాంతులు మాయమై పోతున్నాయి.

కృష్ణమూర్తి గూడా చాలా మారిపోయాడు.

వ్యసనాలు నేర్చుకున్నాడు. ఏ అర్థరాత్రికో ఇంటికి చేరుకోడం అలవాటైపోయింది.

ఆ రోజు.

రాత్రి ఎనిమిది దాటింది.

కృష్ణమూర్తి ఇంటికి రాలేదు,

పిల్లలు అన్నం తిని పడుకున్నారు.

కృష్ణమూర్తి తల్లి వంటింట్లో సామాను

సర్దుతోంది.

శాంతి హాల్లో కూర్చుని ఏదో సినిమాపత్రిక పేజీలు తిరగేస్తూ వుంది.

"అక్కా!...."

తలెత్తి చూసింది శాంతి.

వాడు మరియమ్మ కొడుకు.

"ఏం?"

"అమ్మ రమ్మంటోంది.అర్జెంట్"అన్నాడు.

శాంతి త్వరత్వరగా డ్రెస్ చేసుకుని "అత్తయ్యా!... మరియమ్మ ఇంటికి వెళ్తున్నా! అర్జెంటుగాఎవరివో బట్టలుకుట్టాలట...."అంది.

"ఇంత రాత్రి ఎందుకే అమ్మాయీ! అబ్బాయి వస్తాడో ఏమో?....అయినా మన మిషన్ మన యింట్లో పెట్టుకుంటే యిక్కడ కుట్టుకోవచ్చుగా!" అంటూ గొణుక్కుంది అత్తగారు.

"ఆఁ.... ఇక్కడికి ఎవరువస్తారు? ఏం లాభం. సర్లే ఆయన వస్తే భోజనం వడ్డిం చెయ్యి! ఇప్పుడే వస్తా!"

శాంతి బయల్దేరింది.

చీకట్లో నెమ్మదిగా నడుస్తున్న శాంతి జీవితం గూడా చీకటైపోతున్నట్లనిపించింది. కనుచూపు మేరలో కాంతిరేఖలు కనిపించడం లేదు. ఈ శూన్యంలోనుంచి బైటపడే మార్గం లేదా?

ఆమె ఆలోచిస్తోంది.

ఆయనకి ట్రాన్స్ఫర్ వస్తే బాగుండును.

ఈ చీకటి జీవితానికి గుడ్‌బై చెప్పెయ్య వచ్చు.

"రా....శాంతీ" అంటూ ఆహ్వానించింది మరియమ్మ.

తర్వాత ఇద్దరూ కలిసి రిక్షా ఎక్కారు.

"ఎక్కడికి?" అంది శాంతి భయంగా.

"చెప్తాగా!...." అంది మరియమ్మ.

మూడంతస్థుల హోటల్ ముందు ఆగింది రిక్షా.

"హోటల్లోకా? వద్దు మరియమ్మా!....నాకు భయంగా వుంది. ప్లీజ్...."

"భయమా? ఎందుకూ?...." అని నవ్వి "మన ఇంటిలాగే వుంటుంది" అని సర్ది చెప్పింది.

"పద ఎంతసేపు రోడ్డుమీద నిల్చుందాం? అందరికళ్ళూ మనమీదే వుంటాయి" మరియమ్మ కోప్పడింది.

శాంతి అశక్తురాలై పోయింది.

కీలుబొమ్మలా నడిచింది.

* * *

తలుపు తెరవగానే కనిపించిన పోలీసుల్ని చూసి గుండెల్లో ఎవరో కత్తితో పొడిచినట్లు కెవ్వుమంది శాంతి.

హోటల్ని పోలీసులు రైడ్ చేశారని అర్థమై ఆమె కళ్ళు బైర్లుక్రమ్మాయి. తనకి కనిపించని అదృశ్యశక్తి ఏదో తనని అంధకార వలయం లోకి తోసివేసినట్లు నేలమీదకు ఒరిగిపోయింది.

కాటు వెయ్యడానికి తోకమీద లేచి నిల్చున్న త్రాచుపాముల్లా కనిపించారు పోలీసులు.

ఆమె తలమీద ఎవరో పెద్ద దెబ్బకొట్టినట్లు అదిరిపోయింది.

కొంతసేపు ఆమె మనసు మొద్దుబారిపోయి ఆలోచనలు ఆగిపోయాయి.

తర్వాత తనని పోలీసులు అరెస్ట్ చేశారని జ్ఞాపకం వచ్చి బాధతో మెలికలు తిరిగి పోయింది. వూపిరి ఆగిపోతున్న దానిలా వుక్కిరి బిక్కిరై పోయింది.

అవమానంతోను దుఃఖంతోనూ ఆమె ముఖాన్ని చేతులమధ్య దాచుకుని వెక్కి, వెక్కి ఏడ్చింది శాంతి.

* * *

పోలీస్ స్టేషన్‌లో—


తనని బెయిల్‌మీద వదిలిపెట్టేవాళ్ళకోసం ఎదురుచూస్తున్నాడు కృష్ణమూర్తి.

అతన్ని కొన్ని గంటలముందే అవినీతి నిరోధక శాఖవారు లంచం తీసుకున్న నేరానికి అరెస్ట్ చేశారు.

పోలీస్‌స్టేషన్ ఆవరణలోకి ప్రవేశిస్తున్న తన భార్యని చూశాడు కృష్ణమూర్తి. ఆమె ప్రక్కనే ఎవరో సిల్కులాల్చీ పెద్దమనిషి గూడా వున్నాడు.

'తనకి బెయిల్ ఇప్పించి విడుదల చేయించ డానికి ఎవరో పెద్దమనిషిని వెంటబెట్టుకుని వస్తున్నది శాంతి' అనుకుంటూ ఆనందపడ సాగాడు కృష్ణమూర్తి. □

సీరియల్



అరుణ ఏదో పుస్తకం చదువుకొంటోంది.

శేఖరం కుర్చీలో కూర్చుంటూ అడిగాడు "అప్పుడు నేను అడిగిన సంగతి ఏమాలోచించావు అరుణా!"

"ఏ సంగతి?" అంది అరుణ అర్థంకానట్లు.

"మూర్తి సంగతి."

అరుణ మాట్లాడలేదు.

"ఏమిటి, మాట్లాడవే? రేపు నేను బొంబాయి వెళ్తున్నాను. వారం పదిరోజుల వరకూ రాను. నీకు నచ్చితే నచ్చాడని చెప్పు—లేకపోతే లేదు. చెప్పాగా దీంట్లో బలవంతం లేదని."

"....ఏమో! నాకేం తెలియదు."

"అదేమిటి! నీకు తెలియదంటే ఎలాగ...."

"నువు వూరునుండి వచ్చేకా" ఎలాగో అంది.

"ఏం? నీ ఫ్రెండుతో ఆలోచించాలా?"

చివ్వున తలెత్తింది అరుణ.

అతని స్వరంలో కొద్ది తీవ్రత ధ్వనించినా అతని కళ్ళు-ముఖం మామూలుగానే వున్నాయి.

"అవునా!" అన్నాడతను మళ్ళీ. అరుణ మాట్లాడలేదు.

"అమ్మకి ఏం రాయమంటావ్."

"నీ ఇష్టం" అంది అరుణ పుస్తకంలోకి చూస్తూ.

శేఖరం తన గదిలోకి వెళ్ళిపోయాడు.

శేఖరం గోపాలరావుగారికి ఆయన పనులు చూసిపెట్టమని అడిగితే సరేనన్నాడు. గోపాలరావుగారికి శేఖరం తండ్రి తెలుసుట. ఒకసారి ఎవరితోనో రాజేంద్ర వాళ్ళింటికి వెళ్ళేడు. అప్పుడు తెలిసింది. అప్పుడు శేఖరం గురించి రాజేంద్ర ఆయనకి చెప్పేడు.

ఆయన శేఖరాన్ని ఓ సారి తని దగ్గరకి పంపమని చెప్పడం రాజేంద్ర శేఖరాన్ని వెళ్ళి కనపడమని చెప్పటం—శేఖరం వెళ్ళిరావటం జరిగింది. గోపాలరావుకి ఆయన బావగారికి జాయింటుగా ఎరువుల ఫ్యాక్టరీ వుండటమే కాక ఆయనకింకా కొన్ని కంపెనీల్లో షేర్లున్నాయి.


గోపాలరావుగారికి ఇద్దరు ఆడపిల్లలు. పెద్దమ్మాయికి పెళ్ళయి అత్తవారింటికి వెళ్ళిపోయింది. చిన్నమ్మాయి డాక్టరు చదువుతోంది.

ఈ మధ్య ఆయనకి ఒంట్లో బాగుండటంలేదు. శేఖరం ఆయన రమ్మన్నప్పుడు వెడుతూ వచ్చేడు. ఆయనకి శేఖరంమీద అభిమానం ఏర్పడింది. వ్యాపార రీతిలోకూడా శేఖరం ఆయనకి బాగా నచ్చేడు.

గోపాలరావుగారికి అవతలాయన సొంత బావగారు కాదు. పెద మామగారి కొడుకు. గోపాలరావుగారు "అమ్మాయి ఇష్టం" అన్నారు. ఆ అమ్మాయి ఏమో చేసుకోనంది. అప్పటినించి ఆ బావగారి పద్ధతి మారిపోయింది. ఫలితంగా చిన్న చిన్న గొడవలు ప్రారంభమయినాయి. పెద్ద అల్లుడేమో పారిన్‌లో వున్నాడు. ఇంక పెద్దగా అటూ ఇటూ తిరిగి ఏం చేయగలడు? ఈ వ్యాపారం చూసుకొంటూ తనకి చేరువుగా వుండే కుర్రాడికి చిన్నమ్మాయికి చేస్తే అన్ని విధాలా మంచిదని గోపాలరావుగారి అభిప్రాయం.

కొద్ది రోజుల్లోనే ఆయన వ్యాపారరీత్యా గడించిన అనుభవం - శేఖరాన్ని పూర్తిగా అర్థం చేసుకొనేలా చేసిందని చెప్పచ్చు.

దానికి సాయంం మొదటినించీకూడా శేఖరం ఆయనా కలిసినప్పుడు ఇద్దరిమధ్యా వ్యాపార విషయాలే జరిగేవి. శేఖరం వ్యాపార విషయంలో కనపరచే కుతూహలం—అది మాటలవరకే



కాదని—అతనికి వచ్చినది, చేయాలనుకొన్నది సాధించి తీరుతాడని ఆయనకి గట్టి నమ్మకం కలిగింది.

ఒక్కసారిగా అతన్ని ముక్కుకు సూటిగా అడగకుండానూ—అయినా తను స్వయంగా అతని పని నేర్పు చూస్తే నిశ్చింతగా వుంటుందని ఆయన భావించేరు. అందుకనే అతనికీ మధ్య ఒంట్లో బాగుండటం లేదని కాస్త వస్తూపోతూ వుండమని చెప్పి చిన్న చిన్నవే అయినా బాధ్యత వహించి చేయవలసిన కొన్ని పనులు ఆయన శేఖరానికి అప్పగించేరు.

శేఖరం ఏమీ శ్రమనుకోకుండా ఆయన చెప్పిన పనులు చేశాడు. ఆయన చాలా సంతోషించేరు.

ఇప్పుడు ఆయన కంపెనీ మీటింగుకి బొంబాయి వెళ్ళాల్సి వచ్చింది. కూడా శేఖరాన్ని రమ్మని కోరారు. ఈ మధ్య ఆయనకి ఒంట్లో నీరసంగా వుంటోంది. మొదట శేఖరం కాస్త తటపటాయించినా తర్వాత సరేనన్నాడు.

*　　*　　*　　*

అరుణా, మీరా సన్నజాజి పందిరి దగ్గర కుర్చీలు వేసుకుని కబుర్లు చెప్పుకొంటూ కూర్చున్నారు. సుందరి వచ్చి కాస్సేపు కూర్చుంది కాని, కుసుమ తను ఎక్కడికో వెళ్తూ సుందరినికూడా తీసుకెళ్ళి పోయింది.

"వాళ్ళొచ్చేవరకూ నువ్వొక్కదానివీ వుండవలసిందే!" అని అడిగింది మీరా.

"ఏం? భయమేమిటి! తాయారమ్మ వుంటుందిగా!" అంది అరుణ.

"భయం మాట అటుంచు. ఒక్కదానికి ఏం తోస్తుంది బాబూ!"

"బంగారంలా తోస్తుంది. మేడమీద—కిటికీ దగ్గర కుర్చీ వేసుక్కూర్చుంటే....ఆ చల్లటి గాలి ఎన్ని కథల్ని మోసుకొచ్చి వినిపించి వెళ్తుందో తెలుసా!" అంది అరుణ సన్నజాజి మొగ్గతో బుగ్గమీద రాసుకొంటూ.

"ఒహో! అమ్మాయిగారు గాలి మోసుకొచ్చే కథల్తో కాలక్షేపం చేస్తారన్నమాట!—ఊఁ! ఆ గాలి ఎలాంటి కథల్ని మోసుకొస్తుంది? రాజకుమారుడి కథలా!"

"ఛ, పో! నీకెప్పుడూ ఇలాంటి ఆలోచనలే?" కసురుకొన్నట్టుగా అంది అరుణ.

"బాగుంది....నువ్వేగా చెప్పావ్!"

"అంత కాలక్షేపం అవుతుందన్నాను కానీ, రాజ...."

మూర్తి గేటు తీసుకొని లోపలకి రావటంతో అరుణ చటుక్కున లేచి నిలబడింది. గుండెలు విపరీతంగా కొట్టుకోసాగాయి.

హఠాత్తుగా అరుణ మాట్లాడటం మానేసి లేవటంతో మీరా కూడా లేచి ఇటు తిరిగింది.

మూర్తికి చాలా నిరుత్సాహం కలిగింది. ఆశాభంగం పొందినవాడిలా అలాగే నిలబడి పోయాడు.

అదివరకటి మల్లే అరుణ అతను రాగానే "అన్నయ్య లేడండీ" అని చెప్పలేకపోయింది. అసలు అతను మాట్లాడినా తనగొంతు పెగులుతుందా అన్న అనుమానం వచ్చింది అరుణకి.

'ఏమిటి? ఇద్దరి కిద్దరూ మూగవాళ్ళలా నిలబడిపోయారు? తను అక్కడ వుండాలా వెళ్ళాలా' అని మీమాంసపడుతోంది మీరా.

"శేఖరం లేడా?" లాంఛనంగా అడిగినట్లు అడిగాడు మూర్తి.

శేఖరం బొంబాయి వెళ్ళినట్లు అతనికి తెలుసు—తెలిసే వచ్చేడు.

"లేడండీ! బొంబాయి వెళ్ళాడు. వారంవరకూ రాడు" ఎలాగో చెప్పేసింది.

వారంవరకూ రాడని చెప్పడం మూర్తికి ఇంకా నీరసం తెప్పించింది. అరుణ అలా చెప్పక పోతే తను మళ్ళీ ఓ నాలుగు రోజులు పోయాక రావచ్చును.

మూర్తి వెళ్ళిపోయాడు.

అరుణ ఇంకా నిలబడి వుండడం చూసి, "ఆయన వెళ్ళిపోయాడు కూర్చో! నా కాళ్ళు గుంజుతున్నాయి" అరుణని కుర్చీలో కూలేస్తూ అంది.

"ఛ! అంత తెలియదా!" అంది అరుణ. అరుణకి ఏమిటో ఇంకా దడగానే వుంది.

"ఏమో ఎంత తెలియదో! అద్దంలో మొహం చూసుకో తెలుస్తుంది" అంది మీరా.

ఈసారి అరుణ ముఖం ఇంకా ఎర్రగా అయింది. కోపం నటించబోయి సాధ్యంకాక నవ్వేస్తూ "అబ్బ, ఏమిటి మీరా! ఒక్క మాటకి పది అర్థాలు తీస్తావు."


"ఏమో బాబు! పది అర్థాలు ఒక్క మాటలో కూర్చటం నాకు చేతకాదు."

"సర్లే! నీతో వాదన ఎవరు వేయగలరు. ఎదేనా మంచి కబుర్లు చెప్పు."

"నే నెప్పుడూ మంచివే చెప్తాను. కానీ నువ్వు వినేటప్పుడు నీ మనసు ఎలా వయనిస్తుందో! దానికి తగ్గట్టు మార్చి నేను చెప్పలేను."

"వద్దులే తల్లీ! మాట్లాడకుండా కూర్చో" మీరా ఏదో గ్రహించేసినట్లుగా అలా మాట్లాడు తుంటే అరుణకి ఏమిటోలా వుంది. అసలు మీరాకి చెప్పాలనే అరుణ అభిప్రాయం కాని ఎలా చెప్పాలో తెలియలేదు. అందుకే గప్‌చిప్‌గా వూరుకొంది.

"చిత్తం! మాట్లాడను" మీరా మూతి బిగించుకొని, చూపుడువేలు నోటిమీదుంచుకుని బుద్ధిమంతురాలిలా కూర్చుంది.



తర్వాత ఇద్దరూ గట్టిగా నవ్వుకొన్నారు.

*　　*　　*　　*

తర్వాత మీరా వెళ్తోంటే అరుణ; "ఉండు ఇప్పుడే వస్తాను" అంటూ మేడమీదకి వెళ్ళి, అయిదు నిముషాలలో తిరిగి వచ్చింది. మీరా గేటు దాటుతోంటే అరుణ మీరా చెయిలాగి, చిన్న కాగితం మడత చేతిలో పెట్టి గుప్పిట మూసేసింది.

"ఏమిటిది!" మీరా కాగితం మడత విప్పబోయింది.

"ఇక్కడ కాదు. ఇంటికెళ్ళాకా చూడు" అంది అరుణ మీరా చెయి తిరిగి మూసేస్తూ.

"ఏమిటో చెప్పరాదూ!"

"ఉఁహు! దారిలోకూడా విప్పద్దు. ఒట్టే చెప్తున్నా" అంది అరుణ మీరా చెయి గట్టిగా పట్టుకొంటూ.

"అబ్బ! ఏమిటే, సస్పెన్స్! ఇప్పుడు మెయిల్‌కన్న స్పీడుగా పరుగెత్తాల్సొంటుంది" అదేమిటో విప్పి చూసేవరకూ ఆత్రుత ఆగేట్టు లేదు మీరాకి.

"మెయిల్‌లా కాకపోతే విమానంలా దూసుకుపో నీ ఇష్టం! నిన్ను కాదన్నావారు ఎవరు. ఇక్కడమాత్రం చూడద్దు."

ఇంటికి రాగానే మీరా అరుణ ఇచ్చిన కాగితం మడత విప్పి చదివింది. అందులో ఇలా వుంది.

"మీరా! ఇలా రాస్తున్నందుకు నవ్వద్దు. ఇందాక వచ్చినతను—అతని గురించి నీ అభిప్రాయం చెప్పమని అన్నయ్య అడిగాడు. నీతో చెప్పాలనుకున్నాను. కానీ, చెప్పలేకపోయాను, నీ సలహా ఏమిటి!"

ఇదన్న మాట! పిచ్చి అరుణ. ఎంత భయస్తురాలు. అరుణ అమాయకత్వమే ఎవర్నైనా ఆకర్షిస్తుంది. అరుణ అమాయకత్వం అలుసుగా తీసుకోకుండా అర్థం చేసుకొనేవాళ్ళయితే!

మర్నాడు మీరా అన్నం తినగానే అరుణ దగ్గరికి పరుగెత్తింది. మీరాని చూడగానే అరుణ గుండెలు దడదడలాడాయి. మీరా సంగతి అరుణకి తెలియందేం కాదు. ఏదో మామూలుగా నింపాదిగా అడగదు. సుడిగాలిలా వచ్చి చుట్టేస్తుంది.

అరుణ భయపడినట్టుగానే మీరా అరుణని రెండు చేతులతోటీ చుట్టేస్తూ అంది. "అరుణా, ఎంత దొంగవి—అయినా తెలివి తేటలు నీవిలా కనిపించటం లేదు."

"ఊఁ, ఉఁ" అరుణ మూతి బిగించి మూలిగినట్టుగా అంది.

"మాట్లాడు. నోటి ముత్యాలు రాలిపోవు. ఒకవేళ రాలినా ఏరి మీ...."

అరుణ చప్పున మీరా నోరు మూసేసింది. "ఇదిగో! ఇలాంటి మాటలు మాట్లాడావంటే నిన్ను బయటకి గెంటి తలుపు వేసుకొంటాను" అంది.

"ఎవరొచ్చినా తలుపు తీయవా?" అంది మీరా చాలా అమాయకంగా మొహంపెట్టి.

"అదిగో మళ్ళా" బెదిరించింది అరుణ.

మీరా బెదిరినట్టు నటిస్తూ వచ్చి కుర్చీలో బుద్ధిమంతురాలిలా కూర్చుంది. అరుణ మీరా కూర్చున్న కుర్చీ వెనగ్గా వచ్చి నిలబడి మీరా భుజంమీదుగా ముందుకి వంగి అడిగింది "మీరా! నువ్వు హాస్యం మొదలెట్టేవంటే నేనేం చెప్పను. కానీ....నీ సలహా ఏమిటి?"

"ముందు ఇలా వచ్చి కూర్చో!" అంది మీరా.

"ఊఁహు! నీ ఎదురుగా కూర్చుంటే నా నోట్లోంచి అసలు మాటేరాదు—చెప్పు."

"బాగుంది. ఇలాంటివి ఎవరికివారే ఆలోచించుకోవాలి కానీ, నన్నడిగితే నేనేం చెప్పను."

"నాకు ఏమీ తెలియడములేదు. అన్నయ్య ఊరునించి వచ్చేడంటే 'అవునూ-కాదు' ఏదో ఒకటి చెప్పమని పీకమీద కూర్చుంటాడు."

"నీ కిష్టంలేకపోతే కూడానా?" అడిగింది మీరా. శేఖరం ముఖం గుర్రుచేసుకుంటే అతని ముఖం కఠినంగానే కనిపిస్తుంది. 'చెల్లెల్ని దండిస్తాడా! అదీ పెళ్ళి విషయంలోకూడా' అనుకొంది. అయినా అరుణ తనంటే అన్నగారికి ఎంత అపురూపమో చెపుతూనే వుంటుంది.

"నాకిష్టంలేందే ఎప్పుడూ బలవంతం చెయ్యడు. ఏదో ఒహటితేల్చి చెప్పమంటాడు. అమ్మకూడా రాసింది."

తర్వాత మూర్తి కుటుంబ విషయాలు తనకు తెలిసినంతవరకూ చెప్పింది అరుణ.

అసలు మొదట మీరాతో చెప్పటానికే సిగ్గూ, భయం కలిగినాయి. ఆ తర్వాత ఎదురుగా మీరానిచూస్తూ ఏం చెప్పలేననిపించింది. ఇప్పుడు మామూలుగానే చెప్పడం మొదలెట్టింది.

అరుణ ఆ చెప్పడం తీరుచూసి అరుణకి ఈ సంబంధం యిష్టమనే గ్రహించింది మీరా. శేఖరానికి అతనితో స్నేహమేగాక ఆ కుటుంబంలో అందరితోనూ పరిచయంవుంది. ముఖ్యంగా అరుణకికూడా నచ్చింది.

"ఎర్రగా బుర్రగా బాగానే వున్నాడు. నీకన్నా అతనే బాగున్నాడు" అంది మీరా అరుణని వెక్కిరింపుగా చూస్తూ.

అరుణ పెదాలు బిగించి సీరియస్‌గా చూసింది.

"నువ్వెంత సీరియస్‌గా చూసినా నాకేం భయంలేదు. ఈలోపున వాళ్ళతో పరిచయం చేసుకొని మగపెళ్ళివారి తరపున వస్తాను. నీకు ఆడబిడ్డగా వస్తాను" అరుణ బుగ్గమీద పొడుస్తూ అంది మీరా.

"నేనే నీపెళ్ళికి అలావస్తే బాగుంటుందేమో!" మీరా నోరు ఎలాగయినా మూయించాలనే ఉద్దేశ్యంతో బాగా అన్నాననుకుంది అరుణ.

"వస్తే తర్వాత అలా వద్దువుగానిలే!" అంది మీరా ఏమీ తొణకకుండా.

"మొండి" అరుణ కోపంగా అటుతిరిగి కూర్చుంది.

"ఎరువు సొమ్ము బరువుచేటు—ఎంతసేపని భరించగలవా కోపాన్ని."

"అబ్బబ్బ! మీరా! ఇంకే విషయాలన్నా మాట్లాడు నీకు పుణ్యముంటుంది."

"ఏ విషయాలు మాట్లాడను? నువ్వే చెప్పు. తు. చ. తప్పకుండా పాటిస్తాను."

"నేను చాలా సీరియస్‌గా మాట్లాడుతున్నాను" చాలా గంభీరంగా అంది అరుణ.

"నేనంతకన్నా సీరియస్‌గా మాట్లాడుతున్నాను" మరింత గంభీరంగా అంది మీరా.

అరుణకి నవ్వొచ్చింది..నవ్వు దాచుకుంటూ అంది "నిన్నేదో ఆవహించింది. లాభంలేదు ఏదేనా ఇంత దిగతుడిచి పారేయడం మంచిది."

"ఏం దిగతుడిచి పారేస్తావో చెప్పి మరీచెయ్."

"చెప్పినా ఏం లాభంలేదు. దిగతుడిచింది అవతల పారేస్తారు."

"ఆఁ, ఇలాంటి వాటిని పారేయక్కర్లేదు. భూతవైద్యానికి కొబ్బరికాయ తీసుకెళితే ఆ కొట్టినకాయలు వాళ్ళు హోటలుకిచ్చి, కుటుంబానికి సరిపడా నిత్యం ఇడ్లీలు తెచ్చుకొంటారట."

"ఛ! అలా ఎందుకు చేస్తారు. కీడు కాదూ."

"కీడో, పాడో సుమిత్ర అత్తయ్య చెప్పింది. వాళ్ళవూళ్ళో ఒకాయన అలానే చేస్తాట్ట!"

సుమిత్ర అత్తయ్యనేసరికి అరుణకి మీరాచెప్పింది గుర్తుకొచ్చి నవ్వుకొంది. "మీరా! దెయ్యమనుకొన్నానని ఆవిడతో చెప్పావా?" అంది.

"అమ్మో!" మీరా గుండెలపైన చేయి అన్చుకుంది. "ఇంకేమన్నావుందా? చంపేస్తుంది. ఆ తర్వాత మా అమ్మ చంపుతుంది. 'చిన్నా పెద్దా, మంచీ చెడూ లేకుండా యేమిటా వాగుడూ' అని. సుమిత్రకి నాకే తెల్సు" అంది మీరా.

ర ర ర

శేఖరం ఆరోజు ఉదయమే బొంబాయినుండి వచ్చినా తిన్నగా అతను యింటికి రాలేదు. కారణం గోపాలరావుగారికి బొంబాయిలో రేపు ప్రయాణమనగా చిన్నగా గుండెలో పోటువచ్చింది. రెండురోజులు ఆగి వెళ్దామని శేఖరంచెప్తే ఆయన వినలేదు. "ఫరవాలేదు. వెంటనే యింటికి వెళ్ళిపోవాలి. నువ్వేం కంగారు పడకు. నాకిలా అప్పుడప్పుడూ వస్తూనే వుంటుంది" అన్నారాయన.

శేఖరం యింక తనుచెప్పేదేమీ లేదనుకున్నాడు.

అలాంటి మనిషిని వదలిపెట్టి రావటానికిలేక తిన్నగా గోపాలరావుగారింటికివెళ్ళి అక్కడనుండి యింటికి ఫోను చేశాడు.

సాయంత్రం రాజేంద్ర గోపాలరావుగారింటికి వెళ్తూ భార్యని కూడా రమ్మన్నాడు. కుసుమ రానంది. రాజేంద్ర వెళ్ళిపోయాడు.

రాజేంద్ర వెళ్ళేసరికి అప్పుడే శేఖరం యింటికి బయలుదేరుతున్నాడు.

శేఖరం ఎంతవద్దన్నా వినక ఆయన డ్రయివర్ని శేఖరాన్ని యింటిదగ్గర దించి రమ్మని

చెప్పాడు.

కారు స్టార్టవుతోంది. శేఖరం అన్నగార్ని చూసి కారు దిగాడు.

గోపాలరావుగారు శేఖరం తనకి ఎంత సహాయంచేసిందీ చాలా అభిమానంగా చెప్తున్నారు. రాజేంద్ర చాలా కుతూహలంగా వింటున్నాడు. అతనికి చాలా ఆశ్చర్యంగాకూడా వుంది. ఇంకొకాళ్ళ పనిలో శేఖరం యింత శ్రద్ధ వహిస్తాడని అతననుకోలేదు.

శేఖరం చాలా యిబ్బందిగా కూర్చున్నాడు. పొద్దున్న వచ్చేకా డాక్టరువచ్చి చూసివెళ్ళిన తర్వాత శేఖరం వెడతానంటే ఆయన వెళ్ళనివ్వలేదు.

"మీ అమ్మాయిగారు వున్నారుగా! యింటికెళ్ళి స్నానంచేసి వస్తాను—బట్టలుకూడా మాసిపోయాయి."

ఇలా అతను యెన్నిచెప్పినా ఆయన వెళ్ళనివ్వలేదు.

గోపాలరావుగారి చిన్నమ్మాయి మాధురి రాజేంద్రతోబాటు శేఖరానికి కూడా టీ బిస్కట్లు తీసుకొచ్చింది.

"నేనిప్పుడేగా తీసుకొచ్చేను" అన్నాడు శేఖరం.

"ఫరవాలేదు, టీయేగా!" అంది మాధురి నవ్వుతూ.

"మీ తమ్ముడికి మొహమాటం జాస్తి" అన్నారు గోపాలరావుగారు.

రాజేంద్ర నవ్వి వూరుకున్నాడు.

ఎనిమిది గంటలకి ఆయనదగ్గర శలవు తీసుకొని అన్నదమ్ములిద్దరూ యింటికి బయలు దేరారు.

డ్రయివరు కారులో దించి వెళ్ళాడు.

వాళ్ళు యింటికొచ్చేసరికి కుసుమా, సుందరీ యింకా యింటికి రాలేదు.

రాజేంద్ర మొదటిసారిగా భార్య యిలా తను వచ్చేడో లేదో లెక్కలేకుండా తిరగటం గురించి బాధపడ్డాడు.

ఏమిటో ఒక్కసారిగా అతన్ని ఒంటరితనం ఆవహించినట్లు బాధపడసాగాడు.

అరుణా శేఖరం కబుర్లలో పడ్డారు. శేఖరం నాలుగు రోజులు ఊరెళ్ళివచ్చినా అరుణకి అతను ఎన్నాళ్ళో వెళ్ళినట్టుగా వుంటుంది.

ఈ మధ్య శేఖరం నెలరోజులుగా ఎక్కడికీ వెళ్ళలేదేమో అరుణకి శేఖరం బొంబాయి వెళ్ళాక ఏం తోచకుండా పోయింది.


రాత్రి తొమ్మిది దాటాక కుసుమా సుందరీ వచ్చారు.

కుసుమ "ఎప్పుడొచ్చావు" అని శేఖరాన్ని పలకరించింది.

శేఖరం చెప్పాడు.

శేఖరం ఊరు వెళ్ళినప్పటినుండి పథకాలు వేస్తోంది. ఎలాగయినా మళ్ళీ శేఖరాన్ని కదిపి సుందరితో పెళ్ళికి ఒప్పించాలని. అతన్ని పెళ్ళివిషయం అడగాలంటే ముందు అతనితో మాటలు జరగాలి. ఒకవిధంగా కుసుమకి అతను ఊరువెళ్ళటం చాలా అనువుగా అన్పించింది.

శేఖరానికీ ఆవిడకీ యేదయినా మాటామాటా శేఖరం మళ్ళీ ఊరువెళ్ళి వచ్చాకనే మాట్లాడుకుంటారు. ఎప్పుడోకాని కుసుమ పలకరించదు. మొదట మొదట్లో శేఖరమే వదినగారిని పలకరించేవాడు. కానీ రాను రాను కుసుమ—ఆ మాట ఆ తీరు—అతనికి బాధ కలిగించేది.



తనంటే యిష్టంలేక వాళ్ళకి అతను ఆమడ దూరాన వుండటానికే ప్రయత్నిస్తాడు.

అన్నగారితోకలిసి తిన్నగా యింటికి వచ్చేయటంవల్ల శేఖరం ఆ పూట యింట్లో భోజనం చేయక తప్పలేదు.

భోజనాలదగ్గర అన్నదమ్ముల మాటలనిబట్టి గోపాలరావుగారికి పెళ్ళికావలసిన పిల్లుందని గ్రహించింది కుసుమ.

ఆవిడ వాళ్ళనుకొంటారు వీళ్ళనుకొంటారని భయపడి ఊరుకునే రకంకాదు.

రాత్రి పడుకోబోయేముందు రాజేంద్రని అడగనే అడిగింది.

అతనెందుకో గోపాలరావుగారింటి దగ్గరనుంచి వచ్చేసరికి భార్య యింటిదగ్గిర లేకపోటం అప్పటినుంచీ విసుగ్గానే వున్నాడు. స్నేహితునింటికి వెళితే వాళ్ళ భార్యలు యింటిదగ్గిరే వుంటారు. ఒకసారి ఓ ఫ్రెండుభార్య వాళ్ళ పక్కవాళ్ళతో సినిమా ప్రోగ్రాం వేసుకొంది. తీరా వాళ్ళు బయలుదేరే సమయానికి తనూ అతనూ వెళ్ళేరు. ఆవిడ సినిమాకు వెళ్ళనంది. పక్కవాళ్ళతో రానని చెప్పివచ్చింది కూడా. తర్వాత అతను వెళ్ళమని బలవంతంచేసి పంపాడు–పక్కవాళ్ళను తయారుచేసి తీరా వెళ్ళేముందు రానంటే బాగుండదని. ఆవిడ అయిష్టంగానే వెళ్ళింది.

అసలు భర్త ఎక్కడికో వెళ్ళాలి చాలా ఆలస్యమౌతుందని చెప్పాట్ట.

అయితే మేము సినిమాకు వెడతాం అందిట. అతను సరేనన్నాడు.

ఇలా చాలా గుర్తుకొచ్చేయి రాజేంద్రకి.

కుసుమ అడిగిన దానికి రాజేంద్ర సరిగా సమాధానం యివ్వలేదు.

"ఏమిటి? మాట్లాడరే? ఊరికే ఆయన ఈయనగారి మీద యింత అభిమానం చూపిస్తున్నాడంటారా?"

"ఏమో! ఏం తెలుస్తుంది."

"ఏమిటలా వున్నారు?" భర్త ముభావంగా వుండటం యెప్పుడూ చూడలేదు కుసుమ.

"తలనొప్పిగా వుంది" అటుతిరిగి పడుకుంటూ అన్నాడు రాజేంద్ర.

వరసగా నాలుగురోజులు అన్నదమ్ములిద్దరూ ఎవరికి తీరికున్నప్పుడు వారు గోపాలరావు గారింటికెళ్ళి చూసొచ్చేవారు.

ఆయన కాస్త కోలుకున్నారు.

గోపాలరావుగారికి శేఖరం అన్నివిధాలా నచ్చాడు. శేఖరం వచ్చినప్పుడల్లా మాధురి చనువుగా మాట్లాడుతున్నా శేఖరం యేదో అంటీ ముట్టనట్లుగా సమాధానమిచ్చేవాడు. ఏదయినా తప్పనిసరయితే కాని తనంత తాను మాట్లాడేవాడు కాదు. ఓరోజు రాజేంద్ర వచ్చినప్పుడు గోపాల రావుగారు "నేను పెద్దవాణ్నయి పోతున్నాను. నా ఆరోగ్యం చూస్తే అంతంత మాత్రంగానేవుంది." యిలా అవీయివీ చెబుతూ తనకి శేఖరం అంటే ఎంత అభిమానమో మరోసారి చెప్పి, "ఆనాటి మా స్నేహబంధాన్ని ఈనాడు బంధుత్వంగా ముడివేయాలని వుందోయ్" అన్నారు.

మొదట ఆయనేం చెబుతున్నాడో రాజేంద్రకి అర్థంకాలేదు. తరువాత యేమిటో అర్థ మయినాక తేరుకోడానికి రెండునిమిషాలు పట్టింది.

"నాదేముందండి! వాడి కిష్టమయితే...."

"నాదేముందంటా వేమిటోయ్! నీదే! తండ్రి తరవాత తండ్రంతటి వాడివి. నువు చెప్పాలి'' అన్నారాయన.

ఇంకేమనాలో తెలియక "చెప్తానండి" అన్నాడు.

రాజేంద్ర శేఖరాన్ని అడగకముందే గోపాలరావుగారి మాటలధోరణి బట్టి కొంచెం గ్రహిం చిన శేఖరం అక్కడికెళ్ళడం తగ్గించుకున్నాడు. ఆయన రెండుమూడు కబుర్లు చేసినప్పుడు తప్పనిసరిగా వెళ్ళేవాడు. ఎప్పుడన్నా కలిసినప్పుడు గోపాలరావుగారు మళ్ళా అడగకమానరు. తనమాట ఎందుకు పోగొట్టుకోవాలి అని రాజేంద్ర శేఖరాన్ని అడిగాడు.

ఆ సాయంత్రమే గోపాలరావుగారు శేఖరాన్ని అటూయిటూ గాకుండా అడిగారు. శేఖరం అదృష్టమో యేమోగాని గోపాలరావుగార్ని చూడ్డానికి ఆయన బావగారు వచ్చారు.

ఆయనవస్తూ కుశలప్రశ్నలమాట అయింది. "ఈ అబ్బాయి యెవరు!'' శేఖరాన్ని చూసి అడిగాడాయన.

"నా చిన్ననాటి స్నేహితుడి కొడుకు" అని చెప్పారు.

ఈ సందర్భంలో శేఖరానికి సమాధానం చెప్పవలసిన బాధ తప్పింది. అతనికి కించిత్ కోపం కూడా కలిగింది. అసలే తను అనుకొన్నది ఏం కాలేదని ఓ చెంపని బాధపడుతుంటే ఎక్కడి కెళ్ళినా ఈ పెళ్ళిగొడవ ఒకటి.

"ఏదో ఒకటి నువ్వే సర్దిచెప్పేసేయ్'' అన్నాడు శేఖరం.

"ఏమని చెప్పను?'' అన్నాడు రాజేంద్ర.


"ఇంకా నాలుగయిదేళ్ల వరకూ చేసుకోనన్నాడని చెప్పు."

"ఆయన నమ్మద్దూ!"

"లేకపోతే....లేకపోతే మేనరికం వుందనో—ఏదో ఒకటి సర్దిచెప్పు'' మేనరికం అనే మాట బలవంతంగా అన్నాడు.

"ఏం? ఆ అమ్మాయి నచ్చలేదా?" అని అడిగాడు రాజేంద్ర.

"అసలు పెళ్ళే నచ్చలేదు" అన్నాడు శేఖరం.



మొదట ఆ మాట ఎందుకన్నాడా అని శేఖరం కళ్ళల్లోకి చూశాడు రాజేంద్ర. ప్రతీ మాటకీ రాజేంద్ర భుజాలు తడుముకొంటాడు. అతని కదో బలహీనత.

రాజేంద్రా, శేఖరం గోపాలరావుగారింటి కెళ్ళినప్పుడు—తిరిగి వచ్చినప్పుడల్లా వాళ్ళు ఎంత చెప్పినా వినకుండా డ్రైవర్నిచ్చి కారులో పంపుతారు.

అసలు అదివరకే కుసుమకి కారు కొనాలనే కోర్కె వుంది. అడపా దడపా రాజేంద్రతో అంటూండేది. ,ఇప్పుడు గోపాలరావుగారి కారు వస్తూ పోతూండడం—ఆవిడలో మళ్ళా కోర్కె తలెత్తింది. ఈసారి నింపాదిగా అని వూరుకోలేదు. కొనితీరవలసిందేనని పట్టుపట్టింది.

ఆవిడలా గట్టిగా పట్టుబట్టటం ఏమిటి—నెల తిరక్కుండానే కారు వచ్చి వాకిట్లో వుంది. ఆ రోజు కుసుమ చాలా హడావిడి చేసింది. శేఖరాన్ని కూడా ఎక్కడికీ వెళ్ళొద్దంది. శేఖరం సరేనని ఎక్కడికో,వెళ్ళాల్సొచ్చీకూడా ఆగిపోయాడు. ఇది రాజేంద్రకు ఆశ్చర్యంగానే వుంది. అరుణా ఆశ్చర్యపోయింది. కుసుమ చెప్పగానే శేఖరం ఆగిపోవటం.

వాళ్ళంత సరదాపడి అట్టహాసంగా చేసుకొంటోంటే తను వెళ్ళిపోయేడనే మాట తన కెందుకనుకొన్నాడు శేఖరం.

స్నేహితుల్నీ ఆ చుట్టుప్రక్కల వాళ్ళనీ పిలిచి చిన్న పార్టీ ఇచ్చింది కుసుమ.

దాదాపు వచ్చినవాళ్ళంతా వెళ్ళిపోయారు. చుట్టుపక్కల వాళ్ళల్లో ఇద్దరు ముగ్గురు—క్లబ్బు స్నేహితులలో నలుగురు వున్నారు.

మీరా గేటు వరకూ వచ్చి ఆగిపోయింది. వరండా మెట్ల దగ్గరగా కొత్తకారూ—దానికి పూలమాలలు—ఇంట్లోంచి ఎవరెవరివో చాలామందివి మాటలు వినిపిస్తున్నాయి.

తను వెనక్కి వెళ్ళిపోవడం మంచిదనుకొంది మీరా.

అప్పుడే అరుణ పనిపిల్లని పిలుస్తూ వరండాలోకి వచ్చింది. మీరా వెళ్ళిపోవటం చూసి, గబగబా వచ్చి "ఏమిటి వెళ్ళిపోతున్నావు? రా రా" అంది.

"ఏమిటివాళ మీ ఇంట్లో" అడిగింది మీరా.

అరుణ చెప్పి మీరాని లోపలికి తీసుకెళ్ళింది.

మెట్లవరకూ వచ్చి "నువు పైకి వెళ్ళు. నే నిప్పుడే వస్తాను" అని అరుణ వంటగదికే వెళ్ళిపోయింది.

మీరా గబగబా పైకి వచ్చేసింది. అప్పటికే అక్కడున్న ఆడవాళ్ళు "ఈ అమ్మాయి ఏవరా" అన్నట్లు మీరాని పరీక్షగా చూస్తూ కుసుమని ఏదో అడుగుతున్నారు. అలా ఎవరేనా పరీక్షగా చూస్తే ఆడవాళ్ళయినా సరే—కంపరం పుట్టినట్టుగా వుంటుంది మీరాకి. అందుకే గబగబా పైకి వచ్చేసింది.

శేఖరం అరుణ గదిలోనే వున్నాడు. మీరా ఆ గదిలోకి రావటం అద్దందగ్గర నిలబడి మరోసారి చక్కగా క్రాఫ్ దువ్వుకుంటున్న శేఖరానికి కనబడింది.

గదిలోకి వచ్చి నాలుగయిదు అడుగులు వేస్తేకాని శేఖరాన్ని చూడలేదు మీరా. చూస్తూనే అదిరిపడి పరుగులాటి నడకతో వెనక్కి వచ్చేసింది.

మెట్లగుమ్మంవరకూ వచ్చి అక్కడ నిలబడింది. కాళ్ళు విపరీతంగా వణుకుతున్నాయి.

అరుణ ట్రేతో టీ, టిఫిను తీసుకొచ్చింది.

"ఇదేమిటి, ఇక్కడ నిలబడ్డావేం? రా" అంది.

అరుణ వెనకాలే మీరా వెళ్ళలేదు.

అరుణ గది గుమ్మంవరకూ వెళ్ళింది—అక్కడ అన్నగారిని చూసింది. "ఇందుకా" అన్నట్లు మీరాకేసి చూసి, "రా! ఫర్వాలేదు" అంది.

మీరా నిల్చున్న చోటునించి ఒక్క అడుగుకూడా కదపలేదు.

అరుణ ట్రే లోపలపెట్టి వచ్చింది. శేఖరం తన గదిలో వున్నట్లు తెలియదు. అతను అరుణని పిలిచి టీ తెమ్మన్నాడు. అరుణ కిందికి వచ్చేక అతను అరుణ గదిలోకి వచ్చేడు. అతనికి టీ తాగే అలవాటు కాస్త ఎక్కువే! తాగినప్పుడల్లా అరకప్పుకన్న ఎక్కువ తాగడు.

అరుణ ఎంత చెప్పినా మీరా రానంది. "ఏమిటంత సిగ్గు! నిన్నేం కొరుక్కు తినడులే!" అంటూ రెక్క పట్టుకుని లాక్కుపోయింది;

అప్పటికే శేఖరం టీ నిలబడే తాగుతున్నాడు.

మీరా గదిలోకి రాగానే—వద్దనుకొంటూనే శేఖరంకేసి చూసింది.

సరిగ్గా అప్పుడే అతనూ కాళీ కప్పు టేబుల్‌మీద పెడ్తూ మీరాకేసి చూశాడు.

అతని చూపులు సీరియస్‌గా అన్పించినా, చిత్రంగా బిగించిన పెదాల చివర చిరునవ్వు తొంగిచూస్తోంది.

మీరా చప్పున చూపులు మరల్చుకుంది.

శేఖరం వెళ్ళిపోయాడు.

రు రు రు

కోటేశ్వరరావుకి నమ్మకస్తుడిలా—కుడిబుజంలా మసిలే మంగపతి శేఖరం గోపాలరావు గారింటికి వెళ్ళొస్తున్నాడని చెప్పాడు.

చాలా అపురూపమైన వస్తువేదో తన చేయిదాటి పోయినట్టు గిలగిలాకొట్టుకున్నాడాయన.

"ఎన్నాళ్ళ మట్టి! మరి నాతో చెప్పలేదేం?" అని కసురుకున్నట్టుగా అన్నాడు.

"మొన్ననే చూశానండీ! వచ్చేప్పుడు ఆయన కారులోనే దిగబెట్టేడండీ వాళ్ళ డ్రైవరు."

పళ్ళు నూరుకొన్నాడు కోటేశ్వరరావు.

"ఇంకా తీరిగ్గా చెప్తున్నావా? బలేవాడివయ్యా! ఇంతమాత్రం తెలియకపోతే ఎలాగయ్యా!' ఆయన కాళ్ళకింద నిప్పులు పోసినట్లే అయింది.

"మొన్న నాకు కనిపిస్తే మీరు రమ్మన్నారని చెప్పానండీ!.........

"మరి చెప్పవేం?"

"ఏదీ! మీరు చెప్పనిస్తేగా!"

"ఏమన్నాడు. వస్తాన్నాడా! అసలు దగ్గరుండి తీసుకురాలేకపోయావా?"

"కూడా ఎవరో వున్నారండీ! అమ్మాయిగారు."

"అమ్మాయిగారా! ఎవరా అమ్మాయి—అతని చెల్లలేమో!"

"ఏమోనండి. నేను అడగలేదు బాగుండదని" అదోలా నవ్వేడు మంగపతి.

"గొప్ప పనిచేశావు" ఎన్నడూ రానంత కోపం వచ్చింది ఆయనకి మంగపతిమీద. "వాళ్ళిల్లు తెలుసా నీకు?" అని అడిగాడు.

"తెలవదండి" వినయంగా జవాబిచ్చేడు.

"ఈసారి ఎక్కడ కనిపించినా వదిలిపెట్టకు. కూడా తీసుకురా!"

"వదిలిపెడతానా! లాక్కురానూ?"

"ఇదిగో! కాస్త నేర్పుగా మాట్లాడి మరీ తీసుకురా" అన్నాడాయన.

మంగపతి సరేనని వెళ్ళిపోయాడు.

ఆయన చాలా సీరియస్‌గా ఆలోచిస్తున్నాడు.

తను తెలివితక్కువగా ప్రవర్తించేడా? ఏదో చేద్దామని అతన్ని మరింతదూరం నెట్టేశాడా? ఏదో ఫ్యాక్టరీ గురించయినా వస్తూ పోతూంటాడు—కొన్నాళ్ళ కయినా అతని మనసు ఇటు తిరక్కపోతుందా అనుకొన్నాడు. ఇలా అవుతుందని తనకేం తెలుసూ?........అయినా ఇప్పుడేమయింది? తను ఖంగారుపడటం. ఏదో పనిమీద వెళ్ళేడేమో! ఏమిటో ఆ పని........

ఆయన తలపెట్టిన పనుల్లో ఇంతవరకూ అపజయం పొండి ఎరుగడు. ఇదొక్కటీ నెరవేరితే! ఇంక తన జీవితానికి నిశ్చింత అనుకొన్నాడు.

ఆయన ఎక్కడ కెళ్ళినా ఆయన కళ్ళు శేఖరంకోసం గాలిస్తూనే వుండేవి.

అలా గాలించడంలో ఓరోజు శేఖరం బజార్లో కనిపించేడు.

ఆయన శేఖరం పక్కగా కారు ఆపాడు. శేఖరం ఆగి చూశాడు.

కోటేశ్వరరావు డోరు తెరుచుకుని కిందికి దిగేడు.

"మీరా!" అన్నాడు శేఖరం.

"ఏమిటోయ్! బొత్తిగా నల్లపూసవయిపోయావ్" భుజం తట్టూ ఆప్యాయంగా అడిగాడు.

"ఈ మధ్య ఊళ్ళో లేనండీ!" అన్నాడు శేఖరం.

ఆయన కనుబొమలు కొద్దిగా ఆశ్చర్యంగా పైకి లేచినాయి.

"మీ ఊరు వెళ్ళావా?" అని అడిగాడు.

"లేదండి. బొంబాయి వెళ్ళాను. గోపాలరావుగారని—మీకు తెలిసేవుంటారు."

"ఆc, ఆc!" అన్నాడు. శేఖరం నోటిమీదుగా అలా వింటోంటే తను ఎంత తెలివి

తక్కువగా ప్రవర్తించేదో ఆయినకి అర్థంకాసాగింది.

"రా, రా: ఇక్కడ మాట్లాడుకోవటం ఏమిటి" అంటూ డోరు తెరిచాడు.

"నేను రేపు వస్తానండి."

ఆయన క్షణం ఆలోచించి "కాస్త కాఫీ తాగుదాం" అన్నాడు.

ఇంక బాగుండదని తప్పనిసరిగా వచ్చి కారులో కూర్చున్నాడు శేఖరం.

కోటేశ్వరరావు ఓ గంటకికాని శేఖరాన్ని వదల్లేదు.

మర్నాడు వస్తానన్నట్టుగానే శేఖరం కోటేశ్వరరావుగారి ఆఫీసుకి వెళ్ళాడు. ఆయన రాత్రినుంచీ ఆలోచించుకొన్నట్టుగానే శేఖరాన్ని ఇంటికి తీసుకెళ్ళాడు. కోటేశ్వరరావుగారు, శేఖరం ఆఫీసులోంచి బయటికి రాగానే కోటేశ్వరరావు ఆదేశం ప్రకారం మంగపతి ఇంటికి ఫోనుచేసి చెప్పాడు ఇలా వస్తున్నారని.

మొత్తం కార్యక్రమం ఎలా జరగాలో రాత్రే నిర్ణయం జరిగింది.

ఆ ప్రకారం కోటేశ్వరరావు, శేఖరం వెళ్ళేసరికి జ్యోతి తన్మయంగా వీణవాయిస్తోంది—అంతకన్న తన్మయత్వంగా వింటోంది సరోజినీదేవి.

వీళ్ళు రావటంకాని చిన్నగా మాట్లాడుకోవటంగాని జ్యోతికి తెలియలేదు. సరోజినీదేవే లేచి సాదరంగా శేఖరాన్ని ఆహ్వానించింది.

ఎందుకో తెలియదు కాని జ్యోతిని చేసుకోకపోయినా శేఖరం ఇలా అప్పుడప్పుడయినా వస్తూ పోతూ వుంటే బాగుండుననుకొంది సరోజినీదేవి.

శేఖరానికి వాళ్ళింటికి రావాలంటేనే ప్రాణం మీదికొచ్చినట్లుగా వుంటుంది. పెద్దవాళ్ళ మాటకి చెండుకొన్నట్టుగా మాట్లాడలేక ఇలాంటివి కొన్ని కొన్ని తప్పనిసరిగా భరిస్తాడు.

పాటంతా పూర్తయినాక జ్యోతి ఈ లోకంలోకి వచ్చింది.

జ్యోతి వచ్చి తండ్రి ప్రక్కన కూర్చుంది.

కోటేశ్వరరావు కన్నా సరోజినీదేవే ఎక్కువగా మాట్లాడుతోంది.

మధ్య మధ్యలో కోటేశ్వరరావు 'జోక్'గా ఏదో ఒకటి అంటున్నాడు.

అలాంటప్పుడు జ్యోతి నవ్వటం తప్ప మరే విషయంలోనూ కల్పించుకుని మాట్లాడటం లేదు:

మంగపతి వచ్చి పిలిస్తే కోటేశ్వరరావు బయటకెళ్ళాడు.

వాకిట్లో మంగపతి మాట వినపడగానే సరోజినీదేవి టిఫిను తీసుకొస్తానని లోపలకెళ్ళింది.

అక్కడ జ్యోతి శేఖరం మిగిలారు.

అక్కడే టీపాయ్‌మీద వున్న పత్రికని తీసుకుని తిరగేయసాగాడు శేఖరం.


ఒక అయిదు నిముషాలు గడిచాయి.

శేఖరం జ్యోతికేసి కన్నెత్తికూడా చూడకపోవటం జ్యోతి అహం దెబ్బతింది.

కాని అతన్ని పొందాలంటే—ఎగా ఎలా నడుచుకోవాలో చాలా రోజులుగా ప్లాను వేసుకొంది. అతను తన చేతికి చిక్కేవరకూ అతను మెచ్చేవిధంగా ప్రవర్తిస్తే—తర్వాత అతనే తనకి నచ్చేవిధంగా నడుచుకొంటాడు.

జ్యోతి లేచి అతను కూర్చున్న సోఫా వెనగ్గా వచ్చి నిలబడింది.

జ్యోతి లేవగానే తను మాట్లాడలేదని కోపంవచ్చి లోపలికి వెళ్ళిపోతోందనుకుని "బతికేం"



అనుకున్నాడు శేఖరం.

కాని తన భుజాలకి తగిలీ తగలనట్టుగా చేతులాన్చి వెనగ్గా నిలబడ్డ జ్యోతిని చూస్తే—వంటిమీద గొంగళీపురుగు పాకినట్టు కంపరంగా కొంచెం ముందుకి—వంగున్నట్టుగా సర్దుక్కూర్చున్నాడు.

జ్యోతి రెండు మోచేతులూ సోఫా అంచుమీద ఆన్చి వేళ్ళలోవేళ్ళు దూర్చుకొని గడ్డం కింద పెట్టుకుని అతనిమీదకి వంగుతూ గోముగా అంది. "ఇంకా నామీద కోపం పోలేదా?"

"ఈమాట అడగటానికి అంత అవస్థ యెందుకూ? వచ్చి అలా కూర్చోండి" నిశ్చలంగా అంటూ ఎదురు సోఫా చూపించేడు శేఖరం.

"ఉహూ. మీ కళ్ళలో ఆ కోపంచూస్తే నా నోటమ్మట మాటరాదు."

"………………"

"మాట్లాడరేం? నామీద కోపం పోలేదా?"

"కోపమా? కోపమేమిటి?" శేఖరం లేచినిలబడుతూ తమాషాగా కనుబొమలెగరేసి అన్నాడు.

అతనలా లేచి నిలబడ్డం జ్యోతికి నిరుత్సాహం కలగజేసింది.

"నామీద మీకు కోపంలేదా!" ఆశ్చర్యంగా అడిగింది అతనికి దగ్గరగా వస్తూ.

"ఎందుకూ?" యేమీ తెలియనట్లే అడిగాడు.

ఏమిటి - అంత యేమీ తెలియనట్లు - జరగనట్లే మాటాడుతాడు అనిపించింది జ్యోతికి.

"అదే....ఆరోజు....మిమ్మల్ని తీసుకొచ్చి-వాళ్ళలా చేస్తారని నేననుకోలేదు. అసలు...."

"ఓ, అదా....యేదో మామూలుగా ఆడపిల్లలుచేస్తే కోపంవస్తుంది. పౌరుషం కలుగుతుంది" పాంటు జేబులో చేతులు దూర్చుకుంటూ అన్నాడు.

అర్థంకానట్టు చూసింది జ్యోతి. "అంటే!"

"అదే! మీ శిష్యులంతా మీజాతికి చెందినవాళ్ళేగా!"

జ్యోతి కళ్ళు కోపంతో రోషంతో మిలమిల మెరిసాయి. "అంటే!" అంది పెదాలు అదురుతుండగా.

"అంటే? మీజాతి యేమిటో మీకే తెలియదా?" ఆశ్చర్యం నటించేడు.

"మాట్లాడేది తిన్నగా అర్థమయేలా మాట్లాడండి. ఇలా డొంక తిరుగుడుగా మాట్లాడ్డం..."

"మర్యాదలక్షణం కాదంటారు. లేకపోతే పురుషలక్షణమే కాదా?"

అతని ఆమాటతీరూ—ఆ నవ్వూ చూస్తుంటే జ్యోతికి మళ్ళీ అతన్ని యెలాగయినా పరాభవించాలనిపిస్తోంది.

జ్యోతివచ్చి సోఫాలో కూర్చుంటూ, "కోపం లేదంటూనే కోపంగానే మాట్లాడుతున్నారే" అంది. జ్యోతికి అతనిమీద చాలా కసిగావుంది.

శేఖరం బదులు చెప్పలేదు. తనుకూడా కూర్చుని మళ్ళీపుస్తకం తీసుకున్నాడు.

మంగపతిని పంపి కోటేశ్వరరావు లోపలికి వచ్చేడు.

సరిగ్గా అప్పుడే సరోజినీదేవి తనే స్వయంగా టిఫిన్ తీసుకొచ్చింది.

"ఏమిటి యిద్దరికిద్దరూ అలా మౌనంగా కూర్చున్నారు! అమ్మా! నీ పెయింటింగ్స్ చూపించేవా!" అన్నాడు కోటేశ్వరరావు కూతురుతో.

"లేదు డాడీ! ఆయన చాలా సీరియస్‌గా పుస్తకం చదువుకుంటున్నారు. డిస్టర్బ్ చేయటము యిష్టంలేక...." శేఖరంకేసి గుర్రుగాచూస్తూ అంది.

టిఫిను తీసుకోవటం అయినాక జ్యోతి తండ్రిచెప్పగావెళ్ళి పెయింటింగ్స్ (తను చేసినవి కావు) తీసుకొచ్చింది.

శేఖరం తప్పనిసరిగా ఒకటి చేత్తోపట్టుకొని చూస్తూ అన్నాడు. "నాకు వాటిగురించి ఏమీ తెలియదండీ! బొత్తిగా ప్రవేశంలేదు."

"చూడ్డానికికూడా ప్రవేశం వుండాలంటారా?" అంది జ్యోతి వెంటనే.

శేఖరం విసురుగా చూడబోయి అంతలో తమాయించుకున్నాడు.

"ఏమిటమ్మా! నీకింకా చిన్నతనంపోలేదు. అలాగేనా మాట్లాడ్డం" అన్నాడు కోటేశ్వరరావు. జ్యోతిని యెంతో నేర్పుగా ప్రవర్తించమని ఆ తలిదండ్రులు చెప్పేరు. జ్యోతికూడా అలాగే అనుకుంది కాని, యింతక్రితం అతనిమాటలు ఆ తీరూ ఆ సహనాన్ని రెచ్చగొట్టినాయి.

"ఏమన్నాను డాడీ! తమాషాకి అన్నాను" అంది గారంగా.

తర్వాత వాళ్ళు ఓ అర్థగంటసేపన్నా మాట్లాడుకున్నారు. శేఖరం ఆ ఫ్యాక్టరీ సంగతి యేం కదపకపోవటం ఆ దంపతులకు ఆశ్చర్యంగానేవుంది.

శేఖరం ఫ్యాక్టరీసంగతి తను కదపదలచుకోలేదు. అతను ఈమధ్య రాఘవరెడ్డికి వుత్తరం రాసాడు. దానికి అతని దగ్గరనుండి సమాధానం వచ్చింది. తండ్రికి వంట్లో బాగుండలేదని ఆయనకి కాస్త కులాసా చిక్కగానే తను వెంటనే బయలదేరి వస్తానని.

రెడ్డివచ్చేక యిద్దరూవెళ్ళి అటోయిటో తేల్చుకోవటమే మంచిదనుకున్నాడు శేఖరం. అందుకే అతను కదపలేదు.

శేఖరం కోటేశ్వరరావు దంపతులకి 'వస్తా'నని చెప్పి లేచేడు.

కోటేశ్వరరావు డ్రయివర్‌ని పిలిచాడు.

డ్రయివరు కారుడోరు తెరిచిపట్టుకుని వినయంగా నిలబడ్డాడు.

"నేను ఓ ఫ్రెండుని కలుసుకోవటానికి వెళ్ళాలండి" అన్నాడు శేఖరం ఆయన ఉద్దేశ్యం గ్రహించి.

"అక్కడికే తీసుకెళతాడు" దంపతులిద్దరూ ఒకేసారి అన్నారు.

"లేదండీ! నాకింకా బజార్లో పనుంది, వస్తా!" దంపతులిద్దరికీ నమస్కరించేడు.

సరోజినీదేవి, "వస్తూండు శేఖరం" అంది. అలా అన్నప్పుడు ఆవిడ గొంతు యెందుకో పట్టుకున్నట్టయింది.

"అలాగేనండీ! వస్తా" అని వెళ్ళిపోయాడు.

శేఖరం వెళ్ళిపోయినా సరోజినీదేవి యింకా అక్కడే అలాగే నిలబడింది. ఆవిడకి మగ పిల్లవాడు లేడే అన్నబాధ వదల్లేదు. శేఖరమే తనకు అల్లుడయితే తనకా కొరత కొంత తీరినట్టే!

శేఖరం వెళ్ళేటప్పుడుకూడా మర్యాదకన్నా జ్యోతితో ఒక్కమాట చెప్పలేదు. జ్యోతి వెంటనే కోపంగా తనగదిలోకి వెళ్ళిపోయింది.

హుఁ! పెద్ద. తనోపెద్ద గొప్పవాడనుకుంటున్నాడేమో! మర్యాదగా దారికి వస్తాడా సరే సరి. లేకపోతే అతన్ని యెలా యేడిపించాలో—యెలా ముప్పతిప్పలుపెట్టాలో తనకి బాగా తెల్సు. తనంటే యేమనుకున్నాడో!

*　　　*　　　*

"ఏం అరుణా! ఏం ఆలోచించావు" అని అడిగాడు శేఖరం. ఆ రోజు మళ్ళీ తల్లిదగ్గిర నించి వుత్తరం వచ్చింది. "అప్పుడేదో సంబంధం గురించి రాశావు. మళ్ళీ యే విషయం రాయ లేదు. అరుణకి నచ్చలేదా? అన్నయ్యకి యిష్టంలేదా!" అంటూ రాసిందావిడ.

అరుణ మాట్లాడలేదు.

"చెప్పు అరుణా! ఇంకా ఆలోచించుకోవాలా?"

"ఉఁహు" అన్నట్లు తలవూపింది అరుణ.

"మరి యేమిటిచెప్పు అరుణా," అన్నాడు శేఖరం. అరుణకి యిష్టంలేదా? ఒకవేళ అదే అయితే మూర్తి చాలా బాధపడతాడు.

"నీ యిష్టం" అంది అరుణ,

అరుణ ముఖం కిందికి దించుకుని వుండడంవల్ల అరుణ అలాదేనికందో అతనికి అర్థం కాలేదు. "అరుణా! నువ్వలా నీ యిష్టం అనేస్తే కాదు. సరిగ్గాచెప్పు. మూర్తి నీకునచ్చేడా! నువ్వయితే మూర్తికి బాగా నచ్చేవుట...." యింకా శేఖరం మాటలు పూర్తికాకుండానే అరుణ "పో" అంటూ అక్కడినుండి పారిపోయింది.

అతని మనసు తేలికపడింది. మూర్తి తనంతట తనే ఈ అభిప్రాయం వెలిబుచ్చినందుకు అరుణకి కూడా యిష్టమయింది.

ఆ రాత్రి అన్నగారితో శేఖరం మూర్తి సంగతి చెప్పేడు.

"అతనికేం బాగానే వుంటాడు. అమ్మకి రాశావా?"

రాజేంద్ర ఒక్క శేఖరంతో మాట్లాడినప్పుడు "అమ్మ" అని అంటాడు. వాళ్ళ మాటల్లో

కుసుమకూడా కలగజేసుకొంది. 'మూర్తి బాగానేవుంటాడు. నిమ్మశాస్త్రిగారిలానే వున్నాడు' అంటూ.

శేఖరం బొంబాయినుంచి వచ్చినప్పటినుంచీ కుసుమ శేఖరంతో యెందుకో అందుకు కల్పించుకుని మాట్లాడుతూనేవుంది.

కుసుమ మామూలుగా అవీయివీ అడిగినదానికి శేఖరంకూడా మామూలుగానే జవాబు లిస్తున్నాడు.

ఇదేదో—ఎప్పుడో హఠాత్తుగా బ్రహ్మాండం పేలినట్లు పేలుతుందని రాజేంద్రకి ఓ చెంప భయంగానే వుంది.

ఆ మర్నాడు ఉదయం ఎనిమిదిగంటలకే శేఖరం ఎక్కడికో వెళ్ళటానికి తయారయేడు. ఇదిచూసిన కుసుమ తాయారమ్మని గబగబా టిఫిన్ పెట్టమనిచెప్పి తను శేఖరాన్ని పిలిచింది. అతను వాచీ చూసుకొని, టైము అయిపోయిందంటూనే వచ్చి కూర్చున్నాడు.

'అబ్బ ఎప్పుడూ హడావుడే' మనసులోనే విసుక్కుంది కుసుమ.

శేఖరం పెట్టిన టిఫన్‌లో సగం తీసేశాడు.

"ఏమిటంత హడావిడి" అంది కుసుమ.

"తొందరగా వెళ్లాలి" అన్నాడు శేఖరం గబగబా టిఫిను తీసుకుంటూనే.

'హుఁ ఎప్పుడూ యింతే! ఒంటరిగా మాట్లాడాలంటే మళ్లా రేపొద్దనకి వాయిదా వెయ్యాల్సిందే! రాత్రి ఏ పదింటికో వస్తాడు. రేపన్నా ఎవరో ఒకరు వుంటారు. ఇలా ఒక్కడూ దొరకడం అరుదే' అనుకుంది కుసుమ.

"ఉప్మా యెలావుంది?" అంది.

"బాగుంది" అన్నాడు తల ఎత్తకుండానే.

"సుందరి చేసింది. అది వంట బాగా చేస్తుంది" అతనికేసి ఓరగాచూస్తూ అంది.

"ఆహాఁ" నెమ్మదిగా అని తలాడించేడు శేఖరం.

"పెసరట్లు ఎలా వున్నాయి?"

"చాలా బాగున్నాయి."

"సుందరి వచ్చేటప్పుడు తీసుకొచ్చింది...."

వదినగారి మాట పూర్తికాకుండానే అతను ఆశ్చర్యంగా తల యెత్తాడు,

"ఏమిటి, పెసరట్లా!"

"ఛ! పెసరట్లు అక్కడనుంచి తేవడం ఏమిటి?" నవ్వింది. నవ్వుతూ, "పెసలు. అవి మామూలు పెసలుకావు. పిల్లిపెసలు. వాటితో అట్లు చాలా బాగుంటాయి" అంటూ రెండు అట్లు వేయబోయింది.

"అహాఁహాఁ!" రెండుచేతులూ ప్లేటులోకి అడ్డంపెట్టేడు "వద్దు" అంటూ.

తాయారమ్మ కాఫీపట్టుకొచ్చి అక్కడపెట్టి వెళ్లిపోయింది.

"మరి చెల్లెలికి పెళ్లి సంబంధం కుదిర్చేవు. నువ్వెప్పుడు చేసుకుంటావు." అంది కుసుమ నవ్వుతూ.

"ఇప్పుడు నాకు పెళ్లికేం తొందర" అన్నాడు తలెత్తకుండానే.

"తొందరేమంటే! ఏం యింకా చిన్నపాపాయివనుకుంటున్నావా?"

శేఖరం మాట్లాడలేదు.



క్షణం ఆగి అంది: "లేకపోతే ఇంకా లేనివాళ్ళమ్మాయిని చేసుకోవాలనే శపథంతోనే వున్నావా!"

"శపథమా!....అలా అంటే నేనేం చెప్పలేనుకానీ—అభిప్రాయం మటుకు అదే" కాఫీ కప్పు తీసుకుంటూ అన్నాడతను.

"ఏమిటో అంత యిది."

"నేను ఈకాలంవాడినే అయినా—కాస్త పాతభావాలు కలవాడిని....నేను అలసి యింటి కొచ్చేసరికి ఇల్లాలు చిరునవ్వుతో—కాఫీ కప్పుతో యెదురు రావాలి."

కుసుమ చివ్వున తలెత్తింది. ఆవిడ కళ్ళల్లో కోపం స్పష్టంగా కనిపిస్తోంది. "అంటే లేని వాళ్ళ అమ్మాయే అలా చేస్తుందా!" కాస్త హేళనగానే అంది.

"అని నేననలేదు—కాస్త కృతజ్ఞతగా పడివుంటుందని" కాఫీకప్పు టేబుల్ మీదపెట్టేస్తూ "వస్తా" అని వెళ్ళిపోయాడు.

"హుఁ! ఎంత పొగరు! ఎదుటివాళ్ళు యేదేనా అనుకొంటారనికూడా లేదే!"

ఆవిడ ఆవేశం ఆపుకోలేకపోయింది. పిడికిలి బిగించి టేబుల్ మీద గుద్దింది. అలా గుద్దడంతో ఆ పక్కనేవున్న సాసరు అంచుకుతగిలి ఒక్కజంప్‌లో యెగిరి కిందపడి పదహారు ముక్కలయింది.

సుందరి విషయంలో తన కోరిక కూడా అలాగే విరిగి పదహారు ముక్క లయిందనుకుంది కుసుమ.

అప్పుడే తాయారమ్మ యేదో అడగడానికి అక్కడకివచ్చి ఈ దృశ్యంచూసి హడలిపోయి వెనక్కెళ్ళిపోయింది. సరిగ్గా అప్పుడే గుమ్మంవరకూ వచ్చిన సుందరి అదిరిపోయి వెనక్కి పరిగెట్టింది. గబగబా మేడమెట్లు, ఎక్కుతూ శేఖరానికి 'డీ' కొట్టబోయి అతి ప్రయత్నం మీద రెయిలింగ్‌ని గట్టిగా పట్టుకుని నిలదొక్కుకుంది.

శేఖరం "ఏమిటంత హడలిపోతున్నారు, ఏ జంతువునో చూసినట్లు" అన్నాడు నవ్వుతూ. ఎప్పుడూ అతి నిదానంగా శరీరాన్ని కదల్చుకుంటూ నడిచే సుందరి అలా ఎవరో తరుముతున్నట్లు పరిగెత్తడం అతనికి ఆశ్చర్యంగానే వుంది మరి. (సశేషం)

FREE !! ఉచితం !!!

ఇవ్వండి, మీ కివ్వబడును.

వాడొక పేద భిక్షకుడు. దేవాలయపు గుమ్మములో కూర్చుని వచ్చిపోయే జనుల దయాధర్మాలమీద ఆధారపడేవాడు. అరటిపళ్ళు, కొబ్బరిముక్కలతో వాడి పళ్ళెం నిండుతూ ఉండేది. ఒకనాడు విలువగల దుస్తులు ధరించిన భాగ్యవంతు డొకడు తన ముందు నిలిచి "నాకు ఆకలిగా వుంది, నాకేదైనా తినడానికియ్యి తాతా!" అని చేతులు చాచినప్పుడు, తాను విస్తుపోయాడు. ఇతరుల దయాధర్మాలమీద ఆధారపడి తాను బ్రతుకుతుంటే, తన్నే ధర్మం ఇవ్వమని అడిగే ఆ వ్యక్తి వంక తేరిపార జూచాడు. ఏదైనా ఇవ్వమని అర్థిస్తున్న ఆ కళ్ళవంక చూచి ఎంతో అయిష్టముతో, విసుగుతో తన పేద గిన్నెను ఆ వ్యక్తిముందు చాపాడు. ఆ వ్యక్తి చెయ్యి చాచి కొన్ని అన్నం మెతుకులు తీస్తుండగానే ముష్టివాడు తన గిన్నెను వెనకకు లాక్కున్నాడు.

ఆ సాయంకాలం ముష్టివాడు తన గిన్నెలోని దంతా పళ్ళెములో పోసినప్పుడు అందులో పది బంగారు గింజలున్నాయి. ముష్టివాడిచ్చిన దానం కొలది ఆ భాగ్యవంతుడు ముష్టివాని గిన్నెలో బంగారు గింజలను వేశాడు. "అయ్యో! గిన్నెలోని దంతా ఆ భాగ్యవంతునకు దానం చేసివుంటే, ఇక ఈ ముష్టి బ్రతుకు బ్రతుకవలసిన అవసరం లేకుండా నా గిన్నె బంగారు కడ్డీలతో నిండియుండేది గదా!" అని ముష్టి విలవిలలాడాడు.

దేవునికి యిచ్చి ఎవ్వరూ యింతవరకు దిక్కులేనివారు కాలేదు. "నీ రాబడి అంతటిలో ప్రథమఫలమును,నీ ఆస్తిలో భాగమును ఇచ్చి యెహోవాను ఘనపరచుము. అప్పుడు నీ కొట్లలో ధాన్యము సమృద్ధిగా నుండును" అని పరిశుద్ధ గ్రంథము ఆజ్ఞాపిస్తుంది.

"ఈయండి. అప్పుడు మీ కీయబడును. అణచి, కుదిలించి దిగజారునట్లు నిండు కొలతను మనుష్యులు మీ ఒడిలో కొలుతురు. మీరు ఏ కొలతతో కొలుతురో ఆ కొలతతోనే మీకు కొలువబడు" నని పలికిన క్రీస్తు గూర్చి తెలుసుకున్నారా!

మిణుగురు పురుగులు

శంకరమంచి పార్థసారథి

ఆమె పేరు కమల—

ఆమె కళ్ళు వెడల్పుగా, చక్రాల్లా వుంటాయి. ఆమె ఒంటిరంగు బంగారం పోతపోసినట్లుంటుంది. ఆమెనోరు లక్కపిడతలా చిన్నగా వుంటుంది. ఆమె పెదిమలు పండిన దొండ పండులా వుంటాయి. ఆమెజడ పొడుగ్గా వుండటంవల్ల నడుస్తుంటె పిరుదలతో ఆటలాడినట్లుంటుంది. ఆమె అంగసౌష్టవం, వున్నవారిల్లులా అందంగా, ఆరోగ్యంగా వుటుంది.

ఆమెది అందరిలాంటి అందంకాదు. ఎదుటివారిని పిచ్చివారిని చేసే అందం. మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే అందం.

ఆమె నా ప్రక్క వాటాలోకొచ్చి మూడు నెలలే అయింది. నాకు మా వాళ్ళు పెళ్ళి ప్రయత్నాలు చేస్తుండటంవల్ల, ముందుగానే జాగ్రత్తపడి ఈ ఇల్లు తీసుకున్నాను. నాకు ఆమెతో పరిచయం చాలా తక్కువ. కాని ఆమెని చూసినప్పుడల్లా ఆమెతో పరిచయాన్ని పెంచుకోవాలని వువ్విళ్ళూరుతుండే వాడిని. ఆమెకెవరూ మొగదిక్కు లేనట్లుంది. ఆమె ఒక్కతే వుండేది. ఆమెకి తోడు తన ఎనిమిదేళ్ళ కొడుకు మాత్రమే. ఆమె భర్త మిలటరీలో పన్చేస్తూ ప్రాణాలొదిలాడని, అప్పటినించి వుద్యోగంచేసి బ్రతుకుతూ కొడుకును చదివిస్తోందని, చుట్టుపక్కల అమ్మలక్కలు సర్వేచేసి తెల్సుకున్నారు.

నాకు స్వతహాగ వుద్యోగంచేసే ఆడవాళ్ళంటె అమితమైన జాలి, సానుభూతి. నాలుగు గోడల మధ్యన, కడుపులో నీళ్ళు కదలకుండా, వుండాల్సిన వాళ్ళని, పొట్టతిప్పల కోసం రోడ్డుకెక్కించిన ఈ వ్యవస్థమీద చెప్పరాని కోపం — అది వేరే విషయం, వదిలెయ్యండి.

నాకు ఆమెమీద గౌరవం అధికం కావటానికి బహుశా ఇదొక కారణం కావచ్చు. ఏది ఏమైనా చాలా కొద్దిరోజుల్లోనే ఆమంటె అంతులేని అభిమానాన్ని పెంచుకున్నా, మా యిద్దరివి ప్రక్కప్రక్క ఇళ్ళు కావటంతో సాయంత్రంపూట, తీరుబడిగా వున్నప్పుడు, ఏదైనా పుస్తంకోసమో, ఆ రోజు పేపరు కోసమో వస్తుండేది. అలా మొదలైన మా పరిచయం అనతికాలంలోనే వృద్ధిపొంది, రోజూ సాయంకాలం గంటలతరబడి బాతాఖాని కొట్టే వరకు వచ్చేసింది. ఇపుడు మా ఇద్దరి మధ్య ఎటువంటి అరమరికలుగాని, బెదురు భయాలుగాని లేవు. ఆమెకష్టం నాకు చెబుతుంది. నా చేతనైన సలహా యిస్తాను. ఆమె టీ చేసుకుంటే నాకూ తెచ్చిపెడుతుంది.

ఒక్కమాటలో చెప్పాలంటే, మేమిద్దరం మంచి స్నేహితులం. మా స్నేహంలో నీచమైన ఆలోచన్లు, అభిప్రాయాలులేవు. అక్షరాల ఆరోగ్యప్రదమైన స్నేహం.

అతడి పేరు గోపాలం—

పూర్తిపేరు గోపాలకృష్ణ. హెచ్ఎయల్లో పన్చేస్తాడు. నాకున్న మంచి స్నేహితుల్లో వాడొకడు.

నల్లగా, పొట్టిగా వుంటాడు. వాడిగడ్డం ఎప్పుడూ నున్నగా గీయబడి వుంటుంది. వాడి బట్టలు ఎప్పుడూ నలిగిపోయిగాని, మాసిపోయిగాని కన్పించవ్. వాడిచేతిలో ఎప్పుడూ సిగిరెట్ కాలుతూవుంటుంది. వాడికెప్పుడూ వూరంతా అప్పులుంటూనే వుంటాయ్. డబ్బులకోసం అప్పులాళ్ళొస్తే వాళ్ళకి కథల్చెప్పి, వాళ్ళ దగ్గర్నించే ఎదురుపుచ్చుకోగల సమర్థుడు. ఎప్పుడూ సందడిగా తిరుగుతుంటాడు. సందడికి, వుత్సాహానికి, మంచి మనస్సుకి మారుపేరు— మా గోపాలం.

ఏ మనిషి పరిపూర్ణుడు కాలేడు. ప్రతివారికి

ఏదో ఒక బలహీనత వుంటూనే వుంటుంది. అలానే గోపాల్‌కి గూడా ఒకే ఒక బలహీనతుంది.

గోపాలకృష్ణని వాళ్ళ పెద్దవాళ్ళు పేరుపెట్టేరనో, మరెందుకోగాని, వాడు కృష్ణావతారంలోని మిగతా విషయాలకన్నా, శృంగారాన్ని బాగా వంటబట్టించుకున్నాడు. వాడికి ఆడపిల్లలంటే ఆసక్తి కాస్త జాస్తి. వాళ్ళగురించి యెంతో డబ్బు ఖర్చుచేస్తుంటాడు. అసలు వాడికి యెంత మంది గర్ల్‌ఫ్రెండ్స్‌న్నారో కచ్చితంగా వాడికే తెలీదు. నేను యెన్నోసార్లు హెచ్చరించాను. కాని ఫలితం శూన్యం.

వాడికి భగవంతుడో గిఫ్టిచ్చాడు. ఆడదాని మొహం చూసి, ఆమె జాతకం గడగడా చెప్పెయ్యగలడు. ఆమె యెలాంటిది? మన స్తత్వం ఏమిటి మొదలైన వివరాలన్నీ పూస గుచ్చినట్లు చెపెయ్యగలడు. అసలు సావిత్రి, అనసూయ వాళ్ళ రోజుల్లో వీడు పుట్టుంటే వాళ్ళని గూడా సరిచేసేవాడని నాకో భయం వుంది. అలాగని పూర్తిగా చెడ్డవాడేంకాదు. నిప్పులాంటి ఆడవాళ్ళని చూస్తే చేతులెత్తి దణ్ణం పెడతాడు.

ఈ ఒక్క బలహీనత మినహాయించి అతడు మంచి స్నేహితుడు. అందుకే వాడితో నా స్నేహాన్ని కొనసాగించాను.

అసలిప్పుడు నా బాధంతా వాడి గూర్చిగాని, వాడప్పులు గూర్చిగాని, లేక వాడి గర్ల్‌ఫ్రెండ్స్‌ంతమందనిగాని కాదు.

వాడి దృష్టిలో కమల, నా స్నేహితురాలు పడింది. అది నాకో సమస్యయి కూర్చుంది. అదెలా జరిగిందంటే——

ఒకరోజు కాస్త బద్ధకంగా వుండి ఆఫీసుకి పోలేదు. సాయంత్రానికల్లా వాలాడు మా ఇంటి ముందు.

సరిగ్గా అదే సమయానికి కమల మా ఇంట్లో కూర్చుని కబుర్లు చెపుతోంది.

ఆమెని చూశాక రెండు నిమిషాలు అలాగే నిల్చుండిపోయాడు. లోపలికొచ్చి కూర్చొన్నాక గూడా, ఒక అయిదు నిమిషాలపాటు తీక్షణంగా ఆమె వంకే చూస్తూ కూర్చున్నాడు.

కమల మరో వ్యక్తి ప్రవేశంతో కబుర్లాపి 'వస్తానండి' అంటూ ఆ రోజు పేపరుతీసి వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళినవైపే గుడ్లప్పగించి చూస్తున్న వాడితో "ఏం, ఇలా తగులడ్డావ్? ఎవరూ తగల్లేదా?" అన్నాను.

"ఎవరామె?"

"పార్టీకెళ్ళాలన్నావ్. వెళ్ళలేదా?"

"నీ ప్రక్కవాటాలో వుంటుందా?"

"ఏదైనా పనిమీదొచ్చావా?"

"ఇంత అందమైన అమ్మాయుందని నాతో ఎన్నడూ చెప్పలేదే?"

నాకు ఒళ్ళు మండుకొచ్చింది. ఎన్ని మాటలాడినా వాడు సంభాషణ అటువైపునే తిప్పటంతో నాకు చిర్రెత్తుకొచ్చింది. అందుకే కాస్త సీరియస్‌గా "యూ ఫూల్-నీ వెధవదృష్టి ఆమె మీదెయ్యకు. ఆమె దేవత-నిప్పు-నిప్పులాంటిది. మాడి మసైపోతావ్ జాగ్రత్త" అన్నాను.

నా కోపం చూసో, మరెందుకోగాని వాడు పగలబడి నవ్వాడు. తర్వాత నవ్వాపుకుంటూ "సర్లె-కానిని కాఫీనీళ్ళన్నా కొట్టించు. నీ గురించి చాలా దూరం వచ్చాను" అన్నాడు.

నేను మౌనంగా లేచి, బట్టలేసుకుని, ఇంటికి తాళంవేసి, వాడితోపాటుగా రోడ్డెక్కాను.

హోటల్లో కూర్చున్నాక, మళ్ళీ అదే సంభాషణ మొదలెట్టాడు. "ఆమెవరు? ఎక్కడన్నా పనేస్తుందా? పెళ్ళయిందా?"

ఈసారి నాకు రెట్టింపు కోపం వచ్చింది.

కమల నా స్నేహితురాలు-మంచిది. విధి వంచితై, తనకాళ్ళమీద తాను నిలబడి, ఒక్కగానొక్క తన కొడుకుని వృద్ధిలోకి తీసుకురావాలని తంటాలుపడుతోంది. అటువంటి అభాగ్యురాల్ని ఈ కోతి వెధవ తన సహజమైన వెధవ దృష్టితో చూస్తూ, పైగా నన్ను క్రాస్ ఎగ్జామిన్ చేయటంతో నాకు బి.పి. పెరిగింది.

"రేయ్ ఇందాకే చెప్పాను——ఆమె వూసెత్తద్దని. ఆమె నువ్వనుకుంటున్నట్లుగాని, నీకు పరిచయం వున్న ఆడవాళ్ళ లాంటిదిగాని కాదు. ఆమె సంగతొదిలేయ్ —— ప్లీజ్" అన్నాను

రౌద్రంగా.

నేనింత కండలు చించుకుని మాట్లాడినా, వాడి మొహంలో ఎటువంటి మార్పు రాక పోవటం, నాకు ఆశ్చర్యం అనిపించింది.

వాడు తాపీగా సిగరెట్ తీసి వెలిగించి, "నీకు ఆడవాళ్ళతో అనుభవం తక్కువ. నీకు పెళ్ళి కాలేదు. కనీసం కనెక్షన్స్‌గూడా లేవు. కాని నేను గత పది సంవత్సరాలుగా ఆ ఫీల్డులో రీసెర్చి చేసాను. వాళ్ళొదిలిన శ్వాసనుబట్టి, నిలబడే తీరునిబట్టి, వాళ్ళ గుణగణాలని చెప్పెయ్యగల్ను" అన్నాడు.

నేను వింటున్నాను. వింటూ నా కోపాన్ని దాచాలని ప్రయత్నిస్తున్నాను.

"అసలు నీకు ఆడవాళ్ళలో ఎన్ని తెగ లున్నారో తెల్సా? తెలీదు. పూలల్లో ఎన్ని రకా లున్నాయో, ఆడవాళ్ళలో అన్ని రకాలవాళ్ళు న్నారు. కాని మనం కన్వీనెంటుగా, వారందరిని మూడు భాగాలుగా విభజించుకోవచ్చు."

వీడొచ్చి నన్నీ విధంగా తినెయ్యటం నాకేమాత్రం ఇష్టంలేదు. అయినా అలాగే కూర్చుని వాడి ప్రేలాపనని వినసాగాను.

"వాళ్ళల్లో మొదటి తరగతి పద్మినీ జాతి



స్త్రీలు. అంటే వాళ్ళు మనసా, వాచా, కర్మణా పతివ్రతలు. వాళ్ళు తీక్షణంగా చూస్తే మన లాంటి పక్షులు మసైపోతారు. వాళ్ళే నిజమైన పతివ్రతలు-ఇంక మూడో జాతి—"

"రెండోజాతి ఏమైనట్లు?"

"తొందరపడకు. చెపుతా. అన్నీ విపులంగా చెబుతా. ముందు మూడో తరగతి వాళ్ళనిగూర్చి ముచ్చటిస్తా. వీళ్ళు బాహాటంగా, అరమరికలు లేకుండా, బ్రతుకుతెరువు కోసం, తమ శరీరాలని, అందాన్ని, వయసుని అంగట్లోపెట్టి అమ్ముకుంటారు. పూర్ క్రీచర్స్!" మాట్లాడటం ఆపి, సిగరెట్టుని గట్టిగా పీల్చి, కాఫీ కలుపుతూ "ఇక మూడోజాతుంది చూశావ్—వీళ్ళు చాలా డేంజరు. పైకి చూట్టానికి వచ్చి పతివ్రతల్లా కన్పిస్తారు. వాళ్ళ మాట, నడవడి, తీరు అన్నీ పతివ్రత లక్షణాలే. కాని వీళ్ళకి లోపాయికారి మనలాంటి కస్టమర్స్, ఎకౌంటు హోల్డర్సుంటారు—ఎందుకనడక్కు. అది వేరే ప్రశ్న. అసలది వేరే సబ్జక్టు"

కాఫీ తాగుతూ నావంక చూసాడు.

అసలిదందా నాకెందుకు చెప్పాడో అర్థం కాక, అడిగాను.

వాడు కాఫీ పూర్తిగా తాగేసి, బిల్లుని నా చేతికిస్తూ "మీ ఫ్రెండు, మీ నైబర్—కమల నే చెప్పిన రెండోజాతికింద కొస్తుందని నా డవుటు" అన్నాడు.

"షటప్"

"అలా మండిపడకురా అబ్బీ! చెప్పాగా నీ కనుభవం తక్కువని. ఈ విషయాల్లో నే చెప్పిందే కరక్టు. తిరుగులేదు."

"అట్లా దారుణంగా మాటాడకు. కళ్ళు పేలిపోతాయ్."

"అనవసరంగా హైరానపడకు" వాడి చిరునవ్వు, మాట్లాడే తీరు చూసేసరికి నా సహనం పూర్తిగా అడుగంటిపోయింది.

"మిస్టర్ గోపాల్-మనం స్నేహితులుగా మిగిలిపోవాలంటే, దయచేసి ఆమెగూర్చి మాటాడకు. ఆమె దేవత. బ్రతుకుతో పోరాటం సల్పుతోంది. అటువంటి అభాగినులతో ఆడుకోకు. నీ బ్రాండ్ ఆడవాళ్ళతో నువ్వేమైనా చేసుకో! కాని కమల జోలికి రాకు. ప్లీజ్"

వాడేమనుకున్నాడో తెలీదుగాని, పైకిమాత్రం "సరే ఇట్సాల్‌రైట్ - కాని నిన్ను చూస్తే జాలేస్తోంది. మిణుగురు పురుగుల్ని చూసి నిప్పని భ్రమించకు. గుర్రం గాడిద ఒక్కటి కావు. వస్తాను" అన్జెప్పి లేచి వెళ్ళిపోయాడు.

అప్పటినించి కమలంటే నాకు జాలి, అభిమానం అధికం అయినాయ్. ఆమెని చూసినప్పుడల్లా, గోపాలన్న మాటలు గుర్తుకొచ్చి బాధగా వుండేది.

ఒకరోజు వుండబట్టలేక అడిగేశాను "నీ భర్త పోయాడని విన్నాను. మళ్ళీ వివాహం ఎందుకు చేసుకోలేదు?" అని.

నానుంచి ఇటువంటి ప్రశ్న నాశించని ఆమె రెండు క్షణాలు కంగారుపడింది. తర్వాత మెల్లిగా తలెత్తి "నా కిష్టంలేక. మా వాళ్ళు చాలా బలవంతం చేశారు. కాని ఆయన శారీరకంగా దూరమయ్యారేగాని నా గుండెలో ఇప్పటికీ సజీవంగా వున్నారు."

నాకు జాలేసింది. "కాని కమలా-ఈ భీతిక ప్రపంచంలో బ్రతకాలంటే మొగదిక్కు కావాలి. ఆడది ఒంటరిగా బతికెయ్యగల రోజులు ఇంకా మన దేశంలో రాలేదు. గుర్తుంచుకో."

"అవును. అదీ నిజమే. అందరూ నన్ను చూసి తలోమాటంటారు. నన్నుచూసి గుసగుసలాడుకుంటారు. నేనెంత నిజాయితీగా బతుకుతున్నా నా శీలాన్ని శంకిస్తారు. కాని....నేనేం పట్టించుకోను. నా మనస్సే నాకు సాక్షి."

నాకా క్షణంలో కమలమీద ఎంత అభిమానం పెరిగిందో, గోపాల్‌మీద అంత చులకనభావం ఏర్పడింది.

ఆ తర్వాత ఆ సంభాషణని యిద్దరం కొనసాగించలేదు.

తర్వాత చాలా రోజుల వరకు గోపాల్ నన్ను కలవలేదు. ఉన్నట్లుండి ఒకరోజు సుడిగాలిలా వచ్చిపడ్డాడు ఆఫీసుకి.

రావటంతోటే చురుకుగా కుర్చీ లాక్కుని కూర్చుంటూ "హలో డియర్ ఎల్లావున్నావు? హౌ యీజ్ యువర్ నైబర్" అన్నాడు.

నేను కోపంగా వాడివంక చూసేను.

"ఆయామ్ సారీ. బై దిబై నా కర్జంటుగా ఓ వచ్చనోటు సర్దుబాటుచెయ్యి. షరా మామూలే. తారీఖు రాగానే ఇచ్చేస్తాను. చాలా అర్జంటు. ఆటో వెయిటింగ్ అవుట్ సైడ్-ప్లీజ్."

నాకు నవ్వొచ్చింది. అయినా నవ్వునాపు కుంటూ "దేనికిట" అడిగేను.

"వివరాలొద్దు. చెబితే బాధపడతావ్ — ఇచ్చెయ్"

"ఇవ్వను."

"అసలున్నాయా? లేవా?"

"ఉన్నాయి. కాని దేనికో చెబితేగానివ్వను" అంటూ జేబులోంచి పర్సుతీసి, అందులో నుంచి వందరూపాయల కాగితంతీసి చేత్తో పట్టు కున్నాను.

"అయితే చెబుతా" అంటూ నా చేతిలో కాగితాన్ని తను తీసుకుని పెన్నుతో, వంద కాగితం తెల్లటిభాగం పైన 'చక్కని. కోసం' అని రాశాడు.

వాడి కోడ్ భాష నా కర్థం కాలేదు— ౨డిగేశాను.

వాడు మధ్యలోవున్న 'డాట్'ని చూపిస్తూ అడిగాడు "ఇదేమిటి"

"చుక్క."

"గుడ్. అన్నీ కలిపి చదువు.'.

చదివాను "చక్కని చుక్క-కోసం" తర్వాత గాని నాకు కోపం రాలేదు. కాని వాడప్పటికే ఆ కాగితంతోపాటు ఆటో ఎక్కాడు.

వాడి వెనకాల నేను నవ్వుకున్నాను.

వాడెళ్ళిన కాస్సేపటికి నాకు అనుకోకుండా తలనొప్పి ప్రారంభమైంది. అది మధ్యాహ్నం అయ్యేసరికి భరింపరానిదిగా తయారైంది. ఇంక ఆఫీసులో కూర్చోలేక పర్మిషన్ పెట్టి వచ్చేశాను.

ఒక తలనొప్పి మాత్రమింగి, కాస్త కాఫీ త్రాగి ఇంటికొచ్చి పడుకుని నిద్రపోయాను. అలా ఎంతసేపు పడుకున్నానో నాకే తెలీదు.

తలుపుతట్టిన చప్పుడవటంతో వులిక్కిపడి లేచాను.

రాత్రి ఏడు గంటలయింది.

మెల్లిగా లేచి తలుపు తీసాను. వాకిట్లో కమల నవ్వుతూ నిలబడుంది.

స్నానంచేసి, వుతికిన చీర కట్టుకుని, నీటుగా ముస్తాబై నిలబడి "ఏవిటి మాష్టారు ఆఫీసు కెళ్ళలేదా? నిద్రపోతున్నారు ఎటూ కానివేళ" అడిగింది.

"ఆఫీసుకెళ్ళి తలనొప్పిగా వుంటే వచ్చి పడుకుని నిద్రపోయాను. టైం తెలీలేదు."

కమల లోనికెళ్ళి కూర్చుంది. నాకు నిద్ర మత్తు పూర్తిగా వదలకపోవటంవల్ల మౌనంగా కూర్చుండిపోయాను.

అలా నేను మూంగిలా కూర్చోటం ఆమె కిబ్బందిగా తోచిందేమో "ఏంలేదు మాష్టారు మీవద్ద డబ్బులు తీసుకుని చాలాకాలం అయింది. ఎప్పటికప్పుడు ఇచ్చేద్దాం అనుకుంటూనే అశ్రద్ధ అయిపోతోంది. ఇవ్వాళ డబ్బు లొచ్చాయ్. ఇద్దామని వచ్చాను" అంటూ డబ్బు తీసి మంచంమీదుంచింది.

నేను ఆమెవంక చూస్తూ "ఏం పర్వాలేదు. అవసరమైతే నేనే అడిగేవాడిని" అన్నాను.

తర్వాత రెండునిమిషాలు కూర్చుని బజారు పనుందని వెళ్ళిపోయింది.

నేను లేచి తలుపుమూసి స్నానానికని బాత్ రూంకెళ్ళబోతూండగా డబ్బుతీసి పర్సులో పెట్టుకుందామని, ఆమె పరుపుమీదుంచిన నోటుని చేతిలో తీసుకున్నాను.

కరెంట్ తీగ పట్టుకున్నట్టుగా షాక్ తగిలింది-

అదేనోటు-వందరూపాయల నోటు-పొద్దున గోపాల్‌కి నేనిచ్చింది.

దానిమీద వాడు రాసిన 'చక్కని . కోసం' అన్నది అద్దంలో నా మొహంలా స్పష్టంగా కన్పిస్తోంది.

నాలోని ఓపికంతా నశించినట్లయింది.

గోపాల్ చెప్పిన 'మిణుగురు పురుగుల్ని చూసి నిప్పని భ్రమపడకు' అన్నమాట నా చెవుల్లో మార్మోగసాగింది.

అలా స్థాణువులా ఎంతసేపు నిల్చున్నానో నాకే తెలీదు. □

తెల్లవారొద్దు —చెన్నూరి నాగరాజు

గోడకున్న బిగ్‌బెన్ అయిదుగంటలు చూపిస్తుంది. ఇంకో గంటలో తెల్లవారుతోంది. సదానందానికి భయంగా వుంది. గంటలో తెల్లవారగానే తను సమస్యల వలయంలో పడతాడు. ఈ ఉదయాన్ని ఎదుర్కొనే సమస్యలలో కనీసం ఒక్క సమస్యనైనా ఎదుర్కొనగలిగే ఆత్మస్థైర్యంలేదు. తెల్లవారగానే పాలవాడితో యుద్ధం, పనిమనిషితో యుద్ధం, చాకలివాడితో యుద్ధం, పాన్‌షాపువాడితో యుద్ధం, మధ్యాహ్నం ఆఫీసు క్యాంటీన్ వెధవతో యుద్ధం.

టక్....టక్....టక్....టక్... చప్పుడు. ఈ చప్పుడు బిగ్‌బెన్‌ది కాదు సదానందం గుండెది. లెక్కెడుతున్నాడు. గుండె చప్పుళ్ళను ఒన్.... టూ....త్రీ .... ఫోర్.... సెవన్ .... థర్టీన్.... ట్వంటీ... థర్టీఫైవ్....ఫార్టీ....ఫార్టీసెవన్.... ఫిఫ్టీటూ....ఫిఫ్టీఫైవ్....సిక్స్టీఫోర్... సెవెంటీ సెవంటీటూ నిముషం గడిచిపోయింది. నిముషంలో గుండె డెబ్బయిరెండుసార్లు కొట్టుకొంది. యింకా యాభైతొమ్మిది నిమిషాలు నాలుగువేల రెండువందల నలభైఎనిమిది సార్లు ఈలోగా తన గుండె కొట్టుకొంటుంది. భరించలేను. వీధిలో నుంచుని చుట్టుపక్కల ఇళ్ళ వాళ్ళంతా వినేలా వాగే అడ్డమైన వాగుడుని సదానందం భరించలేడు. ఈలోగా తన గుండె ఆగిపోతే బాగుండుననుకున్నాడు. సదానందం గుండె కొట్టుకొంటూనేవుంది. బెడ్‌లైట్ వెల్తురులో బిగ్‌బెన్‌లోని సెకన్లముల్లు కదలడమూ కనిపిస్తూనేవుంది. కళ్ళు మూసుకున్నా నిద్ర రావడంలేదు. ఓ గంటసేపయినా ప్రశాంతంగా పడుకోవాలనుకుంటే ఉహూ॥ నిద్ర రాదే! నిన్న జరిగిన సంఘటన యింకా కళ్ళ ముందు నుంచి చెదిరిపోవటంలేదు.

తన చెల్లెల పెళ్ళికి మార్వాడి దగ్గర నాలుగేళ్ళక్రితం తెచ్చిన అప్పులో యింకా వెయ్యి రూపాయలు తీర్చవలసివుంది. వెధవ సరిగ్గా జీతం తీసుకునే టైముకే వచ్చాడు. కరకు చేతుల్తో, మొరటుమొహంతో అచ్చం తెలుగు సినిమా హీరోలా వున్నాడు. ఆ క్షణంలో జీతానికి తిలోదకాలివ్వక తప్పిందికాదు. లేకపోతే వాడు నడిబజారున లాగితే పరువేంకాను! నెలలో ముప్పయిరోజులు ఎలావున్నా ఒకటో తారీఖు సాయంత్రం చిరునవ్వుతో గుమ్మంలో నుంచొని స్వాగతం చెప్పే శ్రీమతికి జీతం రాలేదని అబద్ధం చెప్పక తప్పలేదు.

జీతం రేపయినా వస్తుందనే నమ్మకంతో ఈ ఒక్కరోజు పాలవాడికి నచ్చచెప్పలేనా అన్న భావంతో కాబోలు శ్రీమతి గాఢనిద్ర నుంచి యింకా మేలుకోలేదు.

ప్రతినెలా జీతం సరిగ్గా వస్తేనే పాలవాడికి సరిగ్గా డబులివ్వడంలేదు. పాలవాడికేమిటి ప్రతివాళ్ళకి యిచ్చేదాన్లోనూ తగ్గించందే మిగతా నెలంతా గడవదు. మరి ఈ నెల ఎలా? కళ్ళు మూసుకున్నా సదానందానికి ఆ చీకట్లో ఇంటి ఓనర్ రూపం కనిపించి భయపడి కళ్ళు మూసుకుంటే ఎక్కడ కనిపిస్తాడో అని కళ్ళు తెరుచుకుని పడుకున్నాడు.

ఇందాకట్నుంచీ గుర్తేలేదూ: నెల కాగానే ఉదయమే వచ్చి తలుపుతట్టి ఈ నెల అద్దె యిస్తారా అంటాడు- సీతకోసం వచ్చిన రావణాసురుడిలా. గీత దాటితే ఏమవుతుందో అన్న భయం సీతకున్నట్లు గడప దాటితే ఏమవుతుందో అన్న భయం సదానందం గుండె చప్పుళ్ళను రెట్టింపు చేస్తుంది. ఉదయంకాగానే ప్రతీసమస్యా ఒక ప్రాణగండమే. పాలవాడికి పోయిన్నెల పదిరూపాయలు తక్కువిచ్చాడు. అంతకు ముందునెల ఎనిమిది రూపాయలు ఇవ్వాలి. ఈ నెల ముప్పయి రూపాయలు. మొత్తం నలభైఎనిమిదీ ఒక్కసారీ ఇవ్వకపోతే మర్యాద దక్కదని నిన్ననే హెచ్చరిం



చాడు. వాడి తప్పుమాత్రం ఏముంది? నెలనెలా డబ్బులు రాకపోతే వాడి కుటుంబం యెలా గడవాలి?

ఆలోచనలు తెగాయి, గాలిపటం అంతెత్తున ఎగిరి హఠాత్తుగా దారం తెగినట్లు. వాస్తవంలోకి వచ్చి బిగ్ బెన్ చూశాను. ఆరుపది. అరే ఇంకా తెల్లవారదేం అనుకున్నాడు. కిటికీ తలుపులు తీసేవున్నాయి. కిటికీ అవతల నుంచి చుక్కలు కనిపిస్తున్నాయి. సదానందానికి బాగా జ్ఞాపకం వుంది ఆరుగంటలకి తెల్లవారుతుందని. అతని మనసులోని ఆలోచనలన్నీ యింకా యెందుకు తెల్లవారలేదన్న సమస్యవైపు మళ్లాయి. బిగ్ బెన్‌లో పెద్దముల్లు కదులుతోంది. గంటల ముల్లు ఏడుమీదికి వచ్చింది. కాళ్ళతో బ్లాంకెట్‌ని తన్నేసి లేచాడు. ప్రపంచం గిర్రున తిరుగుతున్నట్లుగానూ, ఆకాశం క్రిందికి, భూమి పైకి మారినట్లుగానూ అనిపించింది. శ్రీమతి కూడా లేచింది. ఇంకా తెల్లవారలేదన్న ఆశ్చర్యం ఆమె కళ్ళనిండా ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. పిల్లలు కూడా లేచారు. వాళ్ళకీ ఆశ్చర్యంగా వుంది. ఎవరికి ఆశ్చర్యంగా వుండదు కనుక.

ఆరు గంటలకు రావలసిన పాలవాడు యింకా రాలేదు. ఇంకా సూర్యుడూ రాలేదు. గూట్లోని టార్చి తీసుకొని గుమ్మం దాటాడు. పక్కింటి సుదర్శనము, ఎదురింటి ప్రకాశరావు ఆ పక్కింటిలో వున్న పెళ్ళికాని పంకజము యింకా ఆ వీధిలోని వాళ్ళంతా వాళ్ళవాళ్ళ గుమ్మాలాలో నుంచొని యింకా తెల్లవారక పోవడం గురించి చర్చించుకుంటున్నారు.

ఆ వీధిలోనే వుంటున్న సుఖజీవనరావు పరుగులాంటి నడకతో వచ్చాడు. ప్రతి చిన్న విషయానికి బోల్డు ఆశ్చర్యపడ్డా అతను యీ ఆశ్చరానికి తట్టుకోలేకపోతున్నాడు. ఏం మాటాడుతున్నాడో ఎవరితో మాట్లాడుతున్నాడో అతనికే అర్థంకావడంలేదు.

'ఏడు గంటలకి తెల్లవారకపోవడం ఏమిటి'

అని అందరినీ అడిగినా సుఖజీవనరావుకి తృప్తి కలిగించే సమాధానం దొరకలేదు.

'మళ్ళీ సతీసుమతి ఎవరైనా తన పాతి వ్రత్యాన్ని పరీక్షించుకోవడం లేదుకదా' అన్నాడు.

పాలవాడొస్తున్నాడు. అంతమందిలోనూ పంచాయతీ పడ్డదేమో. సదానందం అడుగులు వెనక్కి పడ్డాయి.

'ఏటండీ యింకా తెల్లవారలేదు. చూసి చూసి వస్తున్నా' అన్నాడు.

సదానందం మాట్లాడలేదు. పాలు పోశాడు. రేడియోలో ఏమన్నా చెప్పారా? అని అడిగాడు. సదానందానికి యింకా తెల్లవారకపోవడంకన్నా పాలవాడు డబ్బు అడగకపోవటమే ఆశ్చర్యంగా వుంది.

ఎనిమిదయింది. ఇంటాయన గొంతు విని పించింది గుమ్మం అవతల పిలుపు. తననికాదు. అయిదారు గొంతులు వినిపిస్తున్నాయి. బయటికి నడిచాడు సదానందం. 'ఏమండీ సదానందం గారూ ఏమిటీ విడ్డూరం. ఇలాంటిది ఎప్పుడైనా విన్నామా, కన్నామా' అన్నాడు-ఇంటి అద్దె అడగలేదు. ఇంకా తెల్లవారలేదేమిటి అంటు న్నాడు. లోకాభిరామాయణం. అంతా మాటల్లో పడ్డారు. సైకిల్ మీద పేపరు వాడు వచ్చాడు. అంతా పేపరు మీద దాడిచేసారు. తెల్లవారక పోవడం గురించి పేపర్లో ఏమీలేదు.

తెల్లవారలేదు కనుక యింకా లైట్లు వెలుగు తూనే వున్నాయి. పాన్‌షాపు వాడు వచ్చి షాపు తెరిచాడు.

అందరితో పాటే సదానందం కూడా అక్కడికి నడిచాడు. సిగరెట్ యిచ్చాడు సదా నందానికి. అక్కడున్న యిద్దరి ముగ్గురికి కూడా సిగరెట్లిచ్చాడు. ఎవరి దగ్గరా డబ్బులు తీసుకోలేదు. ఇంకా తెల్లవారకపోవడం గురించి తమ వీధిలోని వాళ్ళ కంగారుని కథలుగా చెప్పుతున్నాడు.

"తొమ్మిదవుతుంది ఆఫీసులకు వెళ్దామా" అన్నాడు ప్రకాశరావు.

చీకట్లో ఆఫీసు. లైట్ల వెలుగులో ఆఫీసు ఎలా వుంటుందో?

ఇంటికెళ్ళాడు 'నాన్నా ఈరోజు మార్నింగ్ షో ఎలా వుంటుంది' అన్నాడు ఆఖరివాడు.... అందరికీ ఎన్నెన్నో సమస్యలుంటే వీడికి ఈ సమస్య. మళ్ళీ అడిగాడు మార్నింగ్ షో వుండదా అని. వాడే అడిగాడు మళ్ళీ నాన్నా మా స్కూల్లో కరెంటు లేదు స్కూలు ఎలా నడుస్తుంది అని.

ఎలాగో నాలుగు చెంబులు నెత్తిన పోసు కుని, ఉడికీ ఉడకని బియ్యం అన్నంగా తిని ఆఫీసుకి వెళ్ళాడు-అందరూ వచ్చారు. ఎవరూ పని చెయ్యడంలేదు. కబుర్లు. మేనేజర్ కూడా వచ్చాడు, వచ్చి స్టాఫ్‌తో కలిసి కూర్చున్నాడు.

పన్నెండున్నరకి రేడియోలో వార్తలు విన్నారంతా. తెల్లవారకపోవడం గురించి ఎవరూ ఆందోళన చెందవలసిన పనిలేదనీ, ఎందుకు తెల్లవారలేదో శాస్త్రజ్ఞులు ప్రారంభించా రనీ చెప్పారు. అత్యవసర ప్రాతిపదికపై ప్రతీ వీధికీ విద్యుద్దీపాలు ఏర్పాటుచేస్తారని అధికార ప్రకటన చేశారు.

అందరూ గడియారాలు చూసుకుంటున్నారు. గడియారలైతే నడుస్తున్నాయి కానీ ఎంతకీ వెలుగు రావడంలేదు-చీకటి-అంతా చీకటి. అందరి మనసుల్లోనూ చీకటి. సదానందానికి మాత్రం ఈ విచారం ఏమీలేదు. పాలవాడు డబ్బు అడగలేదు, ఇంటాయన అద్దె అడగ అడగలేదు. పాన్ షాపువాడూ అడగలేదు. తెల్ల వారకపోవడంవల్ల సదానందానికి కలిగే సౌకర్యం యిది. అంతా థ్రిల్‌గా వుంది. ఏదో ఏదోలా వుంది మరేదోలా వుంది.

మొహంమీద చెంబుడు నీళ్ళు పోసినట్లని పించింది. సదానందం కళ్ళు తెరిచాడు.ఎదురుగా భార్య! కళ్ళలో కోపం, బాధ కలగలిపి చూస్తోంది. ఆఖరివాడు ఆలపిస్తున్న ఆరు న్నొక్క రాగం చెవులని బద్దలు కొడుతుంది. "ఏడవుతోంది యిక లేవరా ఈవేళ. పాల వెధవొచ్చి నానామాటలూ అని వెళ్ళాడు, జీతం ఈవేళైనా వస్తుందా రాదా!?" యింకా యేమిటేమిటో అంటూంది. సదానందం మెదడు మొద్దుబారింది. □

కళావాచస్పతి జగ్గయ్య

చలనచిత్ర జీవిత రజితోత్సవం!

ఇది జగ్గయ్యగారి సిల్వర్‌జూబ్లీ సంవత్సరం. నిజానికి సంవత్సరంమీద సంవత్సరం దాటిన సంవత్సరం. విఘ్నేశ్వరుడి పెళ్ళికి వెయ్యి విఘ్నాలన్నట్టు 77 చివర్లో తలపెట్టిన ఆయన జూబ్లీ ఫంక్షన్‌కి అనేకం వచ్చాయి విఘ్నాలు. తన ఫంక్షన్‌కి స్వస్తి చెప్పించి ఆనాడు తుఫాన్ బాధితుల సహకార యాత్రకు బయలుదేరారు. ఆ తర్వాత మరికొన్ని ఆటంకాలు. ఈ సంవత్సరం కాస్తలో తప్పింది ఆయన ఉత్సవానికి ఆటంకం. మే 6వ తేదీని లక్షమంది జనంతో అద్భుతంగా జరిగింది ఉత్సవం. మే 12న మళ్ళీ వచ్చింది తుఫాను. అప్పుడు వేలాది ప్రజల్ని బలి తీసుకుంటే యిప్పుడు విపరీతమైన ఆస్తి నష్టమూ పంట నష్టమూ, పైకప్పు నష్టమూ. మే 12 తర్వాత శ్రీ జగ్గయ్య ఉత్సవం నిర్ణయింపబడి వుంటే యిదీ వాయిదా పడివుండేదే. మొత్తంమీద తుఫాన్లూ జగ్గయ్యగారూ సవాల్ చేసుకొన్నారేమోగాని తుఫాన్ మోసపోయింది. జగ్గయ్యగారు గెల్చారు. పెద్దపెట్టున తిరిగి యేర్పాట్లు చేసిన నిర్వాహకులు అదృష్టవంతులు. మంత్రులు మదన్‌మోహన్‌కీ మానిక్‌రావుకీ మాట దక్కింది. యిరవైనాలుగ్గంటలూ పరిశ్రమించిన రామవిజేత బ్రదర్స్‌కీ, తిలక్‌గారికీ కిషన్‌భాయ్‌కీ సంతృప్తి సమకూడింది.

శ్రీ నారాయణరెడ్డిగా రన్నట్టు శ్రీ జగ్గయ్య తల ఒక 'విజ్ఞాన సర్వస్వం'. సాహిత్యం, సాంప్రదాయం, సంస్కృతి ఒక్క మాటలో చెప్పాలంటే విశ్వ విశ్వంభరావలయానికి చెందిన సంస్కృతి రాజకీయాలూ, కళ. కళకు చెందిన గళం, వాస్తు జ్యోతిషం ఒక టేమిటి ఆయనలో లేనివి లేవు. అన్నిటికీ ప్రతినిధీ మూర్తీ ఒక్కమాటలో చెప్పాలంటే హక్కుదారు ఆయన.

పది సంవత్సరాలుగా ప్రపంచ రాజకీయాల పోకడను పరిశీలిస్తూ పరిశోధిస్తూ రాస్తూనే వున్నారు, ఆయన ఒక ఉద్గ్రంథాన్ని 'రాజకీయ విజ్ఞాన సర్వస్వం'గా పేరుపెట్టి. అలాగే తరచి తరచి మధించి మధించి ఓర్చి ఒడపోసి ఆ ఒడపోతకు తన మధురమైన ఊపును చేర్చి రచించారు టాగూరు గీతాల్ని తెలుగులో. రెండోది త్వరలోనే వెలుగు చూస్తుంది విజ్ఞుల శిరఃకంపనలు స్వీకరిస్తూ, మొదటిది బయట పడాలంటే ప్రభుత్వాలే భరించాలి,లేదా సహకరించాలి, కొన్ని లక్షలు ఖర్చవుతుంది గనుక. అందుకు ఒక రకంగా ఒక మార్గంలో హామీ యిచ్చారు ఉత్సవ సభలో మంత్రులు. అదే నిజమైతే మన విశ్వవిద్యాలయ విద్యార్థులకు మంచి ఆరోగ్యకరమైన 'ఆహారం' దొరుకుతుంది అనతికాలంలోనే.


ఎంత సంపాదించినా సంపాదిస్తున్నా శ్రీ జగ్గయ్య సామాన్యుల్లో సామాన్యుడే. 'నాకు సామాన్యుల్లో సామాన్యుడుగా బ్రతకాలని వుంది' అని వేరే ఉత్సవ సభలో చెప్పుకోనక్కర్లేదు శ్రీ జగ్గయ్య. ఆయన్ను చదివిన వాళ్ళందరికీ తెలుసు ఆయనేమిటో. ఒకరోజున ఆయనకు విదేశాల నుంచి ఒక పుస్తకాల పార్సిలు వచ్చింది. దాదాపు పదివేలు కట్టి విడిపించి మూతలు తెరిచారు. అందులో ఒక చిన్నసైజు బ్రీఫ్‌కేసు వుంది. నిజానికది బ్రీఫ్‌కేస్ కాదు. ఇంగ్లీషు డిక్షనరీ. పేజీలు తిరగేస్తే ఏదో నలుపు కనిపిస్తుందే తప్ప అక్షరాలు కనబళ్ళేదు. అందులోనే అమర్చిన అరచెయ్యంత భూతద్దాన్ని పుస్తకంలోని ఒక పేజీకి పిన్ను చేశారాయన. అప్పుడు కనిపించాయి ముచ్చటైన అక్షరాలు ముద్దుగా పెద్ద పెద్దవిగా. అంత చిన్న సైపు కాకపోతే ఇంకా ఎన్నో పేజీలు వుండేవేమో అందులో! దాని ఖరీదు దాదాపుగా రెండున్నరవేలు! తక్కిన పుస్తకాలు జాగ్రఫీలూ హిస్టరీలూ దేశ విదే


శాలకు సంస్కృతులకు చెందిన విజ్ఞాన సంపుటాలూ. రాజుల సొమ్ము రాళ్ళపా లంటారు పెద్దలు. కళాకారుల సొమ్ము రక రకాల కామేచ్ఛలకు ఖర్చవుతుంది సాధార ణంగా. జగ్గయ్యగారి లక్షలు పుస్తకాలకే ఖర్చవుతాయి. బీరువాల నిండా నిండి తల

పరిధిని మించి. ఆయనకు తెలియని సబ్జక్టు లేదు

పార్లమెంటుకు గెల్చి వచ్చినప్పుడూ అసెంబ్లీకి ఓడిపోయి వచ్చినప్పుడూ రెండిటా కూడా ఆ మూర్తిలో ముఖంలో తేడా కన బడదు. గెలుపోటములు సర్వసాధారణాలు

'జూదగాడు'లో జగ్గయ్య





'బొమ్మలకొలువు' సెట్లో జగ్గయ్యను అభినందించినపుడు జగ్గయ్యతో వాసిరాజు ప్రకాశం, యన్. యస్. మూర్తి


ఆయనకు. గెలిచినా ఓడినా ఏనుగే ఆయన. ఏనుగు కనుకనే ఆయన పార్టీ యేదైనా అన్ని పార్టీల నాయకులూ పాలకులూ పూనుకున్నారు ఉత్సవాన్ని రక్తికట్టించడానికి. ఎవరిపట్లా రాగద్వేషాలు వుండ వాయనకి అనేస్తాం సాధారణంగా. కాని రాగం తప్పితే ద్వేషమెరుగని వ్యక్తి. ఆ రాగం యెవరిపట్ల చూపించాలన్న తర్కం వుండ దాయనకు. కాలేజీలో బిడ్డకు సీటు దొరకలేదని వచ్చే అపరిచితుడూ, మొన్న రాత్రి తనను ఘనంగా సత్కరించిన సన్నిహితుడైన సన్మిత్రుడూ ఒకటే ఆయనకు. ఆ పని పూర్తి చేసి ఆ హృదయం సంతసిస్తే తప్ప తనకు నిద్ర రాదు. నిద్రమీద రీసెర్చి చేసి పెద్ద పెద్ద వ్యాసాలు కూడా రాశా రాయన మంచి మాణిక్యంలా కలకాలం మన మనస్సుల్లో నిల్చిపోదల్చి. నిద్ర గురించైనా రాయగలరు మెలకువ గురించైనా రాయగలరు. రెండూ కూడా ఆయనకు తెలిసినంతగా ఆయన అనుభవించినంతగా మరెవరూ తెలుసుకుని వుండరు. అనుభవించి వుండరు.

ఆయన పొద్దుపోయి పడుకుని లేటుగా లేచి షూటింగులకు వస్తారనీ లేటుగా షూటింగులకు వచ్చి పొద్దుపోయేదాకా పని చేస్తారనీ యీ రెండూ కూడా తనబోటి మనిషి ఆరోగ్యానికి పడవనీ ఉత్సవ సభలో అక్కినేని చమత్కరించినప్పుడు శ్రీ జగ్గయ్య యిచ్చిన జవాబు ఆయన సమయస్ఫూర్తికీ చతురోక్తికీ తార్కాణాలు. 'అక్కినేనిగారి ఆరోపణలను సగర్వంగా స్వీకరిస్తున్నాను' అన్నా రాయన, సభ కరతాళ ధ్వనులతో దద్దరిల్లిపోగా!

శ్రీ జగ్గయ్య సినిమా రంగంలో పెరుగుతున్న వాచస్పతి. ఆ వచస్సు కళాత్మంగా వుంటుంది గనుక కళావాచస్పతి. ఆ కంఠం వినిపించినంతవరకూ పులకిస్తూనే వుంటుంది ప్రజల కళాహృదయం.

—కొగడా శర్మ

శ్రీశ్రీ నిర్వహించు పదబంధ ప్రహేళిక



ఆధారం జూలై '79

అడ్డం

1. వికారం ఉన్నా లేకున్నా విదేశీ
3. డిజో
5. కోరి
7. నిజం ఉన్న చక్కదనం
9. ఆఫీసులో, భరతనాట్యంలో
10. కొండమ్మ
12. విసురు
13. నాలు నమస్కారాలు
15. కోరు మోసకాడు
16. బింబం నెలకొకసారి
17. ఈ పత్రిక
18. సమూహం
20. తనం ధూర్తగుణం
22. నోటికూత
23. మన రాష్ట్రపు దేహా!
25. తోటకూరది, తలక్రిందులు
27. ప్రసిద్ధి చెందెను

29. ఎడ్రసులు ఉపన్యాసాలు కావు

31. బొమ్మల ముడిదినుసు

32. మైకాపుట్టిల్లు

నిలువు

1. జ్వాలాముఖి కవిత్వం
2. కాలకం పుట్టుమచ్చ
3. దీని కిందికే గడ
4. వెంటనే
5. బాళికి తాళింది 16 చూడుడు
6. రెండో 12 గంటలు
7. నాపురం లేనిది
8. ఇంగ్లీషులో ప్రవహించేది, తెలుగులో వికసించేది.

11. వని కునికి పట్టు

14. విజయ 15 పండుగ

15. పండుగ రోజులు

18. అందెల రవళి

19. కావ్యనాయిక

21. సర్కస్ పిల్ల

22. ప్రసవించె

23. బొమ్మలు మాట్లాడవు

24. కొండరెక్కలు కోసింది

26. నడిచే నాలుగోవంతు

28. పీతదీ, పందిదీ

30. బొరియమాదిరి.

జూన్ పదబంధ ప్రహేళికకు సమాధానం:

అడ్డం: 1. ఎడా 3. మాని 5. పదుగురు 7. ఆవులింత 9. జరీ 10. చిగురు 12. పుట్ట 13. తడి 15. పిలు 16. పోక 17. మీద 18. సాలు 20. పస 22. కక్షి 23. వినోబా 25. మన 27. సత్కారాలు 29. తురీయాలు 31. రంకు 32. గోలు.

నిలువు: 1. ఎదురీత 2. డాగు 3. మావు. 4. నిలింపులు 5. జనం 6. రుచి 7. ఆరు 8. తట్ట 11. గురి 14. డిపోలు 15. పిదప 18. సాక్షాత్కారం 19. ఇనో 21. సమయాలు 22. కస 23. విలు 24. బాతు 26. నలు 28. రాకు 30. రిగో.

నిబంధనలు గమనించండి!

పదబంధ ప్రహేళిక కొట్టివేతలు, దిద్దుబాట్లూ లేకుండా పూర్తిచేసి జూన్ 27 వ తేదీలోపు మాకు చేరునట్లు పంపండి. తెల్లకాగితం మీద గళ్ళు గీసి పూర్తిచేసి పంపిన ఎంట్రీలు చెల్లవు. ఎంట్రీలు పంపువారు వారి పూర్తి చిరునామా ఎంట్రీపైనే రాసి పంపాలి. ఆల్ కరెక్టు ఎంట్రీకి రు. 50/- బహుమతి. ఒకటికి మించి ఆల్ కరెక్టు ఎంట్రీలు వొచ్చినప్పుడు బహుమతి సొమ్ము విజేతలకు సమానంగా పంచబడుతుంది. ఆల్‌కరెక్టు ఎంట్రీ ఒకటీ రాకపోతే బహుమతి సొమ్ము పై నెల బహుమతి సొమ్ముకు కలిపి అందజేయబడుతుంది.

గతసంచిక పదబంధ ప్రహేళిక విజేతలు:

గతసంచిక పదబంధ ప్రహేళిక 5 నిలువు, 5 అడ్డం ఆధారాలివ్వడంలో పొరపాటు దొర్లిన కారణంగా ఆ రెండింటి సమాధానాలు ఎలా ఉన్నా వదిలేసి మిగతావి మాత్రమే చూడటం జరిగింది. ఈ క్రిందివారు విజేతలై బహుమతి సొమ్మును పంచుకొన్నారు.

కె. జె. ఎం. కృష్ణారావు-ఏలూరు, ఆర్. శ్రీమన్నారాయణ శర్మ, ఎన్. కె. రామారావు-నల్గొండ, జి. సుబ్రహ్మణ్యం, వి. గోపాలకృష్ణ-మద్రాసు, శ్రీమతి టి. హరి ఎమ్. లక్ష్మి-హైదరాబాదు.


సినిమా

చిత్రం పేరు మార్పు

ప్రముఖ దర్శకుడు ఎస్. డి లాల్ దర్శకత్వంలో జాన్‌షాక్ ఫిలింస్ సమర్పించు కలర్ చిత్రం పేరు మార్చారు. మొదట 'ఆడదానికి అందమే శత్రువు' అని పేరుపెటారు. కాని ప్రస్తుతం పేరు "షోకిల్లా రాయుడు". "షోకిల్లా రాయుడు" చిత్రంలో హీరోగా మోహన్‌బాబు, అతని సరసన రాజీ, చక్రపాణి, నూతన్ ప్రసాద్, రావికొండలరావు, హాట్టిప్రసాద్, రవికృష్ణ, వీరభద్రరావు, మల్లాది, సుప్రియ, పుష్పకుమారి, మరియు ముఖ్యైఆరుమంది నటీమణులు పాల్గొంటున్నారు. ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మించే యీ చిత్రానికి మాటలు: భమిడిపాటి, సంగీతం: చక్రవర్తి, పాటలు: వేటూరి, జాలాది, నిర్వహణ: సయదీమ్ర్, ఫోటోగ్రఫి. ఎస్. ఎస్. లాల్, దర్శకత్వం: ఎస్. డి. లాల్.

"రారా కృష్ణయ్యా" షూటింగ్ పూర్తి

సుప్రభాతా ఆర్ట్ ప్రొడక్షన్స్‌వారి "రారా కృష్ణయ్యా" చిత్రీకరణ తణుకు దగ్గరలో గల



'ఇది కథ కాదు'—జయసుధ, కమలహాసన్



'గోరింటాకు'లో శోభన్‌బాబు, సుజాత

పుంగ్రాజవరం పరిసర ప్రాంతాలలో పూర్తి అయింది. మనిషి, మనిషికి ఒక మనస్సు వుంటుంది. మనసు, మనసుకి ఒక మమత వుంటుంది అవి చాటిచెప్పే కుటుంబ గాధ "రారా కృష్ణయ్య". పూర్తి అవుట్‌డోర్‌లో నిర్మించిన యీ చిత్రంలో చంద్రమోహన్, మాధవి, పల్లవి, నిర్మల, ఈశ్వరరావు, దేవదాస్, చక్రపాణి, సుంకరలక్ష్మి, అనిత, పొట్టి ప్రసాద్, నూతన నటుడు జె.వి. సోమయాజులు (డెప్యూటీ కలెక్టరు), ముక్కుపాటి కృష్ణ మోహన్, వల్లూరి వెంకట్రామయ్య మరియు కళావాచస్పతి జగ్గయ్య పాల్గొంటున్నారు. గోపి రాసిన కృష్ణాష్టమి ఏడునిమిషాలు అన్న పాట చిత్రీకరణ అతి పెద్ద ఎత్తుగా ఖర్చుచేసి చిత్రీకరించారు. ఈ చిత్రీకరణలో దాదాపు మూడు వందల పైగా జనం పాల్గొన్నారు "రారా కృష్ణయ్య"కు రచన: గోపి, సంగీతం: ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం, కెమెరా మధుసూదన్, ఆర్ట్: తోట, నిర్మాతలు: కొత్తా సాంబశివరావు, అనుమాల బాలజీ చంద్రశేఖర్‌రావు, దర్శకత్వం యోగి.

కోడళ్లు వస్తున్నారు జాగ్రత్త....

విజయవంతమైన "వియ్యాలవారి కయ్యాలు" నిర్మించిన జాగర్లమూడి రాధాకృష్ణమూర్తి, పల్నాటియుద్ధం, రాజపుత్ర రహస్యం, నిర్మాతలలో ఒకరైన యార్లగడ్డ లక్ష్మయ్య చౌదరి కలిసి నిర్మించు అపురూప కానుక విష్ణుప్రియా ప్రొడక్షన్స్‌వారి "కోడళ్లు వస్తున్నారు జాగ్రత్త." కట్టా సుబ్బారావు స్క్రీన్‌ప్లే, దర్శకత్వం బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పెద్ద తారాగణం పాల్గొనే యీ కలర్ చిత్రం రికార్డింగ్ జూన్, జూలైలో పూర్తిచేసి ఆగష్టు నెల్పుకు వెళ్ళుతారు.

పాము పగకాదు మావూరి దేవత!

యం. రామకృష్ణారెడ్డి సమర్పించు రామకృష్ణా ఫిలింస్‌వారి చిత్రానికి "పాము పగ"గా పేరుపెట్టారు. కానీ కథకు అనుగుణ్యంగా, అందం." అందరికీ అందుబాటులో వుండేటట్లుగా "మా వూరి దేవత"గా మార్చేరు. రంగులలో తయారవ్వే యీ చిత్రంలో రంగనాథ్, ప్రభాకరరెడ్డి, మోహన్‌బాబు, కాంతారావు, హరిబాబు, జయభాస్కర్, లక్ష్మీకాంత్, సి. హెచ్. కృష్ణమూర్తి, కె. కె. శర్మ, ప్రభ, పల్లవి, సత్యకళ మొదలగువారు పాల్గొంటున్నారు. ఈ చిత్రానికి రచన రాజశ్రీ, సంగీతం చక్రవర్తి, కెమెరా. కె. ఎస్. మణి, కళ: భాస్కర్‌రాజు, ఎడిటింగ్ నరసింహారావు. సహాదర్శకుడు. చిట్టిబాబు, నిర్మాతలు మొలకల సుబ్బరామిరెడ్డి, యం. ప్రభావతమ్మ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: గిరిధర్ బి. కాం.


యం. యస్. రెడ్డి అందగాడు

నిర్మాత యం.యస్. రెడ్డి రూపొందిస్తున్న అందమైన చిత్రం పేరు 'అందగాడు.' ఊటీ ప్రకృతిదృశ్యాల మధ్య చిత్రీకరించబడుతున్న ఈ వర్ణచిత్రంలో కమలహాసన్ కథానాయకుడుగా నటిస్తున్నాడు. శ్రీదేవి కథానాయక. అంగడిబొమ్మద్వారా అందర్నీ అలరించిన సీమ ఒక ముఖ్యపాత్ర పోషిస్తున్న యీ చిత్రంలో ఇంకా రావుగోపాలరావు, అల్లురామలింగయ్య, రావికొండలరావు, పి.ఆర్. వరలక్ష్మి మొదలగువారు నటిస్తున్నారు.

'సూపర్ మేన్'గా ఎన్టీఆర్

లక్ష్మీవిష్ణు ప్రొడక్షన్స్ సంస్థ ఎన్. టి రామారావు కథానాయకుడిగా నిర్మించ తలపెట్టిన సూపర్‌మేన్ వర్ణచిత్రం షూటింగు విదేశాలలో జరుగుతుంది. యన్. టి. ఆర్.

'నా యిల్లు-నా వాళ్ళు'లో మురళీమోహన్, శ్రీధర్



యాక్షన్ థ్రిల్లర్ వర్ణచిత్రాలలో ఒకటిగా 'సర్కస్ రాముడు' తయారౌతోంది. ఎన్. టి. రామారావు, జయప్రద, ప్రభాకరరెడ్డి, అల్లు రామలింగయ్య, నగేష్ మొదలైనవారు నటిస్తున్న ఈ చిత్రానికి దాసరి నారాయణరావు దర్శకత్వం వహిస్తున్నారు. సంగీతం కె.వి. మహాదేవన్. కేసీ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్మించే యీ చిత్రానికి నిర్మాత కోవై చెళియన్

కొత్త దర్శకుడు!

ఆర్.యస్ రామరాజు సౌమ్య సినీ పతాకంపై నిర్మిస్తున్న 'జాతర' చిత్రంద్వారా ధవళ సత్యం, దర్శకుడిగా తెలుగు ప్రేక్షకులకు పరిచయం అవుతున్నారు. చెరుకూరి జనార్దన రావు ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.

మరో కొత్త దర్శకుడు!

శ్రీ వాసవీ ప్రొడక్షన్స్ సంస్థ తమ తొలి ప్రయత్నంగా నిర్మించ తలపెట్టిన వర్ణచిత్రాన్ని (పరుచూరి నాటిక 'సమాధి కడుతున్నాం చందా లివ్వండ'కి చిత్రరూపం) నూలి రంగయ్య, పులిపాటి వెంకటేశ్వర్లు నిర్మాతలు. ఈ చిత్రం ద్వారా గూనా నాగేంద్రప్రసాద్ దర్శకుడిగా తెలుగుప్రేక్షకులకు పరిచయమౌతున్నారు. ఈ చిత్రానికి కథ, మాటలు పరుచూరి సమకూర్చగా, పాటలు శ్రీశ్రీ, జాలాది రాశారు. జె వి. రాఘవులు సంగీతం, కె యస్. ప్రసాద్ ఫోటోగ్రఫీ నిర్వహిస్తున్నారు.

ఇంకో కొత్త దర్శకుడు!

తెలుగుతెరపై దర్శకత్వశాఖకు కొత్తరక్తం మెండుగా వస్తోంది. స్టేజినటుడుగా, నాటకాలకు



సమర్థవంతమైన దర్శకుడిగా అనుభవం గలిగి, చలనచిత్ర దర్శకత్వ శాఖలో కూడా విశేషానుభవాన్నార్జించిన బీరం మస్తాన్‌రావు దర్శకత్వంలో తిరుపతి ఇంటర్నేషనల్ వారు ఒక చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆ చిత్రంలో కృష్ణ, జయప్రద, నటిస్తున్నారు. కె. విద్యాసాగర్ నిర్మాత.

కళాసాగర్ చే సినీనటి శారదకు ఘన సన్మానం

జాతీయ స్థాయిలో 1978 సంవత్సరపు ఉత్తమనటిగా అవార్డు పొందిన శ్రీమతి శారదను మద్రాసు ఆంధ్రుల అభిమాన సాంస్కృతిక సంస్థ 'కళాసాగర్' మే 5 వ తేదీన స్థానిక కల్యాణ్ ఆరంగంలో ఘనంగా సన్మానించింది. ఈ సన్మాన సభ కార్యక్రమంతో అన్ని రంగాలకూ చెందిన ప్రముఖ వనితలు పాల్గొనడం మరో విశేషం. 'జ్యోతి' మాసపత్రిక సంపాదకురాలు శ్రీమతి లీలావతి రాఘవయ్య అధ్యక్షతన జరిగిన యీ సభలో గత సంవత్సరం ఉత్తమనటి అవార్డు అందుకున్న ప్రముఖ నటి శ్రీ లక్ష్మి రచయిత్రి శ్రీమతి మాధవీలత ప్రసంగించారు. కళాసాగర్ తరఫున సమర్పించబడ్డ సన్మాన పత్రాన్ని శారదకి లక్ష్మి అందజేశారు. ఆమెను నిలువెత్తు పూలమాలతో ముంచి పట్టు పొన్నాడైతోనూ, పంచలోహముల తంజావూరు ప్లేటు మొమెంటోతోనూ కళాసాగర్ పోషకురాలు శ్రీమతి లలితా రత్నం బి.వి.ఎస్.ఎస్. మణి ఘనంగా సత్కరించాడు. ప్రేక్షకుల్లో నుంచి ప్రముఖ నటుడు శ్రీ మురళీమోహన్, చిత్రకారుడు శ్రీ అంకయ్య, అనేకమంది కళాసాగర్ సభ్యులు వేదికపైకి వచ్చి శ్రీమతి శారదను పూలమాలాలంకృతులను గావించి అనేక బహుమతులతో అభినందించారు. ప్రముఖ నేపథ్య గాయకుడు శ్రీ పి. బి. శ్రీనివాస్ "కళాసాగర్" సాంస్కృతిక

కళాసాగర్ నటి శారదకు చేసిన సన్మానం సందర్భంగా శారదకు సన్మాన పత్రాన్ని అందజేస్తున్న నటి లక్ష్మి. మధ్యనున్నవారు సభకు అధ్యక్షత వహించిన శ్రీమతి లీలావతీ రాఘవయ్య.



రంగంలో గావిస్తున్న అపారమైన కృషిని, శ్రీమతి శారద సాధించిన ఘనతనూ శ్లాఘిస్తూ అప్పటికప్పుడు వ్రాయ రచించిన పాటను పాడి ప్రేక్షకులను రంజింపజేశారు. తనకు జరిగిన ఈ ఘన సన్మానానికి శ్రీమతి శారద 'కళా సాగర్' సంస్థకు కృతజ్ఞతలు తెల్పుకున్నారు.

సన్మానానంతరం ఊర్వశి శారద గౌరవార్థం యేర్పాటుగావించబడ్డ శ్రీ యండమూరి వీరేంద్రనాథ్ రచించిన "రఘుపతి - రాఘవ రాజారాం" నాటకాన్ని హైదరాబాదుకు చెందిన శ్రీ విజయ కళాసమితి వారు ఎంతో చక్కగా ప్రదర్శించారు.



'అండమాన్ అమ్మాయి'లో వాణిశ్రీ, నాగేశ్వరరావు

కలత చెందిన కరుణామయుడు!

కరుణామయుడు వర్ణచిత్రం విజయోత్సవాన్ని, 150 రోజుల పండుగగా జరుప సంకల్పించిన ఆ చిత్రనిర్మాత, కథానాయకుడు విజయచందర్ అన్ని ఎర్పాట్లూ చేసుకొన్నాడు. ఆహ్వాన పత్రాల ముద్రణ కూడా జరిగిపోయింది. అదే సమయానికి విజయవాడనుంచి కారులో మద్రాసుకు వస్తూ తుపాను కారణంగా టంగుటూరు (ప్రకాశం జిల్లా) లో ఎనిమిది గంటలు ఆగిపోవలసి రావడంతో, అక్కడ ఆ చుట్టుప్రక్కల జరిగిన విపరీతమైన నష్టాన్ని చూసి కలతచెందాడు విజయచందర్. దానికి తోడు ఆ చుట్టుపట్ల గ్రామాల పేద ప్రజలు ఇతన్ని గుర్తుపట్టి 'ఏమిటి కరుణామయుడా ఇంత పనిచేశావ్ మన ల్నిలా కష్టపెట్టున్నావెందు' కని ఇతన్నే క్రీస్తుగా నిలబెట్టి ప్రశ్నించటంతో మరింత కరిగిపోయాడు. మద్రాసు రావడంతోనే తన చిత్రం విజయోత్సవ వేడుకలని రద్దుచేసి, తుపాను బాధితుల సహాయార్థం పది వేల రూపాయల సహాయాన్ని ప్రకటించాడు.

తిరుపతి దేవస్థానంలో బాపు

చిత్రకారుడు, చలనచిత్ర దర్శకుడు బాపు తిరుపతి వెళ్ళడం వార్త కాదు ఆయన ,ప్పుడు తిరుపతి దేవస్థానానికి ఆస్థాన చిత్రకారుడిగా నియమించబడ్డారు. (బహుశా వెంకటేశ్వర స్వామి చాలా ఆనందించి ఉంటాడు ఆ వార్త విని)

—యస్వీనారాయణ

రచన చేసే ఆసక్తిగల

విద్యార్థులకు

జ్యోతి

అందిస్తున్న అపూర్వ అవకాశం!

ప్రత్యేకంగా విద్యార్థుల రచనల పోటీ

జ్యోతి ఏర్పాటు చేస్తున్నది

రచయితలు కాగోరు విద్యార్థులు

సిద్ధంగా ఉండండి

పూర్తి వివరాలు

వచ్చే సంచికలో చూడండి!

—ఎడిటర్

Edited&Published by V. Leelavathy Raghavaiah, at 17B Rajaram Colony Kodambakkam, Madras-600024&Printed by D. HanumanthaRao at Kranti Press, 12, Francis Joseph Street, Madras-600001.